RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 16.02.2026 | సంపుటి : 12 సంచిక : 208 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## ప్రజాతీర్పును గౌరవించడం నేర్చుకోండి




### ప్రజలపైనా, ప్రజాస్వామ్యంపైనా నమ్మకంలేని విపక్షాలు

- మాకు సేవ చేయడానికే అవకాశం ఇచ్చారు
- పాలకుడిగా నేను ఎప్పుడూ ప్రవర్తించలేదు
- సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నా..
- లంబాడీలు నాకు అండగా నిలిచారు
- సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తాము పాలకులం కాదు సేవకులమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. పాలకుడిగా తాను ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. నేనే రాజు నేనే మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. గెలుపు ఓటమి అన్నింటికీ తానే బాధ్యత తీసుకుంటానని చెప్పానన్నారు. వివిధ వర్గాలను పరిపాలనలో భాగస్వాములను చేయాలనే ఆలోచన తనదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎస్సీలు 17 శాతం ఉంటే తమ ప్రభుత్వంలో 30 శాతం ఉన్నారన్నారు. దళితులకు 3 మంత్రి పదవులు, స్పీకర్ ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి వారికి మేలు చేశామన్నారు. సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు మాట్లాడారు. సేవాలాల్ జయంతిని మిగతా 2లో..

"మేం పాలకులం కాదు, సేవకులం. మేం సేవ చేయడానికి ప్రజలు మాకు అవకాశం ఇచ్చారు. నేను ఎప్పుడూ దానిని గుర్తు పెట్టుకుంటా. పాలకుడిగా ఎప్పుడు నేను ప్రవర్తించలేదు, సేవకునిగా నా బాధ్యతను నిర్వహిస్తున్నా. ఏ వర్గాలైతే నాకు ఈ హోదా ఇచ్చారో వారికి తిరిగి సేవ చేయాలనే ఉద్దేశంతో ఉన్నాం. నేనే రాజు, నేనే మంత్రి అనే మాటలను వక్రీకరించారు. ముఖ్యమంత్రిగా, మున్సిపల్ మంత్రిగా నేనే ఉన్నాను. ఎన్నికల్లో గెలుపు ఓటములకు నాదే బాధ్యతని అని చెప్పాను" - సీఎం రేవంత్ రెడ్డి,

## పీఠం ఎక్కేదివరో తేలేది నేడే..



- కరీంనగర్‌లో మారిన సీన్
- కాంగ్రెస్ గూటికి ఐదుగురు ఇండిపెండెంట్‌లు
- సర్వత్రా ఉత్కంఠ.. నాటకీయ మలుపులు

హైదరాబాద్/కరీంనగర్(జనంసాక్షి): కరీంనగర్ కార్పొరేషన్ రాజకీయం నాటకీయ మలుపులు తిరుగుతోంది. ప్రధాన పార్టీల వ్యూహాలతో రసవత్తరంగా మారుతోంది. కరీంనగర్‌కు చెందిన ఇద్దరు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్పొరేటర్లతో పాటు, ముగ్గురు స్వతంత్ర కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన సాయిజ్యోతి, శ్యామల, స్వతంత్ర కార్పొరేటర్లు కొమరయ్య, నందిని ఉదయ్, మల్లేశం సైతం హస్తం గూటికి చేరారు. ఎంఐఎంకు చెందిన ముగ్గురు కార్పొరేటర్లతోపాటు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన మాజీద్ హుస్సేన్ కూడా మంత్రుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా.. కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు మాట్లాడుతూ.. కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని బలంగా నమ్ముతున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి కాంక్షించి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పారు. తాజా పరిణామాలతో కాంగ్రెస్ కార్పొరేషన్ మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. కరీంనగర్ కార్పొరేషన్‌లోని మొత్తం 66 డివిజన్లలో 30 సాధించి భాజపా పెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 14, భారాసకు 9, మిగతా 2లో..

### జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠంపై ఉత్కంఠ

రంగంలోకి సీనియర్ నేతలు

2లో..

## కరీంనగర్ కార్పొరేషన్‌ను దక్కించుకుంటాం

### మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా

వేములవాడ(జనంసాక్షి): కరీంనగర్ మేయర్ పీఠంపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కార్పొరేషన్‌ను దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వేములవాడలో మీడియాతో ఆయన మాట్లాడారు. "నిజామాబాద్‌లో మేయర్ పోటీ నుంచి తప్పుకొంటున్నట్లు భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ చెప్పారు. పూర్తి మెజార్టీ లేకపోవడంతోనే మిగతా 2లో..



మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబుల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లోకి చేరిన ఇండిపెండెంట్‌లు

## రాష్ట్రవ్యాప్తంగా వంద 'యంగ్ ఇండియా' స్కూళ్లు

### ప్రభుత్వ బడిలో చదవడం మా అదృష్టం అనేలా తీర్చిదిద్దుతాం: డిప్యూటీ సీఎం భట్టి



మధిర (జనంసాక్షి): భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలో చదవడం మా అదృష్టంగా విద్యార్థులు భావించే విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ఆదివారం ఖమ్మం జిల్లా మధిరలోని తేళ్ల వసంతయ్య స్మారక టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం 48వ వార్షిక సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిది ;గా హాజరయ్యారు. ఈ సందర్భంగా 48వ వార్షిక సంచికను ఆవిష్కరించిన ఆయన, విద్యా రంగంపై ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు అంటే కేవలం భవనాలు మాత్రమే కాదని, అవి విజ్ఞాన కేంద్రాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బడ్జెట్‌లో విద్యకు పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులు, డిజిటల్ విద్యా విధానం, తరగతి గదుల నిర్మాణం, తాగునీటి వసతి, బాలికలకు ప్రత్యేక వసతులు, లైబ్రరీ వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. తెలంగాణ బిడ్డలు ప్రపంచ దేశాలతో పోటీపడేలా అంతర్జాతీయ ప్రమాణాలతో 100 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మాణాలను అత్యంత వేగంగా పూర్తి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. నాణ్యమైన విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, అందుకే ప్రజా ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "మీరు ఈ స్థాయికి చేరుకోవడానికి కారణమైన పాఠశాలకు, ఈ సమాజానికి మిగతా 2లో..

## అమెరికా వాణిజ్యఒప్పందంతో రైతులకు తీరని ద్రోహం

### దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోంది

### ట్రేడ్ డీల్‌పై రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ(జనంసాక్షి): అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోసపోవడాన్ని కళ్లారా చూస్తున్నామని, దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని ఉద్ఘాటించారు. ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్తుకు సంబం ధించిందన్న ఆయన.. ఈ సందర్భంగా ప్రధా ని మోదీకి ఐదు ప్రశ్నలు సంధించారు. డీడీజీ (డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రయిన్స్) దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి చేసిన అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన దాణాను భారతీయ పశువులకు తినిపించడం కాదా? ఇది మన పాల ఉత్పత్తి అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా? జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ ఆయిల్‌ను అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లతోపాటు దేశవ్యాప్తంగా మిగతా 2లో..

### దేశ ప్రజలను రాహుల్ తప్పుదోవ పట్టిస్తున్నాడు : అమిత్ షా



2లో..

## ట్రేడ్ డీల్స్‌లో సాధికారికంగా చర్చించే స్థాయికి భారత్ ఎదిగింది



- దేశంలో తయారీరంగం, సేవారంగం పరిశ్రమలు బలోపేతం కావడంవల్లే ఈ ఘనత దక్కింది
- వికసిత దేశంగా ఎదగాలనే ఆరాటానికి ప్రతీక
- ప్రైవేటు రంగం లాభాలపై తక్కువ ఫోకస్ పెట్టాలి
- ఆవిష్కరణలు, సామర్థ్యం, ఉత్పాదక శక్తిని పెంచాలి : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): వాణిజ్య ఒప్పందాలపై విదేశాలతో సాధికారికంగా చర్చలు జరిపే స్థాయికి భారత్ ఎదిగిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో తయారీరంగం, సేవారంగం, ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు బలోపేతం అయినందువల్లే భారత్‌కు ఈ సాధికారత లభించిందని ఆయన తెలిపారు. భారత్ ఇప్పటికే 38 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుందని ప్రధాని గుర్తు చేశారు. వస్త్ర, లెదర్, రసాయన, హస్తకళలు, రత్నాలు, ఇతర రంగాల్లోని భారతదేశ ఎంఎస్‌ఎంఈలకు విదేశీ మార్కెట్లను తెరిచేందుకు ఈ ఒప్పందాలు దోహదపడతాయన్నారు. ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో ప్రధాని మోదీ ఈ కామెంట్స్ చేశారు. గత కొన్నేళ్ల వ్యవధిలో మునుపటి రికార్డులను మిగతా 2లో..



### అమెరికాలో అదృశ్యమైన భారత విద్యార్థి మృతి

వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికాలో భారత్‌కు చెందిన విద్యార్థి సాకేత్ శ్రీనివాసయ్య అదృశ్యమైన సంగతి తెలిసిందే. తాజాగా అతడు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. బెంగళూరుకు చెందిన సాకేత్ బర్కిలీలోని కాలిఫోర్నియా మిగతా 9లో..

## మాపై ఆంక్షలు ఎత్తివేస్తే న్యూక్లియర్ డీల్‌కు రెడీ

### అమెరికాకు ఇరాన్ షరతు



టెహ్రాన్(జనంసాక్షి): అమెరికాతో చర్చలు కొనసాగుతున్న వేళ.. అణు ఒప్పందంపై రాజీకి వచ్చేందుకు ఇరాన్ సిద్ధమైంది. యూఎస్‌తో న్యూక్లియర్ డీల్ కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. అయితే, తమపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని షరతు పెట్టింది. ఈ మేరకు ఇరాన్ మంత్రి మాజిద్ తఖ్తా ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మాజిద్ మాట్లాడుతూ.. ఒప్పందం కుదుర్చుకోవడానికి బంతి అమెరికా కోర్టులోనే ఉందని వ్యాఖ్యానించారు. 'ఆంక్షలను ఎత్తివేయడం గురించి మాట్లాడేందుకు వారు సిద్ధమైతే.. మా అణు కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. అయితే, అన్ని ఆంక్షలు ఎత్తివేయాలా? లేదా పాక్షిక ఉపశమనం కోరుకుంటున్నారా? అనే విషయాన్ని ఆయన స్పష్టం చేయలేదు. ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో ఇరాన్ ఒప్పందానికి రాకపోతే.. సైనిక చర్యలకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టెహ్రాన్ ప్రకటన కీలకంగా మారింది. అణు కార్యక్రమానికి సంబంధించి ఇరుదేశాల మధ్య ఒమన్ వేదికగా పరోక్ష చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఇవి సానుకూలంగా జరిగాయని మాజిద్ పేర్కొన్నారు. త్వరలోనే రెండో రౌండ్ చర్చలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

### ఢిల్లీ ఉగ్రపేలుడు కేసులో కొత్త కోణం

#### పేలుళ్ల కోసం 'అన్సార్ ఇంటీరియం'

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఢిల్లీ ఉగ్రపేలుడు కేసులో తవ్వేకొద్దీ కొత్త కోణాలు బయటకు వస్తున్నాయి. ఉగ్రడాక్టర్లు అందరూ కలిసి ఏకంగా 'అన్సార్ ఇంటీరియం' పేరిట కొత్త టెర్రరిస్టు సంస్థనే ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. వాస్తవానికి ఈ డాక్టర్లు మొత్తం చాలాకాలం క్రితమే ర్యాడికలైజ్ అయ్యారు. అప్పట్లో ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం మిగతా 2లో..



## రాష్ట్రంలో 34 చోట్ల హంగ్



- కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతోంది
- ఆ పార్టీ నేతలు మా కార్పొరేటర్లను పోలీసుల ద్వారా ప్రలోభపెడుతున్నారు
- సింగరేణిలో కాంగ్రెస్, భాజపా భాగస్వాములై దోచుకుంటున్నాయి:కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో 34 చోట్ల హంగ్ పరిస్థితి ఉందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఆయా చోట్ల కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని ఆరోపించారు. "కాంగ్రెస్ నేతలు మా కార్పొరేటర్లను పోలీసుల మిగతా 2లో..

## చమురు కొనుగోళ్లలో రాజకీయ ఒత్తిళ్లు పనిచేయవు

- అది జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుంది
- భారత్ ఈ విషయంలో స్వతంత్రంగా వ్యవహరిస్తుంది
- విదేశాంగ మంత్రి జై శంకర్



న్యూఢిల్లీ(జనంసాక్షి): వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చమురు దిగుమతులపై భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు పనిచేయవన్నారు. అది జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని.. భారత్ ఈ విషయంలో స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్నారు. మిగతా 2లో..

### తారీఖ్ ప్రమాణ స్వీకారం భారత్ తరపున ఓం బిర్లా



2లో..

జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం 16.02.2026

## ఢిల్లీ ఉగ్రపేలుడు కేసులో కొత్త కోణం

ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే.ముజమ్మిల్ గన్నీ, ఉమర్ నబీ, ఆదిల్, ముజఫర్ మౌల్వీ ఇర్ఫాన్, కారీ ఆమిర్ , తౌఫిల్ గాజి కలిసి ఏప్రిల్ 2022లో శ్రీనగర్‌లో సమావేశమయ్యారు. అదే సమయంలో వారు అన్సార్ ఇంటీరియం అనే సంస్థను ప్రారంభించారు. దీనికి ఆదిల్ చీఫ్‌గా నియమితులయ్యారు. మౌల్వీ ఇర్ఫాన్‌కు డిప్యూటీగా బాధ్యతలు అప్పగించారు. ఎవరెవరు ఏమి చేయాలనేది కూడా ముందే నిర్ణయించుకొని.. బాధ్యతలను పంచుకొన్నట్లు అరెస్టైన ఉగ్ర డాక్టర్లు వెల్లడించారు. వీరు ఆపరేషనల్ కోడ్స్ కూడా సిద్ధం చేసుకొన్నారు. ఉమర్ సమన్వయకర్త బాధ్యతలు తీసుకోగా.. గన్నీ ఫైనాన్స్, కొనుగోళ్లు విభాగాలను చూసేవాడు. ఈ గ్రూప్ 2023లో పేలుళ్లకు అవసరమైన మెటీరియల్, ఎరువులను సోహ్నా నుంచి కొనుగోలు చేసింది. ఇక ఉమర్ సూచనల మేరకు ఫరీదాబాద్‌లోని ఓ కెమికల్ షాప్ నుంచి పొటాషియం నైట్రేట్‌ను తెప్పించారు. ఇక ఉమర్ ఆన్‌లైన్ వీడియోలు చూసి ఐఈడీలను తయారు చేయడం నేర్చుకొన్నట్లు ఇంటరాగేషన్‌లో తేలింది. ఆదిల్ దక్షిణ కశ్మీర్‌కు చెందిన డానిష్‌ను అల్‌ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకొచ్చి ఉంచాడు. అతనితో ఫిదాయిన్ దాడి చేయించాలని ఉమర్ యోచించాడు. కానీ, చివరి నిమిషంలో వెనక్కి తగ్గాడు. ఈ ఉగ్రడాక్టర్ల గ్రూపులో ఉమర్ అత్యధికంగా ర్యాడికలైజ్డ్ అయిన వ్యక్తి. దిల్లీలోని రద్దీ ప్రదేశాల్లో లేదా.. ఏదైన కీలక ప్రార్థనా మందిరం వద్దగానీ అత్యంత శక్తిమంతమైన కారుబాంబును పేల్చాలని కుట్రపన్నినట్టు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. శ్రీనగర్ పోలీసులు ఈ సంస్థ గుట్టు రట్టు చేయడంతో.. ఉమర్ ఒక్కసారి తీవ్ర ఆందోళనలకు గురయ్యాడు. దీంతో దిల్లీలో పేలుడుకు పాల్పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఇతడు 2016, 2018లో ఉగ్ర సంస్థల్లో చేరేందుకు విఫల యత్నం చేసినట్టు సమాచారం.

## తారిఖ్ ప్రమాణ స్వీకారం.. భారత్ తరపున ఓం బిర్లా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత్ తరపున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. విదేశాంగశాఖ ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 17న జరగనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా భారత ప్రధాని మోదీకి ఆహ్వానం అందినట్లు వెల్లడించింది. అయితే ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ భారత పర్యటకు వస్తుండడంతో మోదీ ఢాకాకు వెళ్లే అవకాశం లేదని అధికారులు పేర్కొన్నారు. బంగ్లాదేశ్ లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తారిఖ్ నేతృత్వంలోని బీఎన్‌పీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నెల 17న ఆయన ఢాకాలో కొత్త ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని బంగ్లాదేశ్ పార్లమెంటు హౌస్‌లోని సదరన్ ప్లాజాలో నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనాలని యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం చైనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్, తుర్కియే, ఖతార్, శ్రీలంక, నేపాల్, భారత్ సహా 13 దేశాలకు ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది. ఇదీ చదవండి: తారిఖ్ రెహమాన్ ప్రమాణం.. ప్రధాని మోదీకి బంగ్లాదేశ్ ఆహ్వానం!

## జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠంపై ఉత్కంఠ..




**జగిత్యాల(జనంసాక్షి):**జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ పీఠం కోసం కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఏఐసీసీ సెక్రటరీ సవాంగ్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి సమావేశమయ్యారు. జగిత్యాల మున్సిపల్ పీఠంపై వారితో చర్చలు జరిపారు. జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు నేతలు ప్రయత్నం చేశారు. పార్టీలో ఆరంభం నుంచి ఉండి.. బలోపేతానికి కృషి చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని జీవన్‌రెడ్డి కోరారు. తనవర్గానికి చెందిన వారికే ఛైర్మన్ పదవి ఇవ్వాలన్నారు."పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరాను. పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. కట్టుబడి ఉంటాను. పార్టీ జెండా మోసిన వారికే పదవులు ఇవ్వాలని కోరుకునే వ్యక్తిని. నా అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని చెప్పాను" అని సమావేశం అనంతరం జీవన్‌రెడ్డి మీడియాకు తెలిపారు.కాంగ్రెస్ బీ-ఫారంపై గెలుపొందినవారు, స్వతంత్రులు, ఎంఐఎం కలిపి మొత్తం 23 మంది అభ్యర్థులతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శుక్రవారమే ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం 14 మంది అభ్యర్థులతో జీవన్‌రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. రెండు వర్గాలు క్యాంప్ రాజకీయాలు మొదలు పెట్టడంతో జగిత్యాల మున్సిపల్ ఛైర్ పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు సీనియర్ నేతలు రంగంలోకి దిగారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు.

## జమ్మూ కేంద్రంగా సైబర్ నేరాలు

- వెలుగులోకి 'డిజిటల్ హవాలా' వ్యవస్థ
- 8 వేల నకిలీ ఖాతాలు గుర్తింపు

**శ్రీనగర్(జనంసాక్షి):**జమ్మూ కశ్మీర్ కేంద్రంగా సైబర్ నేరగాళ్లు నిర్వహిస్తోన్న 'డిజిటల్ హవాలా' వ్యవస్థను జాతీయ దర్యాప్తు సంస్థ ఛేదించింది. అంతర్జాతీయ స్కామ్ సిండికేట్‌లతో సంబంధం ఉన్న దాదాపు 8వేలకు పైగా నకిలీ బ్యాంక్ ఖాతాలను బ్లాక్ చేసింది. సైబర్ మోసాలతో దోచుకున్న డబ్బును వేర్పాటువాద, ఉగ్ర కార్యకలాపాలకు వినియోగించే ప్రమాదం ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. వివిధ దర్యాప్తు సంస్థలతో కలిసి మూడేళ్లుగా చేస్తున్న విచారణతో ఈ డిజిటల్ హవాలా వ్యవస్థ బట్టబయలయ్యింది.అక్రమ ఆర్థిక లావాదేవీలపై జమ్మూ కశ్మీర్ పోలీసులతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రత్యేకంగా దృష్టి పెడుతుండడంతో.. కొన్నేళ్లుగా నగదు అక్రమ రవాణాకు నేరగాళ్లు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నట్లు తేలింది. సాధారణ హవాలా మార్గాలకు బదులు 'డిజిటల్ హవాలా'ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అనేక సందర్భాల్లో సాధారణ పౌరుల గుర్తింపు కార్డులను ఉపయోగించి షెల్ కంపెనీల పేర్లతో నకిలీ ఖాతాలు తెరుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వీటి ద్వారా రోజుకు రూ.లక్షల్లో డబ్బును ఇతర ఖాతాలకు మళ్లిస్తున్నట్లు వెల్లడైంది. బ్యాంకు అధికారులకు ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు భారీ నగదును చిన్న మొత్తాల్లో విభజిస్తూ లావాదేవీలు చేస్తుండటం గమనార్హం.ఈ ఖాతాల ద్వారా అమాయకుల నుంచి దోచుకున్న డబ్బులను నిందితులు ఎప్పటికప్పుడు క్రిప్టోకరెన్సీ రూపంలోకి మార్చుతున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఇటువంటి హవాలా ఖాతాల కట్టడికి స్థానిక బ్యాంకులతో కలిసి పనిచేయాలని జమ్మూ కశ్మీర్ పోలీసులకు, ప్రభుత్వ విభాగాలకు ఎన్ఐఏ సూచించింది.



## ప్రజాతీర్పును గౌరవించడం నేర్చుకోండి



అధికారికంగా చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అచ్చంపేట అడవుల్లో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్? పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.తెలంగాణ ఉద్యమంలో లంబాడీల పాత్ర మరిచిపోలేనిదన్న సీఎం రేవంత్,? వారికి సముచిత స్థానం కల్పించాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. తాను గతంలో జడ్పీటీసీగా గెలిచేందుకు సహకరించింది నాగర్?కర్నూల్? జిల్లా మిడ్జిల్‌లోని లంబాడీ యువకులేనని తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలోని ప్రతి సందర్భంలో లంబాడీలు తనకు అండగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని తండాలకు బీటీ రోడ్లు వేయాలని ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు.రాష్టంలోని అన్ని తండాల్లో రహదారులు మంచిగా ఉండాలనే ఆలోచనతోనే బీటీ రోడ్లు వేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతి తండాలో పాఠశాల భవనాలు ఏర్పాట్లు చేయాలన్నారు. సోలార్ ప్లాంట్ల ద్వారా కరెంటు ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో సన్నబియ్యం ధర రూ.45కు తగ్గిందని ముఖ్యమంత్రి చెప్పారు. 51 లక్షల పేద కుటుంబాలు 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నాయని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం రూ.9 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లోని 40 శాతం మెస్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. 87 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు గ్రూప్ 1 ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు.ప్రభుత్వం వద్ద ప్రస్తుతం భూములు లేవని, కానీ ప్రజలకు సంక్షేమంతో పాటు విద్య ఇవ్వాలనుకుంటున్నట్లు సీఎం చెప్పారు. చదువు వల్ల కీలక పదవులు వస్తాయన్న ఆయన, చదువుకునే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాలురకు 100, బాలికలకు 200 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. తాను చేయించిన సర్వేలో ఆస్తుల వల్ల కాదు, చదువు లేకపోవడం వల్ల పేదరికం వచ్చినట్లు తేలిందన్నారు. వెనుకబాటు తనం అన్నది ఒక శిక్ష అని, చదువు ఒక్కటే సమాజంలో ఒక హోదాలో నిలబెడుతుందని స్ఫూర్తి నింపారు. పేద పిల్లలకు చదువు అందించడానికి ఎన్ని డబ్బులు అయినా ఖర్చు చేస్తానన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిపై విపక్ష నేతలు ప్రజలను నిందిస్తున్నారని మండిపడ్డారు.





## కరీంనగర్ కార్పొరేషన్‌ను దక్కించుకుంటాం

ఆ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లో మెజార్టీ లేకున్నా మేయర్ పీఠం దక్కించుకుంటామని కేంద్రమంత్రి బండి సంజయ్ ఎలా చెబుతారు?కార్పొరేషన్లలో ప్రజాస్వామ్యబద్ధంగా మేయర్‌ను ఎన్నుకుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున అభివృద్ధికి సహకరిస్తాం. అందరినీ కలుపుకొని మేయర్ పీఠం దక్కించుకునేందుకు ప్రయత్నిస్తాం. భాజపా ఎలాంటి ప్రయత్నాలు చేస్తుందో మేం కూడా అలానే చేస్తాం. మేయర్, ఛైర్‌పర్సన్ పీఠాల కోసం క్యాంపు రాజకీయాలు ఉంటాయి" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## పీఠం ఎక్కేది ఎవరో తేలేది నేడే..

ఎంఐఎంకు మూడు దక్కగా 10 మంది స్వతంత్రులున్నారు. ఇక్కడ మేయర్ పీఠాన్ని సాధించాలంటే 35 మంది సభ్యుల బలం కావాలి.

## రాష్ట్రవ్యాప్తంగా వంద యంగ్ ఇండియా స్కూళ్లు

తిరిగి ఏమి ఇవ్వగలరో ఆలోచించండి" అని పిలుపునిచ్చారు. నేటి తరానికి స్ఫూర్తినిచ్చేలా పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పుస్తక రూపంలో తీసుకురావాలని సూచించారు. పెద్దల ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జ రాష్ట్ర నాయకులు కొండ బాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, టీవీ ఏం పూర్వ విద్యార్థి సంఘం నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 34 చోట్ల హంగ్

ద్వారా ప్రలోభపెడుతున్నారు. ఎక్స్‌అఫీషియో ఓటుపై ఇంకా స్పష్టత రాలేదు. సింగరేణిలో కాంగ్రెస్, భాజపా భాగస్వాములై దోచుకుంటున్నాయి. సింగరేణిలో దోపిడీని నిరోధించేందుకు సీపీఐతో కలిసి ఉంటామని ఇప్పటికే చెప్పాం. కొత్తగూడెంలో సీపీఐపై ఏం ఒత్తిడి పనిచేసిందో తెలియదు" అని కేటీఆర్ అన్నారు.

## చమురు కొనుగోళ్లలో రాజకీయ ఒత్తిళ్లు పనిచేయవు



జర్మనీలోని మ్యూనిచ్ భద్రతా సమావేశంలో జై శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు బదులిస్తూ.. భారత్ తన వ్యూహాత్మక ప్రయోజనాలకు కట్టుబడి ఉంటుందన్నారు. 'ఇంధన సమస్యల విషయానికొస్తే.. ప్రస్తుతం మార్కెట్ సంక్లిష్టంగా ఉంది. భారత్‌లోని చమురు కంపెనీలు యూరప్‌తో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలను కూడా పరిశీలిస్తాయి. ఖర్చులు, నష్టాలు, లభ్యతను చూసి.. వారి ప్రయోజనాలకు తగ్గట్లు నిర్ణయాలు తీసుకుంటారు' అని అన్నారు. అమెరికాతో ఇటీవల ఇండియాకు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీంతో భారత దిగుమతులపై సుంకాలను అగ్రరాజ్యం 18 శాతానికి తగ్గించింది. ఈ క్రమంలో రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు ఆ దేశం కట్టుబడి ఉందంటూ అమెరికా ప్రకటించింది. ఈ విషయంలో భారత్ మాత్రం స్పందించలేదు.

## అమెరికా వాణిజ్య ఒప్పందంతో రైతులకు తీదని ద్రోహం



ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా? మీ రు చెబుతున్న ఆ 'అదనపు ఉత్పత్తులు' అంటే ఏమిటీ..? కాలక్రమేణా పప్పుధాన్యాలతోపాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా? వాణిజ్యేతర అడ్డం కులను తొలగించడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి పంటలపై తన వైఖరిని మార్చడం, ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడంపై భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోనుందా? ఒకసారి ద్వారాలు తెరిచిన తర్వాత వీటిలో మరిన్ని పంటలను చేర్చకుండా ఎలా ఆపగలం? వీటికి ఏమైనా రక్షణ చర్యలు ఉన్నాయా? లేదా ఇలాగే ప్రతి ఒప్పందంలో మరిన్ని పంటలను ఈ జాబితాలో చేరుస్తారా? అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని రాహుల్ పేర్కొన్నారు. భారత వ్యవసాయ రంగంపై మరో దేశం పట్టును సాధించేందుకు అనుమతి ఇస్తున్నామా? అని ఈ సందర్భంగా అనుమానం వ్యక్తం చేశారు.

## దేశ ప్రజలను రాహుల్ తప్పుదోవపట్టిస్తున్నాడు : అమిత్ షా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇదిలా ఉండగా, అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు కేంద్ర హోంమంత్రి గట్టి సమాధానం ఇచ్చారు. అమెరికా, ఐరోపా సమాఖ్య, యూకేలతో భారత్ చేసుకున్న ఒప్పందాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని షా ఆరోపించారు. వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, పాడి పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రక్షించిందని నొక్కి చెప్పారు. దేశాన్ని తప్పుదారి పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని ఎద్దేవా చేశారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో దేశ మొట్టమొదటి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను అమిత్ షా ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు."కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అబద్ధాలు చెప్పి ప్రజలను తప్పుదారి పట్టిస్తుంది. నాకు నవ్వు వస్తుంది. ఈ దేశ పార్లమెంట్‌లో కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీ రైతులు గురించి మాట్లాడతారు. ఐరోపా సమాఖ్య, యూకేతో జరిగిన ఎఫ్‌టీఏ, అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందాల ద్వారా ప్రధాని మోదీ రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని ఆయన చెబుతున్నారు. ఈ సందర్భంగా నేను రాహుల్ గాంధీకి సవాల్ చేస్తున్నా. ఏదైనా వేదికను నిర్ణయించండి. ఎవరు రైతులకు హాని కలిగించారో బీజేపీ యువజన విభాగం అధ్యక్షుడు వచ్చి మీతో చర్చిస్తారు. ఇవాళ రాహుల్ అబద్ధాలు చెబుతున్నారని దేశ రైతులకు చెప్పడానికే ఇక్కడకు వచ్చాను. రైతులను ప్రధాని మోదీ పూర్తిగా రక్షించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు." అని అమిత్ షా పేర్కొన్నారు.

## ట్రేడ్ డీల్స్‌లో సాధికారికంగా చర్చించే స్థాయికి భారత్ ఎదిగింది

అధిగమించే రేంజులో విదేశాలకు భారత్ వస్తు, ఉత్పత్తుల ఎగుమతులు జరి గాయన్నారు. భారత్‌లో ప్రస్తుతం రాజకీ య సుస్థిరత ఉందని మోదీ తెలిపారు. దేశ రాజకీయ భవితవ్యంపైనా విదేశీ ఇన్వెస్టర్లు ఇప్పుడు ఈజీగా స్పష్టమైన అంచ నాకు రావొచ్చన్నారు. అందుకే వారికి భారత మార్కెట్‌పై విశ్వాసం పెరుగుతోందని ప్రధాని చెప్పారు.ఈసారి పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అనేది వికసిత దేశంగా ఎదగాలనే భారత్ ఆరాటానికి ప్రతీక అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇప్పుడు కాకుంటే, ఎప్పుడూ కాదు అనే బలవంతపు భావన నుంచి ఈ కేంద్ర బడ్జెట్ రాలేదని, సన్నద్ధత, స్ఫూర్తిలతో ఏర్పడిన మేం సిద్ధం అనే భావన నుంచి ఇది వచ్చిందన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా దేశ రక్షణ రంగాన్ని ఆధునికీకరించాల్సిన బాధ్యత ప్రభుత్వం భుజస్కంధాలపై ఉందని ఆయన తెలిపారు. అందుకోసమే రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపులను పెంచామన్నారు. దేశ త్రివిధ దళాల బలోపేతం కోసం ఏం చేయడానికైనా సిద్ధమేనని మోదీ వెల్లడించారు. "భారతదేశ తదుపరి దశ ఆర్థిక పరివర్తనలో ప్రైవేటు రంగం అత్యంత కీలకమైన పాత్రను పోషించాల్సి ఉంటుంది. ఆ రంగం నుంచి నిర్ణయాత్మక స్పందన వస్తుందని నేను ఆశిస్తున్నాను. వికసిత భారత్ దిశగా మన దేశం పయనించాలంటే ప్రైవేటు రంగం ఆవిష్కరణలు, దీర్ఘకాలిక సామర్థ్యం పెంపు, అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ వంటి విభాగాల్లో ధైర్యంగా పెట్టుబడులను పెట్టాలి. ప్రైవేటు రంగం లాభాలను కాపాడుకోవడంపై తక్కువగా, పరిశోధన - అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ), సప్లై చైన్, నాణ్యతలపై ఎక్కువగా ఫోకస్ పెట్టాలి. పారిశ్రామిక ఉత్పాదకత పెరిగితే, ప్రైవేటు కంపెనీల యజమానులు ఆ ఫలాలను పారదర్శకంగా కార్మికులతో పంచుకోవాలి" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు."వికసిత భారత్ సాధనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారు అనేది నా బలమైన నమ్మకం. అందుకే మహిళా సంక్షేమం విషయంలో మా ప్రభుత్వం ఎలాంటి రాజీకి తావు ఇవ్వడం లేదు. మా సర్కారు ప్రతీ నిర్ణయంలోనూ మహిళా సంక్షేమ భావన ఉండేలా చూస్తున్నాం. భారత సైనికుల సంక్షేమం అంశానికీ మేం పెద్దపీట వేస్తున్నాం. భారత్ బలంగా, సర్వసన్నద్ధంగా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మేం ఇప్పటివరకు ప్రవేశపెట్టిన అన్ని కేంద్ర బడ్జెట్‌లు దేనికవి ప్రత్యేకమైనవి. బడ్జెట్ రూపకల్పన కోసం మేం అనుసరించే ప్రమాణాలు అలాంటివి. కరోనా సంక్షోభ కాలం తర్వాత భారతదేశానికి ఎన్నో రంగాల్లో అవకాశాల తలుపులు తెరుచుకున్నాయి. ప్రోత్సాహకాలు, సుంకాల ప్రాధాన్యతలు అనేవి మన దేశ అభివృద్ధి పయనానికి ఊతాన్ని ఇవ్వగలవు. కానీ నిలకడగా అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీని ఇచ్చే సత్తా రావాలంటే వినూత్న ఆవిష్కరణలు, విశిష్ట సామర్థ్యం, భారీ ఉత్పాదక శక్తిని మనం అందిపుచ్చుకోవాలి" అని ప్రధాని మోదీ చెప్పారు."యూపీఐ వేదిక ద్వారా ప్రజల లావాదేవీలను మేం వేగవంతం చేశాం. అందుకే భారత్ ఇప్పుడు ప్రపంచంలో డిజిటల్ లీడర్‌గా మారింది. ఏఐ టెక్నాలజీకి, ఆవిష్కరణలకు దోహదం చేసే ఎకో సిస్టమ్‌కు సైతం భారత్ పునాదులు వేస్తోంది. కంప్యూటింగ్ పవర్‌ను, డేటా సెంటర్ల మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని మనం పెంచుకుంటున్నాం. భారత చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మౌలిక సదుపాయాల కల్పన రంగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టాం. భవిష్యత్ కోసం బంగారు భారత్‌ను నిర్మిస్తున్నాం. ఈక్రమంలో ఈసారి కేంద్ర బడ్జెట్‌లో మూలధన వ్యయం కోసం రూ.12.2 లక్షల కోట్లను కేటాయించాం. 2013 కేంద్ర బడ్జెట్‌తో పోలిస్తే ఇది ఐదురెట్లు ఎక్కువ" అని ప్రధాని మోదీ వివరించారు. సామాన్యుల కోసమే 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' అని ప్రధాని మోదీ అన్నారు.
గడిచిన దశాబ్ద కాలంగా రక్షణ రంగంలో తీసుకువస్తున్న సంస్కరణల ప్రయోజనాలు ఆపరేషన్ సిందూర్ సమయంలో స్పష్టంగా కనిపించాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్ ఎప్పుడూ సంసిద్ధతతో ఉండాలన్న ఆయన.. రక్షణ రంగాన్ని ఆధునికీకరించడంతోపాటు స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన మోదీ.. అనేక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.యూపీఏ ప్రభుత్వ హయాంలో వాణిజ్య చర్చలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. వారి ఆర్థిక నిర్వహణ సరిగ్గా లేని కారణంగా విశ్వసనీయతతో భారత్ చర్చలు జరపలేక పోయిందన్నారు. తద్వారా ఏ చర్చలనూ పూర్తి చేయలేక పోయారని విమర్శించారు. తమ హయాంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకే, ఈయూ, అమెరికాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలతో ఎంఎస్‌ఎంఈలకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. ముఖ్యంగా కార్మిక ఆధారిత రంగాలకు లబ్ధి చేకూరిందని, ఆయా దేశాలకు తక్కువ సుంకాలతోనే ఎగుమతుల చేసుకునే వీలు కలిగిందన్నారు.

రక్షణ రంగానికి పెద్దపీట..

అంతర్జాతీయంగా భారత్ అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న దృష్ట్యా ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత తమ ప్రభుత్వానికి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అందుకే తాజా బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.7.85లక్షల కోట్లు కేటాయించామన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల పథం సామాన్య పౌరులకు భారీ స్థాయిలో ప్రయోజనం చేకూరుస్తోందని చెప్పారు. రాబోయే దశాబ్దం పాటు నిర్మాణాత్మక సంస్కరణలు, లోతైన ఆవిష్కరణలు, పాలనను మరింత సరళీకరించడం.. ఈ మూడు ముఖ్యమైన సంస్కరణలనే ప్రధానంగా కొనసాగిస్తామన్నారు.

**మహిళలే కీలకం..**

'వికసిత్ భారత్' సృష్టించడంలో మహిళలు అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తారని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారిని శక్తివంతం చేస్తాయని ప్రధాని మోదీ అన్నారు. అంతరిక్షం, స్టార్టప్ వంటి అనేక రంగాల్లో వీరు గొప్ప ప్రభావాన్ని చూపిస్తున్నారని గుర్తు చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్వల్పకాలిక ప్రజాదరణ పథకాల జోలికి వెళ్లలేదని.. ఉద్యోగాల కల్పన, సుస్థిరాభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాల కోసమే భారీగా కేటాయింపులు చేశామని అన్నారు.

## ప్యాసింజర్ రైలు బోగీలో మంటలు..

### తప్పిన ప్రమాదం

**కోల్‌కతా(జనంసాక్షి):**పశ్చిమబెంగాల్‌లోని పూర్వ బర్ధమాన్ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. కట్వా రైల్వేస్టేషన్‌లో కట్వా-అజీమ్‌గంజ్ ప్యాసింజర్ రైలు బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఘటన జరిగిన సయంలో కోచ్ ఖాళీగా ఉన్నందున ఎవరికీ ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. తెల్లవారుజామున సుమారు 4.30 గం. సమయంలో ఈ ఘటన జరిగింది. ప్లాట్‌ఫారంపై ఉన్న ప్రయాణికులు మంటల్ని చూసి భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది అరగంట పాటు శ్రమించి మంటల్ని అదుపుచేశారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోందని తూర్పు రైల్వే అధికారి తెలిపారు.

## బంగ్లాలో కొత్త ప్రభుత్వం వేళ.. యూనస్ పయనం ఎటు..?

ఢాకా:బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన బీఎన్‌పీ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. తన క్యాబినెట్ కూర్పుపై ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో ఇప్పటివరకు బంగ్లా ప్రభుత్వ తాత్కాలిక సారథిగా వ్యవహరించిన మహ్మద్ యూనస్ తదుపరి పయనం ఎటువైపు అనే విషయం ఆసక్తిగా మారింది. క్లిష్ట సమయంలో దేశాన్ని ముందుండి నడిపించిన ఆయన, నూతన ప్రభుత్వంలో భాగస్వామి అవుతారా? ప్రత్యేక బాధ్యతలు అందుకుంటారా? అన్న విషయంపైనా చర్చ జరుగుతోంది.ఉద్రిక్తతల వేళ మాజీ ప్రధాని షేక్ హసీనా బంగ్లాదేశ్ వీడిన తర్వాత.. 2024 ఆగస్టులో తాత్కాలిక ప్రభుత్వానికి సారథిగా (ముఖ్య సలహాదారు) మహ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టారు. దేశం అత్యంత అస్థిర పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలో ఓ ప్రభుత్వ సంరక్షకుడిగా కొనసాగిన ఆయన.. 18 నెలల పాటు తన విధులను నిర్వర్తించారు. ఎన్నికల నిర్వహణలోనూ కీలకంగా వ్యవహరించారు. ఇవే కాకుండా రాజకీయ వ్యవస్థలో సంస్కరణకు శ్రీకారం చుట్టారు. ఒకే వ్యక్తికి ప్రధాని పదవిని రెండు పర్యాయాలకు పరిమితం చేయడం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, మహిళల ప్రాతినిధ్యం పెరుగుదల, ఎన్నికల సమయాల్లో తటస్థంగా వ్యవహరించే తాత్కాలిక ప్రభుత్వాల ఏర్పాటు సిఫార్సులను పొందుపరిచారు.

## సొంత గూటికి చేరుకున్న 59వ డివిజన్ కార్పొరేటర్ మాజీద్ హుస్సేన్

- కండువా కప్పి ఎంఐఎంలోకి ఆహ్వానించిన అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ
- ఎంఐఎం కార్పొరేటర్ లకు దారుస్సలామ్ లో ఆత్మీయ సన్మానం



**కరీంనగర్ ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** ఏఎంఐఎం పార్టీ అధినేత హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ సమక్షంలో కరీంనగర్ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ నేతృత్వంలో 59 వ డివిజన్ కార్పొరేటర్ మజీద్ హుస్సేన్ 200 మంది అనుచరులతో కలిసి ఆదివారం హైదరాబాద్ దారుస్సలామ్ లో ఎంఐఎం లో చేరారు. ఈ సందర్భంగా మాజీద్ హుస్సేన్ కు ఆకుపచ్చ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ. ఎంఐఎం పార్టీలో గెలుపొందిన మొహసిన్ మొహియుద్దీన్, ఆతిఫ్ ఆతిన, నసీం సుల్తానా ఇబ్రహీంలను పూలమాలలు శాలువాలతో ఆత్మీయంగా బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ సన్మానించారు. గతంలో ఎంఐఎం పార్టీలో కొనసాగిన మాజీ హుస్సేన్ కు పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో ఎంఐఎం రెబెల్ అభ్యర్థిగా 59వ డివిజన్ ముకరంపురాలో పోటీ చేసి గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీలో కలిసి తమ పార్టీలలో చేరాలని ఆహ్వానించినప్పటికీ మాజీ దృశ్యం దాన్ని సున్నితంగా తిరస్కరించి డివిజన్ పెద్దలతో చర్చించి రాబోయే తన రాజకీయ భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం ఉండకుండా తాను అభిమానంతో బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీపై, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ లపై నమ్మకంతో ఏఐఎంఐఎం పార్టీలో చేరుతున్నారని ప్రకటించారు. డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా శ్రమించాలని డివిజన్ ప్రజలు ఏదైతే నమ్మకంతో గెలిపించారో వారి నమ్మకాన్ని, వమ్ము చేయకుండా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ సమస్యల పరిష్కారం కోసం అలుపెరగకుండా కృషి చేయాలని డివిజన్ అభివృద్ధికై అహర్నిశలు పాటుపడాలని అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ తనతో చెప్పారని పేర్కొన్నారు. జావిద్, బాబ్బాయి, ఎక్బాల్, జహూర్, ఫైసల్, హమీద్, తయ్యబ్, ఇంతియాజ్, పార్టీ కార్యాలయ కార్యదర్శి రఫీ పాల్గొన్నారు.

## ఇసుక డంపును సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

- జనం సాక్షి కథనానికి స్పందన



**కడెం, ఫిబ్రవరి 15(జనంసాక్షి) :** శనివారం రోజున అక్రమంగా ఇసుక రవాణా అనే జనం సాక్షి లో ప్రచురించిన కథనానికి రెవిన్యూ అధికారులు స్పందించారు. బెల్లాల్ గోదావరి ఒడ్డున కాళీ ప్రదేశంలో డంపు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలించి ఉన్నటువంటి సుమారు ఎన్ని ట్రిప్పుల ఇసుకను తహసిల్దార్ ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆర్ఐ శారద ఆదివారం రోజు స్పందించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఐ శారద మాట్లాడుతూ... ఎంతటి వారైనా సరే నాయకులు, సామాన్యులు అని చూడకుండా ఇసుక, మొరం లాంటి అక్రమ దందాలకు పాల్పడితే ఊరుకునేది లేదని అన్నారు. అక్రమంగా దందాలు నడిపిస్తున్న వాహనాలు ఎవరివని చూడకుండా, వచ్చిన సమాచారం మేరకు అప్పటికప్పుడే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించినటువంటి యాజమాన్యాలు చట్టం నుండి తప్పించుకోలేరని అన్నారు. మరి ఏ ఇతర నూతనంగా నిర్మిస్తున్న నిర్మాణాలకు, ఇందిరమ్మ ఇండ్లకు అధికారికంగా అనుమతులు తీసుకొని నడిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కళ్యాణంలో పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్



**కాళేశ్వరం, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరం లోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి శుబానంద దేవి ముక్తేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు కలెక్టర్ దంపతులను ఆశీర్వదించి శాలువాతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కళ్యాణవేదికపై శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని జిల్లా కలెక్టర్ దంపతులు, కలెక్టర్ తల్లిదండ్రులు భక్తులు తిలకించారు. అందరు అధికారులు సమన్వయంతో పని చేస్తూ భక్తులందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో జిల్లా ఎస్పీ, సబ్ కలెక్టర్ , జిల్లా గ్రంథాలయ సంస్త చైర్మన్ రాజాబాపు , మహదేవపూర్ సర్పంచ్ హసీనాబాను , స్థానిక సర్పంచ్ మోహన్ రెడ్డి , ఉప సర్పంచ్ సుధీర్ , కాంగ్రెస్ నాయకులు , ప్రజలు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ కోసం రైతన్నల 'యాప్' కష్టాలు

**వెల్దండ ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అందించే ఏరియా బస్తాల కోసం ముందస్తుగా బుకింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్మార్ట్ ఫోన్ లో ఫర్టిలైజర్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకునే విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన లేని రైతన్నలు దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం యూరియా బుకింగ్ చేసుకోవాలని సింగల్ విండో, వ్యవసాయ అధికారులు సమాచారం అందజేశారు. ఈ మేరకు ఆ సమయానికి అరగంట ముందు నుంచి కొంతమంది రైతులు బుకింగ్ చేసుకోవడానికి ఎదురుచూడటం ప్రారంభించారు. కానీ వెల్దండకు మంజూరైన 690 బస్తాలు వెంటనే ఒక్క నిమిషంలోపే బుకింగ్ అయిపోవడంతో రైతులు ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా కాకుండా పాత పద్ధతిలోని యూరియా సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు.

## చేర్యాల మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి భారీ షాక్

- 12 వార్డుల్లో 125 ఓట్లకే పరిమితం



**చేర్యాల (జనంసాక్షి) :** చేర్యాల మున్సిపాలిటీలో అన్ని వార్డులకు అభ్యర్థులను పెట్టినప్పటికీ ఒక్కో అభ్యర్థికి రెండు అంకెలు మించకుండా ఓట్లు వచ్చాయి. 12వార్డులకు గాను మొత్తం కలిపి 1.08 శాతం వచ్చాయి. అన్నింటికి కలిపి 125 ఓట్లు మాత్రమే వచ్చాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి కనీసం ఒక్క వార్డులోనైనా డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయిందని చేర్యాల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ చర్చించుకుంటున్నారు.

# తలకిందులైన అంచనాలు!

- ఓటింగ్ సరళిపై ప్రధాన పార్టీల పోస్టుమార్టం
- గెలుపోటములపై అంతర్మథనం
- కొన్నిచోట్ల భారీ మెజారిటీ, మరికొన్ని వార్డుల్లో అత్యల్పం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అంచనాలు తలకిందులయ్యాయి. ఆయా వార్డుల ఎన్నికల ఫలితాలపై ప్రధాన పార్టీల నేతలు పోస్టుమార్టం చేస్తున్నారు. ఆయా వార్డుల అభ్యర్థులకు వచ్చిన ఓట్ల పరిస్థితులను బట్టి అంచనాలు వేస్తున్నారు. ఓటమిపాలైన చోట పార్టీ బలహీన పడిందా..? లేక అభ్యర్థి పనితీరు వల్ల ఓటమి పాలయ్యామా..? అనే అంశాలపై ఆయా పార్టీల్లో చర్చ జరుగుతుంది. ముఖ్యంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూటమి అభ్యర్థులు 30 వార్డుల్లో పోటీ చేసినా సుమారు 25 వార్డుల్లో గెలుస్తామని ముఖ్య నేతలు అంచనాలు వేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ నుండి 16 మంది, సిపిఐ నుండి ఒకరు సహా మొత్తం 17 సీట్లను చేజిక్కించుకుంది. మరోచోట రెబల్ అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై గెలుపొందడం ఆశ్చర్యకరంగా మారింది. రెబల్ అభ్యర్థితో కలిపి కాంగ్రెస్ పార్టీ తమ సంఖ్యను 18కి పెంచుకుని చైర్మన్, వైస్ చైర్మన్ పీఠాలను తమ ఖాతాలో వేసుకుని, ఎన్నికకు రంగం సిద్ధం చేసుకున్నారు. బిఆర్ఎస్ పార్టీ లోను అదే పరిస్థితి. సుమారు 20 కి పైగా వార్డుల్లో తమ అభ్యర్థులు గెలుస్తారని, మున్సిపల్ పీఠంపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని అంచనా వేసినప్పటికీ పరిస్థితులు తలకిందులు అయ్యాయి. కేవలం 10 సీట్లను దక్కించుకుని వెనుకబడిపోయింది. ఒకానొక పరిస్థితుల్లో నువ్వా నేనా అన్నట్లుగా ఫలితాలు వెలుపడ్డాయి. అతి తక్కువ మెజారిటీతో అభ్యర్థులు గెలుపొందారు. మొదటి, రెండు రౌండ్లలో కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు సమానంగా గెలిచినప్పటికీ, చివరి మూడో రౌండ్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎక్కువగా గెలవడంతో కాంగ్రెస్ పార్టీ ఊపిరి పీల్చుకుంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న భూపాలపల్లి మున్సిపాలిటీ, ప్రస్తుతం కుదేలైంది. బీఆర్ఎస్ కోటకు బీటలు బారినట్లు అయింది. బీజేపీ రెండు చోట్ల గెలిచి ఉనికిని చాటుకుంది. ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారాయి. మొదటిసారి భూపాలపల్లి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. ఇక చైర్మన్, వైస్ చైర్మన్ పీఠాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో ఆ పార్టీలో నూతనోత్సాహం కనిపిస్తుంది.

### 9 వార్డుల్లో ఉత్కంఠ భరితంగా ఫలితాలు..

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 30 వార్డులు ఉండగా, 9 వార్డుల్లో మాత్రం ఉత్కంఠ భరితమైన ఫలితాలు వెలువడ్డాయి. నువ్వా నేనా అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు తలపడ్డారు. ఈ క్రమంలో కొద్దిపాటి తేడాతో అభ్యర్థులు గెలుపొందడం విశేషం. ఇందులో రెండవ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన బుర్ర కొమురయ్యకు 564 ఓట్లు రాగా, ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి కోల రాజమల్లుకు 539 ఓట్లు వచ్చాయి. ఉత్కంఠ భరితంగా సాగిన వీరి ఫలితాల్లో చివరికి 25 ఓట్ల మెజార్టీతో బుర్ర కొమురయ్య గెలుపొందాడు. అదేవిధంగా 8వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సొతుకు రమ కు 631 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి బెజ్జల శ్యామలకు 649 ఓట్లు వచ్చాయి. శ్యామల 25 ఓట్ల మెజారిటీతో గెలుపొందింది. 13వ వార్డులో బడితల వెంకటస్వామికి 701 ఓట్లు రాగా బీఆర్ఎస్ అభ్యర్థి మామిడి కుమార్ కు 647 ఓట్లు వచ్చాయి. 54 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. 19 వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కుర్మిళ్ల శ్రీనివాస్ కు 554 ఓట్లు రాగా, సమీప బీఆర్ఎస్ అభ్యర్థి మాడ హరీష్ రెడ్డికి 533 ఓట్లు వచ్చాయి. కేవలం 21 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ గెలుపొందారు. 20వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఇస్లావత్ రాజు నాయక్ బీఆర్ఎస్ అభ్యర్థి నగావత్ ప్రభాకర్ పై 35 ఓట్ల తేడాతో గెలుపొందారు. 21వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ధరావత్ శారద, బీఆర్ఎస్ అభ్యర్థి అంగోతు స్వాతి పై 60 ఓట్ల తేడాతో గెలుపొందింది. 23వ వార్డులో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి బండం రాజేశ్వరి ఇండిపెండెంట్ గా పోటీ చేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శిరుప స్వప్న పై 42 ఓట్ల తేడాతో గెలుపొందారు. 26వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓరుగంటి రాధ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పటాకుల రమాదేవి పై 31 ఓట్ల తేడాతో గెలుపొందింది. 29వ వార్డు లో బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర హరీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పుల్ల మహేష్ పై 65 ఓట్ల తేడాతో గెలుపొందడం జరిగింది. ఇవి అతి తక్కువ మెజారిటీతో గెలుపొందిన వార్డులు..

### ఆరు వార్డుల్లో భారీ మెజారిటీతో గెలుపు..

భూపాలపల్లి మున్సిపాలిటీలోని ఆరు వార్డులో మాత్రం భారీ మెజారిటీతో అభ్యర్థులు గెలుపొందారు. మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బౌతు శోభ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, మున్సిపల్ మాజీ చైర్మన్ సెగ్గం వెంకటరాణిపై 389 మెజారిటీతో గెలుపొందింది. మూడవ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎర్రవెల్లి జగపతిరావు, బీఆర్ఎస్ అభ్యర్థి పిల్లలమర్రి నారాయణ పై 354 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 11వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి మోతే రాజు, కాంగ్రెస్ అభ్యర్థి గురజాల రవి పై 330 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 14వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాకోటి శ్వేత, బిజెపి అభ్యర్థి దొంగల లలిత పై 367 ఓట్ల తేడాతో గెలుపొందింది. 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్తి కమల, బీఆర్ఎస్ అభ్యర్థి బేతోజు వజ్రమనిపై 456 ఓట్ల తేడాతో గెలుపొందింది. 25వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొనగంటి మేఘన, బీఆర్ఎస్ అభ్యర్థి రేగుల స్రవంతి పై 664 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించింది. అయితే ఈ ఎన్నికల్లో ఆయా పార్టీల అంచనాలు తలకిందులు కావడంతో పరిస్థితులపై పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.

## ఎలిశెట్టిపెల్లి గ్రామస్తుల 50యేండ్ల కల నెరవేరనుంది

- మంత్రి సీతక్క ఆదేశాలతో కదిలిన అధికారులు
- ఎలిశెట్టిపెల్లి బ్రిడ్జి నిర్మాణానికి అంచనా వేసి ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్న అధికారులు
- వర్షాకాల కష్టాలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు



**ఏటూరునాగారం, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** వర్షాకాలం వచ్చిందంటే ఎలిశెట్టిపెల్లి గ్రామస్తులకు రాకపోకలు నిలిచిపోయేవి, ప్రజలు బయటకు ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లవలసిన పరిస్థితి వస్తుందని గ్రహించిన పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, నీటిపారుదల శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, హైదరాబాద్ ఇంజనీరింగ్ శాఖ అధికారుల వారి ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండలం లోని ఎలిశెట్టిపెల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు అంచనా వేసి, ప్రభుత్వం దృష్టి కి ప్రతిపాదనను పంపించారు. బ్రిడ్జి మంజూరు చేపట్టి అతి త్వరలో ప్రజల కష్టాలు తీరనున్నాయని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎలిశెట్టిపెల్లి గ్రామస్తుల యాభై యేండ్ల కల నెరవేరనున్నది. ఈ బ్రిడ్జి మంజూరు తో గ్రామం మోక్షం పొందింది, గ్రామస్తులు మంత్రి సీతక్క చేస్తున్న అభివృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి గ్రామాల అభివృద్ధికి మరో మైలురాయిగా మార నుంది. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు, డిఈ, ఏఈ, కాంగ్రెస్ నాయకులు జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, రాష్ట్ర రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, సర్పంచులు పలక చిన్నన్న, అట్టం రాంబాబు, దేవులపల్లి విజయ్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధుబాబు, మాజీ సర్పంచ్ చింత సుమలత రమేష్,సోషల్ మీడియా సోదారి హరీష్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కుదురుపాక శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కర్నే సత్యం, వాసం రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పడిదాల సారయ్య,చెన్నం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక క్వారీ నిర్వాహకుడి మట్టి దందా

**చెన్నూర్ ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** చెన్నూరు మండలం చింతలపల్లి గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇసుక క్వారీ నిర్వాహకుడు రాత్రి వేళ గోదావరిలోని మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అధికారులంతా మహా శివరాత్రి ఉత్సవాల్లో బిజీగా ఉంటే క్వారీ నిర్వాహకుడు మాత్రం అక్రమ మట్టి తవ్వకాల్లో నిమగ్నమవుతున్నాడు. చెన్నూరు పట్టణానికి చెందిన మంత్రి ముఖ్య అనుచరుడు దొరగారికి ఈ క్వారీ నిర్వాహకుడు దగ్గరి బంధువే అని సమాచారం. అధికారపార్టీ అండదండలతో క్వారీ ప్రారంభానికి ముందే సారు ఇలాంటి చర్యలు చేస్తుంటే, ముందు ముందు ఇసుక క్వారీలో మరిన్ని అక్రమాలు జరుగుతాయో వేచి చూడాలి.

## అగ్రివర్సిటీ పరీక్షల్లో అక్రమాలపై దర్యాప్తులో కీలకాధారాలు

- సీఐడీ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి..
- ప్రశ్నపత్రాలు జిరాక్స్ తీసే సమయంలో ఫోటో తీసిన ఉద్యోగి
- అతడి ద్వారా ఓ విద్యార్థిని వెళ్లినట్లు గుర్తింపు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల్లో అక్రమాలపై పోలీసులకు కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై వర్సిటీ అంతర్గత విచారణతోపాటు సీఐడీ ప్రాథమిక దర్యాప్తులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. పీజేటీఏయూ పరిధిలోని మూడో సంవత్సరం విద్యార్థుల మొదటి సెమిస్టర్ 2025-26 పరీక్షలకు సంబంధించిన ఈ లీకేజీలో ఇంటిదొంగల నిర్వాకంపై కీలక సమాచారం లభించింది.

### జిరాక్స్ తీసే సమయంలో..

ఈ పరీక్షపత్రాల లీకేజీలో వరంగల్ వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కార్తిక్ కీలకపాత్ర వహించినట్లు సీఐడీ గుర్తించింది. ఇన్సర్వీస్ విద్యార్థులకు పరీక్ష పత్రాలను అతనే లీక్ చేసినట్లుగా గుర్తించారు. ప్రశ్నాపత్రాల్ని జిరాక్స్ తీసే సమయంలోనే అతను తన సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసినట్లుగా బయటపడింది. ఇలా చేయాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో పూర్వ ఇన్సర్వీస్ విద్యార్థిగా పనిచేసిన శ్రీకాంత్ ఒత్తిడి చేసినట్లు విచారణలో గుర్తించారు. ఈక్రమంలోనే కార్తిక్ బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పెద్దఎత్తున నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. అంతేకాకుండా మరికొన్ని ప్రశ్నాపత్రాల లీకేజీకి సంబంధించిన సమాచారం వెల్లడి కావడం విస్తుగొలిపే అంశంగా మారింది.

### పొరుగు సేవల సిబ్బంది

మూడో ఏడాది మొదటి సెమిస్టర్ మిడ్ ఎగ్జామ్స్ ప్రశ్నాపత్రాలను సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాలలో పొరుగు సేవల సిబ్బంది అజయ్ లీక్ చేసినట్లుగా తేలింది. అతడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా గతంలో జరిగిన మరికొన్ని సెమిస్టర్ల ప్రశ్నాపత్రాలను గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొన్నేళ్లుగా ఇన్సర్వీస్ విద్యార్థులకు సంబంధించిన పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ కొనసాగి ఉంటుందనే అనుమానాల నేపథ్యంలో సీఐడీ దర్యాప్తు మరింత ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ దర్యాప్తు కొలిక్కివస్తే మరికొందరి పాత్ర బయటపడే అవకాశాలు ఉన్నాయి.

### ప్రశ్నాపత్రాల్ని వాట్సప్‌లో పంపించినట్లు..

క్లిష్టంగా భావించే ఓ పరీక్షలో ఇన్సర్వీస్ స్టూడెంట్లు అసాధారణ రీతిలో మార్కులు సాధించడం అనుమానాలకు దారి తీసింది. దీంతో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, డీన్ ఝాన్సీరాణి గత ఏడాది డిసెంబర్ 24వ తేదీన జగిత్యాలలోని వ్యవసాయ కళాశాలలో తనిఖీలు నిర్వహించారు. నవంబర్ 17వ తేదీన జరిగిన ఆ పరీక్షకు సంబంధించి సీసీ కెమేరాలను పరిశీలించడంతో రమేశ్ అనే విద్యార్థి కదలికలు అనుమానస్పదంగా కనిపించాయి. ఈనేపథ్యంలోనే ఎంటమాలజీ హెచ్‌వోడీ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ అంజయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎన్.పి.రవికుమార్, సంపత్‌లతో కలిపి విచారణ బృందాన్ని నియమించింది. ఈ బృందం జనవరి 5న జగిత్యాలకు వెళ్లి విద్యార్థి రమేష్‌ను విచారించింది. అదే కళాశాలకు చెందిన ఇన్సర్వీస్ విద్యార్థి శ్రీనివాస్ తనకు ప్రశ్నాపత్రాల్ని వాట్సప్‌లో పంపించినట్లు రమేశ్ వెల్లడించినట్టు సమాచారం. శ్రీనివాస్ను విచారించగా అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థి దుర్గారావు వాటిని తనకు పంపినట్లు తేలింది. అశ్వారావుపేట కళాశాలకే చెందిన విద్యార్థిని నుంచి తనకు వాట్సప్‌లో ప్రశ్నాపత్రాలు అందినట్లు దుర్గారావు వెల్లడించారు.

### కేసు దర్యాప్తు ముమ్మరం చేసిన సీఐడీ

అశ్వారావుపేట విద్యార్థినిని విచారించగా వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన మరో విద్యార్థిని వాట్సప్ లో పంపినట్లు తేలింది. ఇందుకోసం అశ్వారావుపేట కళాశాలలోని పలువురు విద్యార్థుల నుంచి తాను రూ.1.4 లక్షలను వసూలు చేసినట్లు అంగీకరించారు. అందులో నుంచి రూ.80వేలను వరంగల్ కళాశాల విద్యార్థిని బదిలీ చేసినట్లు చెప్పారు. వరంగల్ కళాశాల విద్యార్థినిని విచారించడంతో కార్తిక్ నిర్వాకం బట్టబయలయింది. కార్తిక్ సదరు విద్యార్థినికి వాట్సప్‌లో ప్రశ్నాపత్రాలను పంపినట్లు తేలింది. వరంగల్ విద్యార్థిని ద్వారానే ప్రశ్నాపత్రాలు వరంగల్, జగిత్యాల, పాలెం, ఆదిలాబాద్, రాజేంద్రనగర్, సిరిసిల్ల, అశ్వారావుపేట కళాశాలల్లోని ఇన్సర్వీస్ విద్యార్థులకు చేరినట్లు అనుమానిస్తున్నారు. మొత్తంగా సీఐడీ ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేసింది. త్వరలోనే ఈ వ్యవహారంలో అరెస్టులు చేసే అవకాశం ఉంది.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 ఫిబ్రవరి 2026

# దేశ వెన్నెముక విరిగిపోతోంది

### వ్యవసాయ రంగానికి బడ్జెట్ నిరాశ

వ్యవసాయ రంగాన్ని దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా పేర్కొనడం మాటల వరకే పరిమితమైపోతున్న పరిస్థితి ప్రస్తుతం కనిపిస్తోంది. గణాంకాల్లో చూపించే ఉత్పత్తి సంఖ్యలు, వృద్ధి శాతాలు, ఎగుమతుల పరిమాణాలు రైతు జీవితంలో ప్రతిబింబించనప్పుడు ఆ అభివృద్ధి అర్థం కోల్పోతుంది. 2025-26 కేంద్ర బడ్జెట్ ఈ వాస్తవాన్ని మరింత స్పష్టంగా బయటపెట్టింది. వ్యవసాయ రంగ వృద్ధిరేటు 3.1 శాతానికి పడిపోయినట్లు ఆర్థిక సర్వే హెచ్చరిస్తున్నా, దానికి తగిన ప్రతిస్పందన బడ్జెట్ లో కనిపించలేదు. ఇది రైతు భవిష్యత్తుపై అనిశ్చితి మబ్బులు కమ్మేలా చేసింది.

దేశం ఆహార భద్రతను సాధించినట్లు చెప్పుకునే స్థాయికి చేరింది. 35.7 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి సాధించడమే దీనికి నిదర్శనం. అయినా రైతు ఆదాయం ఎందుకు పెరగడం లేదు అన్న ప్రశ్నకు సమాధానం విధానపరమైన లోపాల్లోనే దాగి ఉంది. ఉత్పత్తి పెరిగినా గిట్టుబాటు ధరలు లేకపోవడం, మార్కెట్ నియంత్రణ రైతులకు అనుకూలంగా లేకపోవడం, దిగుమతుల ప్రభావం దేశీయ ధరలను కుంగదీయడం వంటి అంశాలు రైతు లాభాన్ని క్రమంగా తుడిచిపెడుతున్నాయి. రైతు పండించే పంట వినియోగదారుడికి చేరేలోపు ధరలు అనేక రెట్లు పెరుగుతున్నా, ఆ లాభం రైతుకు చేరడం లేదు.వ్యవసాయ పరిశోధనకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం భవిష్యత్తు ఉత్పాదకతను నేరుగా దెబ్బతీసే అంశం. ప్రపంచ దేశాలు తమ వ్యవసాయ బడ్జెట్‌లో 2 శాతం నుంచి 3 శాతం వరకు పరిశోధనపై ఖర్చు పెడుతుంటే, భారత్ లో అది 0.5 శాతానికే పరిమితం కావడం ఆందోళనకరం. వాతావరణ మార్పుల ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కొత్త విత్తనాలు, వాతావరణానుకూల సాగు పద్ధతులు, నీటి వినియోగ సామర్థ్యం పెంచే సాంకేతికతలు రైతుకు అత్యవసరం. ఇవన్నీ పరిశోధన ద్వారానే సాధ్యం. ఈ రంగంలో పెట్టుబడి తగ్గించడం అనేది రేపటి రైతును మరింత అసహాయుడిని చేయడమే అవుతుంది.

ఇన్పుట్ వ్యయం పెరుగుతున్న వేగానికి అనుగుణంగా రైతు ఆదాయం పెరగడం లేదు. గత 5 సంవత్సరాల్లో ఎరువులు, పురుగు మందులు, కూలీ ఖర్చులు 25 శాతం నుంచి 30 శాతం వరకు పెరిగాయి. అదే సమయంలో అనేక పంటల ధరలు స్థిరంగా ఉండి పోయాయి. కొన్నిసార్లు దిగుమతుల ప్రభావంతో ధరలు పడిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో సాగు కొనసాగించడమే రైతుకు భారంగా మారుతోంది. అప్పుల ఊబిలో చిక్కుకుని, నష్టాలతో అలమటిస్తున్న రైతుకు బడ్జెట్ భరోసా ఇవ్వలేకపోయింది.

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్ చాలా కాలంగా కొనసాగుతోంది. రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు, ఆర్థికవేత్తలు ఈ అంశంపై ఏకాభిప్రాయంతో ఉన్నా, విధాన నిర్ణయాల్లో అది ప్రతిబింబించలేదు. ధరల స్థిరీకరణ వ్యవస్థ బలపడకపోతే రైతు ఆదాయం స్థిరంగా ఉండదు. మార్కెట్ లో ఊగిసలాటలు రైతును తీవ్రంగా నష్టపరుస్తాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపకుండా వ్యవసాయ రంగంలో దీర్ఘకాలిక స్థిరత్వం సాధ్యం కాదు.

పంటల మార్పిడి అవసరమన్న వాదనలో కొంత సత్యం ఉంది. నీటి కొరత, వాతావరణ మార్పుల నేపథ్యంలో సంప్రదాయ పంటలపై ఆధారపడటం ప్రమాదకరమే. కానీ పంట మార్పిడిని సూచించడం ఒక్కటే సరిపోదు. రైతుకు అవసరమైన శిక్షణ, మార్కెట్ భరోసా,



ప్రారంభ సంవత్సరాల్లో ఆదాయ రక్షణ లేకపోతే అతడు ఆ మార్పును స్వీకరించడు. చిన్న సన్నకారు రైతు ప్రతి సీజన్ ఒక జీవన పోరాటంగా చూస్తాడు. అతడికి ప్రయోగాలు చేసే అవకాశం చాలా తక్కువ. ఈ వాస్తవాన్ని విధానాలు గుర్తించాల్సిన అవసరం ఉంది. దిగుమతుల విధానం రైతు భవితవ్యాన్ని నిర్ణయించే కీలక అంశంగా మారింది. నూనె గింజలు, పప్పు ధాన్యాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు దేశీయ ధరలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. సుంకాల విధానం రైతు ప్రయోజనాలకు అనుగుణంగా లేకపోతే దేశీయ ఉత్పత్తి క్రమంగా తగ్గిపోతుంది. దీని ప్రభావం ఆహార భద్రతపై కూడా పడుతుంది. స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహించకుండా దిగుమతులపై ఆధారపడటం దీర్ఘకాలంలో ప్రమాదకరమే. ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ సాగు వంటి విధానాలను ప్రోత్సహి స్తామని ప్రకటించినా, ఆ దిశగా రైతుకు తగిన ఆర్థిక భరోసా అందడం లేదు. ఈ విధానాలు మొదటి కొన్ని సంవత్సరాల్లో దిగుబడులు తగ్గే అవకాశముంది. ఆ సమయంలో ఆదాయ నష్టం పూడ్చే వ్యవస్థ లేకపోతే రైతు వెనకడుగు వేస్తాడు. ప్రకటనలకే పరిమితమయ్యే విధానాలు క్షేత్ర స్థాయిలో ఫలితాలు ఇవ్వవు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సలహా వ్యవస్థలు, డిజిటల్ వ్యవసాయం వంటి ఆలోచనలు భవిష్యత్తుకు అవసరమే. కానీ ఇవి రైతు ప్రాథమిక సమస్యలకు ప్రత్యామ్నాయం కావు. సాగునీరు, మార్కెట్ ధర, ఇన్పుట్ వ్యయం, రుణ లభ్యత వంటి మౌలిక అంశాలు పరిష్కారమైతేనే ఆధునిక సాంకేతికతలు ప్రయోజనకరం గా మారతాయి. టెక్నాలజీ రైతు సమస్యలను అర్థం చేసుకునే సాధనంగా ఉండాలి, సమస్యలపై పైపొర మెరుగు పూతగా కాదు. వ్యవసాయ రంగాన్ని నిజంగా బలోపేతం చేయాలంటే విధానాల్లో మూలపూర్వక మార్పులు అవసరం. రైతును ఉత్పత్తిదారుడిగా మాత్రమే కాకుండా దేశ ఆర్థిక భద్రతకు కాపలాదారుడిగా చూడాల్సి న అవసరం ఉంది. రైతు ఆదాయం స్థిరంగా పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. గ్రామీణ డిమాండ్ పెరిగితే పరిశ్రమలు, సేవారంగం కూడా లాభపడతాయి. ఈ అనుసంధానాన్ని విస్మరించ డం దేశ ఆర్థిక అభివృద్ధిని అసమతుల్యంగా మారుస్తుంది. 2025-26 కేంద్ర బడ్జెట్ వ్యవసాయ రంగానికి ఇచ్చిన సందేశం రైతుకు పూర్తి భరోసా ఇవ్వలేకపోయిందన్న భావనను కలిగిస్తోంది. వ్యవసాయాన్ని కేవలం గణాంకాల రంగంగా చూడకుండా, రైతు జీవితాన్ని కేంద్రంగా పెట్టుకుని విధానాలు రూపొందించినప్పుడే నిజమైన సంక్షేమం సాధ్యం అవుతుంది. రైతు చిరునవ్వు దేశ ఆర్థిక ఆరోగ్యానికి నిజమైన సూచిక. ఆ చిరునవ్వు తిరిగి రావాలంటే మాటలకన్నా కార్యాచరణ అవసరం. ఆ కార్యాచరణ ఇప్పుడే మొదలవ్వాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయ రంగాన్ని పట్టించుకోని విధానాల ప్రభావం క్రమంగా సమాజంలోని అన్ని వర్గాలపై పడుతుంది. రైతు నష్టపోతే ఆ ప్రభావం గ్రామీణ ఉపాధిపై పడుతుంది. గ్రామీణ ఉపాధి క్షీణిస్తే పట్టణాలకు వలసలు పెరుగుతాయి. ఈ వలసలు సామాజిక అసమతుల్యతకు దారి తీస్తాయి. నగరాల్లో నిరుద్యోగం పెరగడం, మౌలిక వసతులపై ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ పరిణామాలన్నీ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన విధానాల ప్రత్యక్ష ఫలితాలే.రైతు అప్పుల ఊబిలో చిక్కుకోవడం ఒక్కరోజులో జరిగేది కాదు. సాగు వ్యయం పెరగడం, పంట నష్టాలు పునరావృతం కావడం, ధరల ఊగిసలాట కొనసాగడం వంటి అంశాలు రైతును మానసికంగా కుంగదీస్తున్నాయి. ప్రతి సీజన్ ఒక పరీక్షగా మారింది. లాభం వస్తుందన్న నమ్మకం లేకుండా సాగు చేయడం రైతుకు అత్యంత క్లిష్టమైన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆర్థిక భరోసా లేని బడ్జెట్ రైతు ఆత్మవిశ్వాసాన్ని పెంచలేకపోయింది.

గ్రామీణ రుణ వ్యవస్థ బలహీనపడటం కూడా ఒక పెద్ద సమస్యగా మారింది. సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలు రైతుకు చేరువైన వ్యవస్థలుగా ఉన్నా, నిధుల కొరత వల్ల అవి పూర్తిస్థాయిలో పనిచేయలేకపోతున్నాయి. వడ్డీ రేట్లు పెరగడం, రుణాల లభ్యత ఆలస్యం కావడం రైతును ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వైపు నెట్టేస్తోంది. ఇది మరింత అప్పుల భారాన్ని మోపుతోంది.

వ్యవసాయ రంగంలో యువత ఆసక్తి తగ్గిపోతున్న పరిస్థితి కూడా గమనించాల్సిన అంశం. సాగు లాభసాటిగా కనిపించకపోవడం, భవిష్యత్తుపై నమ్మకం లేకపోవడం వల్ల యువత వ్యవసాయాన్ని వదిలి ఇతర రంగాల వైపు మొగ్గు చూపుతోంది. దీని ప్రభావం దీర్ఘకాలంలో దేశ ఆహార భద్రతపై పడే ప్రమాదం ఉంది. రైతు వయస్సు సగటు పెరుగుతున్నదన్న గణాంకాలు ఈ సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. రైతును కేంద్రంగా పెట్టుకున్న విధానాలు లేకపోతే ఆధునిక సాంకేతికతలు కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వవు. డ్రోన్లు, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు, డేటా ఆధారిత సాగు విధానాలు ఉపయోగపడాలంటే ముందుగా రైతుకు కనీస భరోసా అవసరం. సాగు నష్టపోతే ఆదుకునే వ్యవస్థ ఉండాలన్న నమ్మకం లేకపోతే రైతు కొత్త పద్ధతులను స్వీకరించడు. విధానాలు ఈ మానసిక కోణాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ రంగం బలోపేతం కావడం అంటే రైతుకు మాత్రమే మేలు జరగడం కాదు. అది దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి సంబంధి ంచిన అంశం. ఆహార ధరలు నియంత్రణలో ఉంటే ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుంది. ద్రవ్యోల్బణం నియంత్రితంగా ఉంటే దేశ ఆర్థిక వృద్ధి స్థిరంగా కొనసాగుతుంది. ఈ సూత్రాన్ని విస్మరించడం ప్రమాదకరం. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిజమైన ప్రాధాన్యం ఇచ్చినప్పుడే రైతుకు భవిష్యత్తుపై నమ్మకం ఏర్పడు తుంది. రైతు నమ్మకం తిరిగి వస్తేనే వ్యవసాయ రంగం తిరిగి ఊపందుకుంటుంది. ఆ నమ్మకాన్ని కలిగించే చర్యలు మాటల్లో కాకుండా కార్యాచరణలో కనిపించాల్సిన అవసరం ఉంది. అప్పుడే వ్యవసాయం నిజంగా దేశ అభివృద్ధికి బలమైన ఆధారంగా మారుతుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ పోరాటాలు

### భూమి, బతుకు, భవిష్యత్తు కోసం సాగిన సంగ్రామం

1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతదేశం ప్రధానంగా వ్యవసాయాధారిత దేశం. భూమి కొద్దిమంది జమీందారుల చేతుల్లో కేంద్రీకృతమై ఉండటం, పేద రైతులు అప్పుల బారిన పడటం, కౌలు రైతుల అస్థిర జీవితం ఇవన్నీ వలస పాలన నుంచి వారసత్వంగా వచ్చిన సమస్యలు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం భూసంస్కరణలు చేపట్టినప్పటికీ, భూమి సమాన పంపిణీ లక్ష్యం పూర్తిగా నెరవేరలేదు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా వివిధ దశల్లో వ్యవసాయ పోరాటాలు ఉద్భవించాయి. ఇవి కేవలం ఆర్థిక సమస్యలు మాత్రమే కాకుండా సామాజిక న్యాయం, గౌరవం, రాజకీయ హక్కుల కోసం సాగిన ఉద్యమాలుగా నిలిచాయి.

స్వాతంత్ర్యానంతరం తొలి దశలోనే భూసంస్కరణల అమలుపై అసంతృప్తి పెరిగింది. తెలంగాణ ప్రాంతంలో 1940ల చివర్లో ప్రారంభమైన సాయుధ రైతాంగ పోరాటం స్వాతంత్ర్యానంతరం కూడా ప్రభావం చూపింది. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటం భూమి పంపిణీ, కౌలు రైతుల హక్కుల కోసం దృఢమైన స్వరంగా నిలిచింది. తరువాత 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్‌బరి ప్రాంతంలో జరిగిన తిరుగుబాటు వ్యవసాయ సమస్యలను దేశవ్యాప్తంగా చర్చకు తెచ్చింది. ఈ ఉద్యమం నుంచి పుట్టిన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్ –లెనినిస్ట్) భూమి స్వాధీనం, గ్రామీణ విప్లవం వంటి నినాదాలను ముందుకు తెచ్చింది. అయితే హింసాత్మక మార్గం విస్తృత ప్రజాభిమానాన్ని పొందలేకపోయింది.

1960ల చివర్లో ఆహార కొరతను ఎదుర్కొనేందుకు ప్రారంభమైన హరిత విప్లవం రైతుల జీవితాల్లో విభిన్న ప్రభావాలు చూపింది. అధిక దిగుబడుల విత్తనాలు, రసాయన ఎరువులు, నీటి పారుదల సదుపాయాలు వ్యవసాయ ఉత్పత్తిని పెంచినా, ఈ లాభాలు ప్రధానంగా పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్ వంటి ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యాయి. చిన్న రైతులు, వర్షాధార ప్రాంతాల్లోని కర్షకులు ఈ మార్పులో పూర్తిగా భాగస్వాములు కాలేకపోయారు. ఫలితంగా ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. 1980లలో రైతు సంఘాలు మరింత వ్యవస్థీకృతంగా ఎదిగాయి. మహారాష్ట్రలో శరద్ జోషి నాయకత్వంలోని (శేత్కరి సంఘటనా), ఉత్తరప్రదేశ్‌లో మహేంద్రసింగ్ టికాయత్ ఆధ్వర్యంలోని (భారతీయ కిసాన్ యూనియన్) రైతుల ధరల సమస్యలు, విద్యుత్ చార్జీలు, అప్పు మాఫీలపై ఉద్యమాలు చేపట్టాయి. 1988లో ఢిల్లీలోని బోట్ క్లబ్ వద్ద లక్షలాది మంది రైతులు గుమికూడిన సంఘటన రైతు రాజకీయాల శక్తిని దేశానికి చూపించింది. ఈ దశలో రైతు ఉద్యమాలు వర్గపోరాటం నుంచి ధరల ఆధారిత ఆర్థిక పోరాటాల దిశగా మారాయి.

1991లో ఆర్థిక ఉదారీకరణ తర్వాత వ్యవసాయం కొత్త సవాళ్లను ఎదుర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం, దిగుమతుల పెరుగుదల, మద్దతు ధరల అస్థిరత రైతుల ఆదాయంపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా పత్తి, విత్తనాల రంగంలో బహుళజాతి సంస్థల ప్రవేశం ఖర్చులను పెంచింది. అప్పుల భారంతో రైతు ఆత్మహత్యలు పెరిగిన విషయం జాతీయ దృష్టిని ఆకర్షించింది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు ఈ విషాదానికి ప్రధాన కేంద్రాలుగా మారాయి. ఈ పరిస్థితుల్లో రైతు సంఘాలు కనీస మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీలు, అప్పు మాఫీ వంటి డిమాండ్లతో ప్రభుత్వాలను ఒత్తిడి చేశాయి.

ఇటీవలి దశలో 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన దేశవ్యాప్త ఉద్యమం స్వాతంత్ర్యానంతర వ్యవసాయ పోరాటాల్లో కీలక మైలురాయిగా నిలిచింది. పంజాబ్, హర్యానా రైతుల నుంచి ప్రారంభమైన ఈ నిరసన ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాది పాటు కొనసాగింది. చివరికి ప్రభుత్వం ఆ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ సంఘటన రైతు సంఘాల ఐక్యత, సామూహిక శక్తిని మరోసారి నిరూపించింది. మార్కెట్ స్వేచ్ఛ పేరుతో తీసుకొచ్చిన సంస్కరణలు రైతులకు నిజంగా లాభదాయకమా అనే ప్రశ్నను దేశవ్యాప్తంగా చర్చకు తెచ్చింది.

మొత్తంగా స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ పోరాటాలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో కీలక అధ్యాయాలు. ఇవి ప్రభుత్వాలను విధాన మార్పులకు ప్రేరేపించాయి; వ్యవసాయ సమస్యలను జాతీయ చర్చలో నిలిపాయి. అయితే సమస్యల మూలాలను సమగ్రంగా పరిష్కరించడంలో ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. భూమి, నీరు, ధర, గౌరవం ఈ నాలుగు అంశాల చుట్టూ రైతు పోరాటాలు తిరిగాయి, తిరుగుతూనే ఉంటాయి. వ్యవసాయాన్ని కేవలం ఆర్థిక రంగంగా కాకుండా సామాజిక న్యాయం దృష్టితో చూడగలిగితేనే రైతు పోరాటాల ఆవశ్యకత తగ్గుతుంది. లేనిపక్షంలో ఈ సంగ్రామం కొత్త రూపాల్లో కొనసాగుతూనే ఉంటుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

### శ్రుతులు

ముస్లిమ్ క్రిస్టియన్ల
పంపేస్తారా?
మరి ఆర్యుల్ని?
వీళ్లనెక్కడికి పంపాలి?
.మనం పంపేస్తే
విదేశాల్లో ఉన్న
హిందువుల్ని
వాళ్లు పంపేయరా?
.మన ఇంటికి వాళ్ళ
ఇల్లుఎంతదూరమో!
వాళ్లఇంటికిమనఇల్లూ
అంతేదూరం!
ఎవరినీ ఎవరూ
పంపేపనిలేదు!
ఎక్కడి వాళ్ళక్కడే
గప్ చిప్!
ఇప్పటికే
సైన్స్ ఉటెక్నాలజీ
ప్రపంచమానవుణ్ణి
తయారుచేసింది!
ఊహాతీతం కాదు
అడవిమనిషి
వ్యవస్థలెన్నో దాటి
ఏక ప్రపంచంలోకి!
దోపిడీ నిలవదు!
అనివార్యగా
అందరికోసం
అందరి ప్రపంచం!
అందరం ఒక్కటై
ఆదిమకమ్యూనిజం
వ్యవస్థల
అవస్తలుదాటి
ఇక్కడికొచ్చాము!
బానిసత్వంలేని
కులమతాలులేని
దోపిడీలేని-శాస్త్రీయ
కమ్యూనిజంలోకి!
.కొత్త ప్రపంచంలో
కొత్త సంస్కృతిలో
ఆనందానురాగాల
ప్రేమికుల లోకంలోకి!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

జనంసాక్షి



# వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం

### విద్యా నాణ్యతకు వరమా..? శాపమా...?

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యా సంస్థలు, ప్రభుత్వాలు "100% ఫలితాల" సాధనే పరమావధిగా ముందుకు సాగుతున్నాయి. లక్ష్యాలు ఉండటం మంచిదే అయినప్పటికీ, అది కేవలం అంకెలకే పరిమితమైనప్పుడు విద్యా వ్యవస్థలోని అసలు ఆశయం దెబ్బతినే అవకాశం ఉంది. ఈ విధానం వల్ల కలిగే అనర్థాలు మరియు ఉండాల్సిన మార్పులపై ఒక విశ్లేషణ.ఒత్తిడిలో ఉపాధ్యాయులు - నాణ్యతకు దూరమవుతున్న బోధన ఉపాధ్యాయులపై మరియు ప్రధానోపాధ్యాయులపై 100% ఫలితాల సాధన కోసం విపరీతమైన ఒత్తిడి పెరుగుతోంది. దీనివల్ల యాంత్రిక బోధన: సిలబస్ పూర్తి చేయడం, పరీక్షలకు సిద్ధం చేయడంపైనే దృష్టి పెట్టడం వల్ల సృజనాత్మక బోధనకు తావు లేకుండా పోతోంది.మానసిక ఒత్తిడి ...ఫలితాలు తక్కువగా వస్తే ఎదుర్కోవాల్సిన విమర్శలు, చర్యల భయంతో ఉపాధ్యాయులు నిరంతరం ఒత్తిడికి లోనవుతున్నారు. ఇది వారి బోధనా సామర్థ్యాన్ని దెబ్బతీస్తోంది. విద్యార్థులపై ప్రతికూల ప్రభావం విద్యార్థుల సామర్థ్యాలు ఒకేలా ఉండవు.

**ప్రపంచంలో జ్ఞానం కంటే మార్కులకే ప్రాధాన్యత:**

కేవలం పరీక్షల్లో మార్కులు వస్తే చాలనే ధోరణి వల్ల ప్రపంచంలో విద్యార్థులు నిజమైన జ్ఞానాన్ని, నైపుణ్యాలను కోల్పోతున్నారు.

**అనైతిక పద్ధతులు:**

ఎలాగైనా పాస్ కావాలనే ఒత్తిడి విద్యార్థులను, కొన్నిసార్లు యాజమాన్యాలనుకూడా మాస్ కాపీయింగ్ వంటి అనైతిక మార్గాల వైపు ప్రేరేపించే ప్రమాదం ఉంది.మానసిక ఆందోళన: అధిక ఒత్తిడి వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం తగ్గి, డిప్రెషన్ వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఆచరణ సాధ్యమైన లక్ష్యాలు - అవసరమైన మార్పులు100% ఫలితాల లక్ష్యానికి బదులుగా, నాణ్యమై న విద్యను అందించడంపై దృష్టి పెట్టాలి. ఇందుకోసం క్రింది సూచనలు పాటించవచ్చు:విభాగం చేయవలసిన మార్పులులక్ష్యాలు అంకెల కంటే విద్యార్థి సాధించే ప్రగతి ప్రోగ్రెస్ ప్రాతిపదికగా ఉండాలి. బోధన విద్యార్థి స్థాయికి తగ్గట్టుగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మార్చుకోవాలి. వనరులు పాఠశాలల్లో తగినన్ని వనరులు, మౌలిక సదుపాయాలు మరియు ఉపాధ్యాయులకు శిక్షణ అందించాలి.పరీక్షలు కేవలం బట్టీ పట్టే విధానం కాకుండా, విద్యార్థి ఆలోచనా శక్తిని పరీక్షించేలా ఉండాలి. ముగింపు విద్యా వ్యవస్థ అంతిమ లక్ష్యం విద్యార్థిని ఒక బాధ్యతాయుతమైన, నైపుణ్యం కలిగిన పౌరుడిగా తీర్చిదిద్దడమే కావాలి. కేవలం సర్టిఫికెట్ల మీద 100% అనిపించుకోవడం కోసం విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టకూడదు. సృజనాత్మకతకు, నైపుణ్యానికి మరియు సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేసినప్పుడే అది నిజమైన విద్య అవుతుంది.



బి "సునీల్ కుమార్"
మ్యాథమెటిక్స్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు

# తెలుగు పత్రికా రంగానికి మార్గ నిర్దేశకుడు నార్ల


### ఫిబ్రవరి 16.... నార్ల వెంకటేశ్వరరావు వర్ధంతి

నార్ల వెంకటేశ్వరరావు... పరిచయం అక్కర్లేని పేరు. నిర్భయానికి, నిక్క చ్చితత్వానికి, నిబద్ధతకు మారు పేరు. వృత్తి నిబద్ధతతో నిర్వహిం చారు. వృత్తి నిర్వహణ సామాజిక బాధ్యతగా భావించారు. పత్రికా రంగానికి మార్గదర్శకులు, జర్నలిస్టు లకు దిశానిర్దేశకులు. ఆయనొక విజ్ఞాన సర్వస్వం. అయన జీవితం సంస్కరణల మయం. రచన ఏది చేసినా, ప్రక్రియ ఎదైనా, ప్రజా చైతన్యమే ఆయన లక్ష్యం. లక్ష్య సిద్ధి కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ముందుకే సాగిన వైనం.

రచయితగా, నాటకకర్తగా, విమర్శ కుడిగా, అనువాదకుడిగా బహుముఖ పాత్రలు పోషించిన ఆయన జీవిత పర్యంతం హేతుబద్ధమైన ఆలోచనల ద్వారా సామాజిక స్పృహ కల్పించే ప్రయత్నం చేశారు. ఆంగ్ల భాషలోనూ నిష్ణాతులైనా, తెలుగు ప్రజలకు తన రచనలు చేరువ కావాలనే తలంపుతో, తెలుగు పత్రికా రంగాన్ని కావాలనే ఎంచుకున్నారు.

మధ్య ప్రదేశ్ లోని జబల్‌పూర్‌లో డిసెంబర్ 1, 1908 జన్మించిన నార్ల, విద్యాభ్యాసం కృష్ణా జిల్లాలో జరిగిం ది. వెంకటేశ్వరరావు ఏప్రిల్ 3, 1958 నుండి ఏప్రిల్ 2, 1970 వరకు రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యునిగా పని చేశారు.

స్వరాజ్య, జన వాణి, ప్రజా మిత్ర పత్రికలో పని చేసి, ఆంధ్ర ప్రభ, చివరకు ఆంధ్ర జ్యోతి పత్రికలకు ఎడిటర్ గా విధులు నిర్వర్తించారు. విధి నిర్వహణలో ఎన్నడూ అయన రాజీ పడలేదు. ఆయన సంపాద కీయ రచనలు సూటిదనం, గడుసు దనం, వ్యంగ్యం, చమత్కారం, లోక జ్ఞత, సమయజ్ఞత కల గలిపి ఉండే వి.



పండితునికి, పామరునికి తెలు గు భాష అర్ధమయ్యే రీతిలో నార్ల సంపాదకీయాలు, రచనలు చేశారు.

"వాస్తవమ్ము నార్లవారి మాట" మకుటంతో ఆటవెలదులు రచించారు. "నవయుగాల బాట నార్ల మాట" మకుటంతో 700కు పైగా సందేశాత్మక పద్యాలు రాశారు. 16 ఏకాంకికల సంపుటి వెలువరించారు. నార్ల సొంత గ్రంథాలయంలో 20,000 పుస్తకాలు ఉండేవట అంటే మాటలు కాదు. సంపాదకుడు అనే మాటను అయన అంగీకరించ లేదు. ఆమోదించ లేదు. ఎడిటర్ అనే పదాన్నే వాడే వారు. నార్ల... టంగుటూరి ప్రకాశం, నీలం సంజీవరెడ్డి, , కాసు బ్రహ్మానంద రెడ్డి, ఎన్.జి. రంగా ఎవరినీ వదల లేదు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ చాందసాన్ని విమర్శించక మాన లేదు. ఇందిరా గాంధి, ఆమె కుటుంబ వారసత్వ రాజకీయాల్ని ద్వేషించారు.

ఆయన వ్యాసాలను నిరక్షరాస్యులు గ్రామాల్లోని రచ్చబండల దగ్గర చదివి వినిపించుకునే వారంటే ఆయనలోని రచనా వ్యాసంగ శక్తి ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.

ఆంధ్రప్రభ నుంచి వైదొలిగిన సందర్భంలో, నార్ల కోసం కొందరు ముఖ్యులు కలిసి ఆంధ్ర జ్యోతి పత్రిక ప్రారంభించారంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది. గోరాశాస్త్రి మాటల్లో చెప్పాలంటే 'కేవలం సత్వగుణ ప్రధానంగా, అచ్చ తెలుగులో చప్పచప్పగా ఉన్న పత్రికా రచనలో వాడినీ, వేడినీ సృష్టించి, తెలుగు నుడికారంలో ఎంత 'కారం' ఉందో తెలియజెప్పిన వాడు' నార్ల.

"యొక్కలతో తెలుగుభాష డొక్క పొడవొద్దు...ఎంత గొప్ప వాడైనా వస్తాడే కాని విచ్చేయడు...సంపాదకుడు అనొద్దు ఎడిటర్ అనండి... బడు వాడేవాడు బడుద్ధాయి. అంటూ పత్రికా భాష ఎలా ఉండాలో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఫిబ్రవరి 16, 1985న ఈ లోకాన్ని వీడి వెళ్లిన నార్ల తెలుగు సాహిత్య, పత్రికా రంగాలలో చెరగని ముద్ర వేసి వెళ్లారు. "ఎడిటరైన వాడు బిడియము చూపుచో ధాటి తగ్గు వృత్తి ధర్మమందు, కడుపుకూటి రాత కక్కుర్తి రాతరా" "నిజము కప్పిపుచ్చి నీతిని విడనాడి స్వామి సేవ సేయు జర్నలిస్టు తార్చువాని కంటే తక్కువ వాడురా" అంటూ విలువలు వీడ వలదని హితవు పలికారు. ప్రస్తుత పరిస్థితులలో ఆయన చేసిన మార్గ నిర్దేశం నేటి జర్నలిస్టులకు నిజంగానే శిరోధార్యం.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# తెలంగాణలో ఏజెన్సీ డీఎస్సీ ఎయ్యరా సారో!

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అంటూ వేదిక ఏదైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే గుర్తు చేస్తుంటారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలు అంటే ఆదివాసులు నివసించే అటవీ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి అత్యంత ప్రాముఖ్యమైనది. ఈ ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. అందువల్ల ప్రభుత్వం తక్షణమే ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత 2018 సంవత్సరంలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ తర్వాత 2024 మెగా డీఎస్సీ పేరుతో టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య 11,062 ఉండగా దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 2,79, 956 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఒక్క పోస్ట్ కు 26 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 6 సెప్టెంబరు 2023 నాటికి ఏజెన్సీ ప్రాంతంలో 5089 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ని పక్కన పెట్టిన పాలకులు 22 ఏప్రిల్ 2020 సంవత్సరం సుప్రీంకోర్టులో జీవో నెంబర్ 3 ను కొట్టి వేయబడిందని సాకు చెబుతూ అర్హులైన స్థానిక ఆదివాసీ నిరుద్యోగ యువతకు దక్కవలసిన ఉపాధ్యాయ ఉద్యోగాలు గిరిజనేతర్లతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో భర్తీ చేయవలసిన 5,089 ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అర్హత కలిగిన స్థానిక ఆదివాసి నిరుద్యోగ యువత ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తుంది.

**ఉపాధ్యాయుల కొరత - ప్రధాన సమస్య**

ఏజెన్సీ ప్రాంతంలోని ప్రైమరీ పాఠశాలలు ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్కూల్స్ సంఖ్య 2,311 ఉండగా ట్రైబల్ రెసిడెన్షియల్, ఆర్ఎస్,ఆర్ జె సి, జీఎం స్కూల్స్ మొత్తం 165



ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో నడుస్తున్నాయి. కొన్నిచోట్ల ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు బోధిస్తున్న పరిస్థితి ఉంది. ఇది విద్యా ప్రమాణాలను తగ్గిస్తోంది. విద్యార్థులు సరైన మార్గదర్శకత్వం పొందలేక పోతున్నారు. ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ద్వారా అర్హత కలిగిన స్థానిక ఆదివాసి అభ్యర్థులను నియమిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

**ఆదివాసి విద్యార్థుల అభివృద్ధి**

ఆదివాసి ప్రాంతాల్లో విద్యార్థులు భాషా సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, రవాణా సౌకర్యాల లోపం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. స్థానిక భాష, సంస్కృతి తెలిసిన ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులకు బోధన సులభంగా అర్థమవుతుంది. దీంతో చదువు మానివేతలు తగ్గి, ఉన్నత విద్యకు అవకాశాలు పెరుగుతాయి. బీఈడీ, టిటిసి పూర్తిచేసిన స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఆదివాసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇది వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుంది. స్థానికులు ఉద్యోగాలు పొందితే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వేగవంతమవుతుంది.

**ప్రభుత్వ బాధ్యత**

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలి. రాజ్యాంగం కూడా ఆదివాసి ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక రక్షణ కల్పించింది. అందువల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గుర్తించి, ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి ఆదివాసి నిరుద్యోగ యువత కోరుతున్నారు. మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఆదివాసి ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సుప్రీంకోర్టు కొట్టి వేసిన జీవో నెంబర్ 3 ను పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంతాలలోని ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ప్రత్యేక ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేసి నిరుద్యోగ ఆదివాసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

మొత్తానికి ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ అత్యవసరం. ఇది ఆదివాసి విద్యార్థుల భవిష్యత్తును ప్రకాశవంతం చేయడమే కాకుండా, ఆదివాసి సమాజ అభివృద్ధికి బాటలు వేస్తుంది. ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం తక్షణ చర్యలు తీసుకుని ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అర్హులైన ఆదివాసి నిరుద్యోగ యువత ఆశిస్తున్నారు.



డాక్టర్ సాగబోయిన
పాపారావు
సెల్ :9989828774

# గిరిజన సమాజానికి మార్గదర్శకుడు సేవా లాల్

**హయత్‌నగర్, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** సద్గురు సంత్ సేవాలాల్ 287వ జయంతి సందర్భంగా తెలంగాణ గిరిజన సమాఖ్య హయత్ నగర్ మండల కార్యదర్శి కేలోతు రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సిపిఐ ఎల్బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి, గిరిజన సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి జాటోత్ జైపాల్ లు హాజరై, హోమం లో పాల్గొని, వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంత్ సేవా లాల్ మహారాజ్ గిరిజన సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారని, సమాజంలో ఐక్యత, నైతిక విలువలు, సేవాభావం పెంపొందించడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని వారు తెలిపారు. హోమం నిర్వహణ వెనుక ఉన్న ఆధ్యాత్మిక భావనను వివరిస్తూ



ఈ విధమైన కార్యక్రమాలు మనిషిలోని చెడు ఆలోచనలు, చెడు అలవాట్లు, అసహనం వంటి దుర్గుణాలను దహనం చేసి, మంచి గుణాలు, సత్సంకల్పాలు, సహనశీలత, సామరస్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని వారు అన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పేందుకు సంత్ సేవాలాల్ బోధనలు నేటికీ చెప్పుకో దగినయని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యదర్శి శేషరాజు పల్లి శ్రీదేవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, కర్నె సుజాత, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు మండల కార్యదర్శి కొప్పుల సరిత, సోషల్ మీడియా కార్యదర్శి మమత, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంబళ్ల రాములు, రాజకుమార్, అనిల్, విజయ్, రవీందర్, దేవా, బాలకృష్ణ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలి

- మర్పల్లి గ్రామ సర్పంచ్ రామేశ్వర్



**మర్పల్లి, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** సంతు సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని మర్పల్లి గ్రామ సర్పంచ్ రామేశ్వర్, ఉప సర్పంచ్ కొప్పుల ప్రభు అన్నారు. ఆదివారం గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని మర్పల్లి మండల కేంద్రంలో సేవాలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతు సేవాలాల్ తన బోధనలతో గిరిజనుల అభివృద్ధి కొరకు ఎంతో కృషి చేశారని, బంజారాలను చీకటి నుంచి వెలుగులోకి తీసుకు వచ్చిన ఒక విప్లవ చైతన్య మూర్తి అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రవీందర్, పట్లూర్ సర్పంచ్ పరశురాం, షాపూర్ తండా సర్పంచ్ రామ్ ల్లి బాయి, నర్సాపూర్ తండా సర్పంచ్ కమ్లి బాయి, గుర్రంగట్టు తండా సర్పంచ్ రాజు, చందర్ నాయక్, గోపాల్, నీలకంఠం, సంగమేశ్, గోవర్ధన్, శివరాం, రాజు, ధర్మో నాయక్, మాజీ సర్పంచ్ పాండు, పాండు గుర్రం గట్టు తాండ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ కమ్యూనిస్టు యోధుడు ధర్మ భిక్షం



**హయత్‌నగర్, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** ఎన్నికల్లో ఎప్పుడు ఓటమి ఎరుగని ప్రజా నాయకుడు బొమ్మగాని ధర్మభిక్షం 104వ జయంతి సందర్భంగా ఎల్ బి నగర్ లోని మహనీయుల విగ్రహాల వద్ద తెలంగాణా రాజ్యాధికార పార్టీ ఎల్‌బి నగర్ ఇంచార్జి, రంగా రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగా సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం జీవితం నేటి సమాజానికి ఆదర్శం అని వారు కొనియాడారు. విద్యార్థి దశ నుండి, ఆదర్శ భావాలను పునికి పుచ్చుకున్న కమ్యూనిస్టు యోధుడు ధర్మభిక్షం అని వారు తెలిపారు. దున్నేవాడిదే భూమి అనే తరహాలోనే, గీసేవాడిదే చెట్టు అనే నినాదంతో కల్లుగీత కార్మికుల హక్కుల కోసం అఖిల భారత స్థాయిలో పోరాడిన నిస్వార్థ నాయకుడు అని వారు చెప్పారు. గౌడ సామాజిక వర్గం, తెలంగాణ సమాజం గర్వించదగ్గ గొప్ప నాయకుడని, పుట్టుక తనది బ్రతుకంత ప్రజలది అనే నినాదంతో తన జీవితాన్నే సమాజానికి అర్పించిన త్యాగధనుడు ధర్మభిక్షం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చౌగాని సైదులు గౌడ్, వేముల కొండల్ గౌడ్, రమేష్ గౌడ్, గిలకత్తుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బౌరాపూర్ చెంచుపెంటలో మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం

**అచ్చంపేట, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో భౌరాపూర్ చెంచుపెంటలో జరిగిన శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామివారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెంచు గిరిజనుల సంప్రదాయాల మధ్య వేద మంత్రోచ్చారణలతో కళ్యాణోత్సవం నిర్వహించడం విశేషంగా నిలిచింది.బి మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతంలోని ఆలయాలు ఆధ్యాత్మికంగా మాత్రమే కాక పర్యాటకపరంగా కూడా ఎంతో ప్రాధాన్యత కలిగివున్నాయని తెలిపారు. భౌరాపూర్ చెంచుపెంటలోని ఈ దేవస్థానాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. అలయ ప్రాంగణంలో తాగునీరు, విద్యుత్,రహదారి, విశ్రాంతి గదులు వంటి తక్షణ అవసరాల కోసం తన ఎంపీ నిధుల నుండి రూ. 10 లక్షలు కేటాయిస్తానని



హామీ ఇచ్చారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆలయ సమగ్ర అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించేలా కృషి చేస్తానని వెల్లడించారు. గిరిజన ప్రాంతాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ పర్యాటక అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటామని, స్థానిక చెంచు గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా సేవలల్ మహారాజ్ జయంతి వేడుకలు




**మహమ్మదాబాద్, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** సంత్ సేవలాల్ మహారాజ్ జయంతి పురస్కరించుకొని,ఆదివారం నాడు మహ్మదాబాద్ మండల పరిధిలోని ఎల్కిచెరువు తండాలో బంజారుల ఆరాధ్య సద్గురు సేవలల్ మహారాజ్ వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్కిచెరువు తండా సర్పంచ్ సోమ్లా నాయక్ మాట్లాడుతూ..బంజారుల సద్గురు సేవలాల్ మహారాజ్ ఆశయాలు నెరవేర్చల ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమల నాయక్,ఉప సర్పంచ్ శంకర్ నాయక్,రాహుల్,శ్రీను,వెంకటేష్, లింగ్యనాయక్,శ్రావణ్,లాలు,శ్రీను,గిరిజన తండావాసులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలి



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** రాష్ట్రంలో న్యాయవాదులపైన జరుగుతున్న దాడులను ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వేదికగా పలువురు యువ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద హైకోర్టు న్యాయవాది ఇడుగు రజినీకాంత్ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నల్ల రిబ్బన్ లు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రజినీకాంత్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ కోసం తెలంగాణ రాష్ట్రంలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను తీసుకురావాలన్నారు. న్యాయవాదులపైన ఎవరైనా దాడులు చేస్తే తక్షణమే వారి పైన చర్యలు తీసుకునే విధంగా చట్టాన్ని రూపొందించాలన్నారు. రాష్ట్రంలో న్యాయవాదుల భద్రత కొరకు సరైన చట్టాలు లేకపోవడం వల్ల నిత్యం న్యాయవాదులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ దాడులలో న్యాయవాదులు తమ విలువైన ప్రాణాలను కోల్పోవడం బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. రాజస్థాన్ రాష్ట్రంలో అమలు పరిచినటువంటి అడ్వకేట్ యాక్ట్ ను తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలన్నారు. అలాగే యువ న్యాయవాదులకు నెలకు 5000 రూపాయల స్టైఫండ్ ను సైతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నామ సైదులు, కొమ్మనబోయిన సైదులు, చేరాల వంశీ, వంశీ, భూతం రఘు, భగత్ సింగ్, కథల పూర్ రమేష్, ఎన్నపోతుల అరుణ్ కుమార్, నరేందర్, మహేష్,అశ్వన్ తదితరులు న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో ఘనంగా శివరాత్రి వేడుకలు..



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని శివాలయాలను నిర్వాహకులు విద్యుత్ దీపాలతో అలంకరించి సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయము 5 గంటల నుండి భక్తులు ఆలయాలను సందర్శించుకోవడం జరిగింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆలయాలను సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**జగద్గిరిగుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో...**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శ్రీ మల్లికార్జున భ్రమరాంబ కేతమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. ఆలయ చైర్మన్ జే కే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు ఎంతో సాంప్రదాయంగా జరుపుకునే శివరాత్రి వేడుకలకు హాజరైన భక్తులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు గండిరాజు యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు అంజన్ యాదవ్, నరసింహులు, సాయిలు యాదవ్, సమ్మయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల వ్యాప్తంగా మిన్నంటిన శివనామస్మరణ

- భక్తులతో పోటెత్తిన శివాలయాలు

**జడ్చర్ల, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** మహాశివరాత్రి పర్వదినాన్ని



పురస్కరించుకొని ఆదివారం జడ్చర్ల పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, ఉపవాస దీక్షలతో శివయ్యను దర్శించుకునేందుకు ఆలయాల వద్ద బారులు తీరారు. హరహర మహాదేవ శంభో శంకర అనే శివనామ స్మరణతో జడ్చర్ల ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మండల పరిధిలోని కొత్త తండా గ్రామపంచాయతీలో వెలసిన శ్రీ చలమ లింగేశ్వర స్వామి దేవాలయంలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా 9వ వార్డు కౌన్సిలర్ చైతన్య చౌహన్, కాంగ్రెస్ నాయకులు కృష్ణారావు, కమలం శేఖర్, సూర్య చౌహన్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ సభ్యులు శంకర్ చౌహాన్, మన్యం, పీర్య నాయక్, హేమ్లా నాయక్ ఏర్పాట్లు చేశారు. జడ్చర్ల పట్టణంలోని ప్రధాన శివాలయాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని గుడులన్నీ విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు రోజంతా ఉపవాసం ఉండి స్వామివారికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు.

## నీటి సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

**శివ్వంపేట, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** మహా శివరాత్రి పార్వదినాన్ని పురస్కరించుకొని శివంపేట మండలం పెద్దగొట్టిముక్ల గ్రామంలో నెలకొన్న తాగునిటీ సమస్య పరిష్కారానికి గ్రామ పంచాయతీ పాలక వర్గం, మాజీ సర్పంచ్ గోలిపల్లి కవిత హన్మంత్ రెడ్డి లు శ్రీకారం చుట్టారు అందులో భాగంగానే ఆదివారం నూతన బోరు తవ్వకాన్ని సర్పంచ్ నవీన్ మాజీ సర్పంచ్ గోలిపల్లి కవిత హన్మంత్ రెడ్డి మాజీ ఎంపీటీసీ సులోచన ధర్మారెడ్డి లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 8, 9వ వార్డులలో నీటి సమస్య ఉందని గ్రామ ప్రజలు అడగగానే బోరు తవ్వకాన్ని మాజీ సర్పంచ్ గోలిపల్లి కవిత హన్మంత్ రెడ్డి సహకారతో ప్రారంభించడం జరిగిందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంజనేయులు, వార్డు మెంబర్లు అల్లాడి వీరేశం, నవీన్, బేరి సాయికుమార్, హరీష్, చేత్రి మల్లమ్మ, చేగురి లత, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, మురళిమనోహర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మహేష్ గౌడ్, గౌండ్ల



నాగయ్య, వాకిటి వీరారెడ్డి, పోచయ్య, ప్రభాకర్ గౌడ్, సింగిరెడ్డి అంజిరెడ్డి, మంగలి ఆంజనేయులు, రామారశీ నాగరాజు, వాకిటి అంజిరెడ్డి అరవింద్ రెడ్డి, పిల్లుట్ల గణేష్, జంగం నాగరాజు, కమిలి నగేష్, సామల గోపాల్, సామల వెంకటేష్ నగేష్, జంగని బిక్షపతి, మోకాల అనిల్, గంజి భిక్షపతి, జంగని బిక్షపతి, బాపని మహేష్, కొత్తల కిష్టయ్య, రామకృష్ణ, జిట్టా మహేష్, పెంటారెడ్డి, చేత్రి శ్రీకాంత్ చేత్రి గణేష్, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 196 మందిపై కేసు నమోదు

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యధావిధిగా శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ ను సైబరాబాద్ కమిషనరేట్ పరిధి ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు నిర్వహించారు. ప్రతివారం డ్రంకెన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం కొనసాగుతున్నా మందుబాబులు షరా మామూలే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం 196 మందిపై కేసు నమోదు కావడం జరిగింది.

## యతిన్ ట్రస్టు సేవలను విస్తరిస్తాం

- వాలీబాల్ కిట్లు అందజేత
- ట్రస్ట్ చైర్మన్ రవి నాయక్



**శివ్వంపేట, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** యతిన్ ట్రస్టు సేవలను భవిష్యత్ లో మరింతగా విస్తరిస్తామని యతిన్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ మెగావత్ రవి నాయక్, మెగావత్ శాంతి నాయక్ లు పేర్కొన్నారు. మండల పరిధిలోని లింగోజీగూడ తండాలో ఆదివారం యతిన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా యతిన్ ట్రస్టు ద్వారా పేద విద్యార్థుల చదువులకు సహాయ, సహకారాలను అందించడం, గ్రామాలలో ఉచితంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం, పూర్తిగా నిరుపేదలకు అన్నిరకాల సహాయాలను అందించడం జరుగుతుందని ట్రస్ట్ చైర్మన్ రవి తెలిపారు. యువకులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా క్రీడలను ప్రోత్సహించడం కోసం గ్రామాలలో యువతకు క్రీడా సామాగ్రిని అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో లింగోజీగూడ సర్పంచ్ బాసంపల్లి అమృత అశోక్ గౌడ్, ఉపసర్పంచ్ మాలోత్ గన్య నాయక్, అరవింద్ గౌడ్,మాలోత్ రమేష్ నాయక్, అరుణ్ నాయక్, దుర్గ్య నాయక్, యూత్ సభ్యులు, తాండ వాసులు పాల్గొన్నారు.

# సేవాలాల్ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలి

- సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్

**తాండూరు, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** సేవాలాల్ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం బంజారుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ 278వ జయంతి సందర్భంగా తాండూరు పట్టణం బాలాజీ నర్సింగ్ హోం సమీపంలో ని సేవాలాల్ మహారాజ్ విగ్రహనికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ తదితరులు కలిసి



పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. సంతు సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని పేర్కొన్నారు. గిరి పుత్రులు సేవాలాల్ మహారాజును ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రతిరోజూ ఆద్యాత్మిక తతో ముందుకు సాగాలన్నారు. అనంతరం హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ సురేష్ నాయక్ ,మాజీ కో ఆప్షన్ నెంబర్ వెంకట్ రామునాయక్, బషీర్ బషర్ మియతండా మాజీ సర్ పంచ్ మిత్రునాయక్ ,చరణ్ సింగ్ ,అనీల్ రాథోడ్ ,గోపాల్ ,రవి ,అనార్ సింగ్ ,శంకర్ ,దీపక్ రాథోడ్ ,ప్రకాష్ ,చందర్ ,విజయ్, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 ఫిబ్రవరి 2026

# బాల బ్రహ్మేశ్వరస్వామి వారి మహాశివరాత్రి ఉత్సవాలపై జిల్లా ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణ



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** అలంపూర్ శ్రీ శ్రీ శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఆలయ పరిసరాలు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన రహదారులు, తుంగభద్ర నది తీరం వద్ద భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోందని, కీలక ప్రాంతలలో పోలీస్ సిబ్బందిని మోహరించినట్లు పేర్కొన్నారు. పార్కింగ్ ప్రాంతాల నుంచి ఆలయానికి భక్తుల రాకపోకలు సులభంగా సాగేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత ఆటో సర్వీసులను పరిశీలించి, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమీక్షించి, ఎక్కడా రద్దీ పెరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక మహిళా పోలీస్ సిబ్బందిని నియమించినట్లు, తుంగభద్ర నది వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల కోసం అగ్నిమాపక శాఖ, వైద్య బృందాలు,అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రథోత్సవం, ప్రధాన పూజా కార్యక్రమాల సమయంలో జనరద్దీ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. పోలీస్ శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పని చేస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న అధికారులకు, సిబ్బందికి అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, భక్తులకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ కుటుంబ సమేతంగా శ్రీశ్రీశ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామివారిని,శ్రీ జోగుళాంబ అమ్మవారిని దర్శించుకొన్నారు.

## ఏడుపాయల జాతర బందోబస్తు పరిశీలించిన అడిషనల్ ఎస్పీ



**మెదక్ జిల్లా బ్యూరో / పాపన్నపేట, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** ఏడుపాయలలో జరుగుతున్న జాతర నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును జిల్లా అదనపు ఎస్పీ ఎస్ మహేందర్ ఆదివారం పరిశీలించారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్టంగా ఉండాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణను కట్టుదిట్టంగా అమలు చేయాలని, పాసులు ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి కల్పించాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, వృద్ధులు, మహిళలు మరియు చిన్నపిల్లలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందుగా కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలను నిలిపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతర పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిరంతర నిఘా కొనసాగించాలని, సీసీటీవీ కెమెరాలు మరియు కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని పర్యవేక్షించాలని అన్నారు. డ్యూటీలో ఉన్న పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## సేవాలాల్ మహారాజ్ ఆశయానికి అనుగుణంగా పనిచేయాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి



**మెదక్, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** అన్యాయాన్ని ఎదిరించాలి... సమాజంలో సమానత్వం రావాలనేది సేవాలాల్ మహారాజ్ ఆశయమని , అందుకు అనుగుణంగా అందరం పనిచేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లాలోని మండల కేంద్రమైన కొల్చారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వసురం తండా సర్పంచ్ మాలవత్ వినోద్ నాయక్, ఉప సర్పంచ్ రమావత్ సుధాకర్ నాయక్ అధ్యక్షతన ఆదివారం సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌశంకర్ గుప్తా, కొల్చారం మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు యాబన్నగారి రవితేజ రెడ్డి, కొల్చారం మండల బిఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు, సర్పంచులు స్వామి, ఆంజనేయులు, మోత్కు మల్లేశం, మహేష్, విజయ్, రమణ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంద్రసేనారెడ్డి, ప్రవీణ్ కుమార్, వేమారెడ్డి, ధనరాజ్, గౌరీ శంకర్, కాశీనాథ్, సిద్ధు, సురేష్ గౌడ్, మురళి, భాగయ్య,శంకర్, భాస్కర్, జంగిటి పోచయ్య, సీతారాం తండా సర్పంచ్ కమల మోహన్, ఉప సర్పంచ్ శివ, రవీందర్ నాయక్, అంబుర్య నాయక్, కిషన్, లోక్య జగన్, రమేష్, శ్రీను, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శివపార్వతుల పల్లకి సేవ ఊరేగింపు



**నారాయణపేట, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కారించుకొని ఆదివారం నారాయణపేట మండలంలోని సింగారం, జాజాపూర్,కోటకొండ, కొల్లంపల్లి, శ్యాసన్ పల్లి తదితర గ్రామాల్లో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సింగారం గ్రామంలోని ఈశ్వర్ మందిర్, రామలింగేశ్వర ఆలయం, విశ్వేశ్వరాలయం,మల్లికార్జున స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈశ్వర్ మందిర్, గట్టుపై వెలిసిన మల్లికార్జునస్వామి ఆలయాల్లో వద్ద పెద్దఎత్తున అభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం గురునాథ్ స్వామి నివాసం నుంచి శివపార్వతుల ఉత్సవమూర్తుల పల్లకీ సేవ ఉరేగింపు కార్యక్రమం గ్రామ పురవీధుల గుండా కన్నుల పండువగా సాగింది. మహిళలు మంగళహారతులతో, దారి పొడవునా నీళ్లు పోస్తు స్వాగతం పలికారు. భక్తిశ్రద్ధలతో శివస్వాములు ఖడ్గాలు చదువుతూ అలా గట్టుపై వెలిసిన మల్లికార్జున స్వామి ఆలయం వద్దకు పల్లకి సేవ చేరుకుంది. ఈసందర్భంగా మల్లికార్జున గిరులన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు శివనామస్మరణతో ఉపవాస దీక్షలు చేపట్టారు. శివస్వాములు హైదరాబాద్ నుంచి భారీ ఎత్తున పువ్వులు కొనుగోలు చేసి ఆలయంను సర్వాంగ సుందరంగా అలంకరించారు. శివదీక్షలు చేపట్టిన శివస్వాములు కుటుంబ సభ్యులతో శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గురుస్వాములు, శివస్వాములు, భజన మండలి సభ్యులు, యువకులు, మహిళలు, చిన్నారులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

- ఘనంగా మహా శివరాత్రి వేడుకలు
- భక్తులతో కిట కిటలాడిన దేవాలయాలు



**కోహెడ, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** శివరాత్రి పర్వదినమును పురస్కరించుకొని మండల కేంద్రంలోని పాత శివాలయం, రామాలయం లోని పార్వతి, పరమేశ్వర ఆలయంతో పాటు మండలంలోని గొట్లమిట్ట, కూరెల్ల, తంగళ్ళపల్లి, శనిగరం, బస్వాపూర్, వరికోల్, రామచంద్రపూర్, శ్రీ రాములపల్లి, సోమారపల్లి గ్రామాలలోని ఆలయాలలో శివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గొట్లమిట్ట గ్రామంలో కొలువై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కోహెడ మండల తాజా మాజీ ఎంపీపీ కొక్కుల కీర్తి -సురేష్ ప్రత్యేక మొక్కులు చెల్లించుకొన్నారు. ఈ కార్యక్రమాలలో మాజీ ఎంపీపీ తిప్పారపు శ్రీకాంత్ ,మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు జాగిరి కుమారస్వామి గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు పెరుగు నరేందర్ రెడ్డి దంపతులతో కలిసి పూజలు నిర్వహించారు. అలాగే నూతనంగా ఎన్నికయినా సర్పంచ్ లు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బస్వరాజు శంకర్, స్థానిక మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, పొలవేణి కుమారస్వామి, లోనే మల్లేశం, నాయకులు దేవాలయం చైర్మన్, దేవాలయ కమిటీ సభ్యులు, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏకలవ్య స్కూల్లో ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు



**వెల్దండ, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** స్థానిక వెల్దండ మండలం గుండాల గ్రామంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో ఆదివాసీ సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శకుడైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, పూజలు నిర్వహించి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్ కుమార్ అధ్యక్షత వహించి, సేవాలాల్ మహారాజ్ గారి జీవితం, బోధనలు, ఆదివాసీ సమాజ అభ్యున్నతికి చేసిన కృషి గురించి విద్యార్థులకు వివరించారు. ఆయన చూపిన నీతి, నిబద్ధత, సేవాభావం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోడం భాస్కర్ మాట్లాడుతూ సేవలాల్ గారినీ ఆదర్శంగా తీసుకుని, గిరిజన సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఇందులో ఉపాధ్యాయులు అవనీష్, ఆశిష్ యాదవ్, ధర్మేందర్, రాంప్రసాద్, సుధీర్ నాయక్, శంకర్ లాల్, నరేందర్, చంద్రబాబు, రవి ప్రసాద్, కవిత,అనూష, మల్లిక మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు సేవాలాల్ మహారాజ్ జీవిత విశేషాలపై ప్రసంగాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఏడుపాయల అభివృద్ధి

- భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలి
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మెదక్
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శివాణి దంపతులు



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడుపాయల అభివృద్ధి కోట్లది రూపాయలు మంజూరు చేయించి జాతరకు వచ్చే భక్తులకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. ఆదివారం మహా శివరాత్రి సందర్భంగా ఏడుపాయలకు చేరుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శివాణి దంపతులకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రోహిత్ రావ్ శివాణి దంపతులు వన దుర్గామాతకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు ఎమ్మెల్యే రోహిత్ రావ్ శివాణి దంపతులకు శాలువా కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడుపాయలను అభివృద్ధి చేసేందుకు గాను సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేశారని అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు జరుగుతున్న జాతరకు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున భక్తులకు అవసరమైన వసతులు కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు సేవలు అందించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ ఆలయ ఈఓ వీరేశం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డి పల్లి ఆంజనేయులు గౌడ్ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి జిల్లా నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంతప్ప మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోవింద్ నాయాక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు భరత్ గౌడ్ ఆలయ సిబ్బంది, ఆలయ పూజారులు, పాపన్నపేట కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

## వన దుర్గామాతను దర్శించుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు

- ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**మెదక్ జిల్లా బ్యూరో/పాపన్నపేట, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయాలలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు వనదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ మహా జాతరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ట్రాఫిక్, త్రాగునీరు, విద్యుత్, పరిశుభ్రత కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించాలన్నారు. భక్తులందరూ మూడు రోజులు పాటు జరిగే జాతరలో ప్రశాంతంగా దర్శనాలు , ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని పేర్కొన్నారు. అనంతరం ఉచిత మహిళా బస్సు ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ , చంద్రశేఖర్ ,ఆలయ కార్యనిర్వహణాధికారి వీరేశం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వన దుర్గామాతను దర్శించుకున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు దంపతులు



**మెదక్ జిల్లా బ్యూరో/పాపన్నపేట, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ మాత ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఎస్పీకి తీర్థప్రసాదాలు అందజేశారు. శివరాత్రి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు చేపట్టిన భద్రతా చర్యలపై ఎస్పీ అధికారులతో చర్చించారు. క్యూలైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లను సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు. భక్తులు శాంతియుతంగా దర్శనం చేసుకోవాలని కోరుతూ, జిల్లా ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి



**నిజాంపేట్, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** నిజాంపేట్ మండలంలోని వివిధ తండాలలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. తాండవాసులు శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహాలను పాలాభిషేకం చేయించి పూలమాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా తాండలలో బోర్ బండార్ కార్యక్రమం అన్నదాన కార్యక్రమాలు ఉత్సాహంగా జరిపారు. గిరిజనులు అందరూ కలిసి సేవాలాల్ మహారాజ్ అడుగుజాడలో ప్రతి ఒక్కరూ ఉండాలని మత్తు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని ఏకీభవించారు. స్త్రీలు నుత్యాలతో ఆటపాటలతో సేవాలాల్ మహారాజ్ కు ర్యాలీలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డ్ మెంబర్లు తండా నాయక్ కార్ భారీ తాండ పెద్దలు యువకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివపార్వతుల కళ్యాణం



**తెలకపల్లి, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో మరియు పరిసర గ్రామాలలో ఆదివారం మహా శివరాత్రి వేడుకలు భక్తులు ప్రజలు వైభవంగా నిర్వహించారు ఉదయం నుంచి శివాలయాలకు వెళ్లి అభిషేకాలు పూజలు నిర్వహించారు మండల కేంద్రంలోని శివాలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు అనంతరం శివునికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాముల ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల గుండా పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొమ్ము చంద్రశేఖర్, సింగిల్ విండో మాజీ వాయిస్ చైర్మన్ యాదయ్య, భక్తులు, ప్రజలు, శివ స్వాములు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శివనామస్మరణలతో మారుమోగిన సోమన్న ఆలయం

- పాలకుర్తిలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- సోమేశ్వరాలయానికి వీఐపీల తాకిడి







**పాలకుర్తి, ఫిబ్రవరి 15(జనంసాక్షి) :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని. హరి హర క్షేత్రమైన స్వయంభు, శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామిఆలయంలో మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో భాగంగా వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. హరి హర మహాదేవ,, శంభో శంకరా... అంటూ భక్తులు తమ ఇష్టదైవమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని తన్మయత్నం చెందారు. మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని నలుమూలల నుండి భక్తులు ఆలయానికి తరలివచ్చి గుట్ట సమీపాన స్నాన ఘట్టాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి. తడి బట్టలతోనే మెట్ల గుండా, ఘాట్ రోడ్డు మార్గం గుండా క్యూలైన్లో లో భక్తులు కాలినడకన వెళ్లి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు జాగరణ చేస్తుండడంతో అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. దేవస్థానం అధ్వర్యంలో వికలాంగులు, వృద్దులు దర్శనం చేసుకునేందుకు మూడు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. వివిధ కళాశాలల విద్యార్థులు ఆలయంలో వాలంటీర్లుగా విధులు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను ఆ శాఖ అధికారులు పర్యవేక్షించారు. జనగాం డీసీపీ రాజమహేంద్రనాయక్, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య నేతృత్వంలో సుమారు 150 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం నియమించారు. ఈ కార్యక్రమంలో జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, డీఆర్డీవో పీడీ వసంత, స్టేషన్ఘన్పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ సరస్వతీ, ఎంపీడీవో వేదవతి, సీఐ జానకిరామ్ రెడ్డి. ఎస్సై పవన్ కుమార్, ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

### ఆలయానికి వీఐపీల తాకిడి

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహోత్సవాల్లో భాగంగా, స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి. జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ దంపతులు వేరువేరుగా హాజరై స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో అదికారులు. పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి శేష వస్త్రాలను అందజేశారు.

జాతరకు వచ్చే భక్తులకు దాహార్తిని తీర్చేందుకు మల్లికార్జున ట్రేడర్స్ ప్రొప్రైటర్ మాచర్ల పుల్లయ్య, శ్రీనివాస క్లాత్ స్టోర్ అధినేత రాపాక వెంకటేష్ ఆధ్వర్యంలో సుమారు 6 వేల మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలు తమ స్వంత ఖర్చులు వెచ్చించి అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, భక్తులు తరలివచ్చి బోజనాలు చేశారు. గత రెండేళ్ల నుంచి వరుసగా బ్రహ్మోత్సవాల సమయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

# గంగిశెట్టి శ్రీనివాస్ సేవలు అభినందనీయం

- అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ



**ములుగు/వెంకటాపూర్, ఫిబ్రవరి15 (జనం సాక్షి):** మహాశివరాత్రిని పురస్కరించుకుని రామప్ప దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం గంగిశెట్టి సరస్వతి జ్ఞాపకార్థం వారి కుమారుడు గంగిశెట్టి శ్రీనివాస్ దాతగా ఉచిత శుద్ధి చేయబడిన తాగునీటి కేంద్రాన్ని ములుగు అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ ప్రారంభించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాలుగా రామప్పలో ఉచిత త్రాగునీరు అందించడం గొప్ప విషయమని మహేందర్ జీ అభినందించారు. కార్యక్రమంలో వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు, రామప్ప ఆలయ కమిటీ చైర్మన్ మిల్కూరి ఐలయ్య, ఈఓ శ్రీనివాస్,రామప్ప ఆలయ కమిటీ సభ్యులు,గొల్లపల్లి రాజేందర్ గౌడ్,పిట్టల మధు,కోటి ములుగు లయన్స్ క్లబ్ సభ్యులు డి.బలరాం రెడ్డి, ఎస్.రవీందర్ రెడ్డి, పి.నాగరాజు,సిహెచ్. రమేష్,ఏ.రాజు,ఎం రమేష్, ఎస్ రవీందర్, సోమనర్సయ్య, ఎన్.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ టైక్వాండో అండ్ బాక్సింగ్‌లో ఆదరగొట్టిన విద్యార్థులు

- ముఖ్యఅతిథిగా జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాష



**జనగామ ప్రతినిధి,ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** జనగామ జిల్లా కేంద్రం లో మినీ స్టేడియంలో జిల్లా డి.వై.ఎస్.ఓ కోదండరాం ఆధ్వర్యంలో సీఎం కప్ క్రీడలు నిర్వహించగా, జనగామ జిల్లా టైక్వాండో సెక్రటరీ ఎండి.అబ్బాస్ మాట్లాడుతూ జనగామ జిల్లాలో నిర్వహించిన సీఎం కప్పులో టైక్వాండో అండ్ బాక్సింగ్ విద్యార్థులు సుమారుగా వందమంది విద్యార్థులు పాల్గొని అందులో సెలెక్ట్ అయిన వారికి కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు. సెలెక్ట్ అయిన వారు ఈనెల ఫిబ్రవరి 18, 19న గచ్చిబౌలి స్టేట్ లో నిర్వహిస్తున్న టైక్వాండో కాంపిటీషన్లో పాల్గొనబోతున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమం లో కోచ్ లు సిహెచ్.అనూష, బానోతు రుద్ర, మెరుగు క్రాంతి కుమార్, సంఘ మణిదీప్, బానోతు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా మహా శివరాత్రి వేడుకలు

- శివరాత్రి వేడుకలలో పాల్గొన్న కూడా చైర్మన్ దంపతులు



**హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మరియు వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తన సతీమణి అవంతి రెడ్డి తో కలిసి హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లోని పలు శివాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేయిస్తంభాల గుడి హనుమకొండలోని చారిత్రాత్మక వేయిస్తంభాల గుడిలో జరిగిన శివరాత్రి వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మడికొండ లోని శ్రీ స్వయంభూ శ్రీ మెట్టురామలింగేశ్వర స్వామి గుడిలో జరిగిన శివరాత్రి వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సిద్దేశ్వరాలయం పద్మాక్షి కాలనీలోని సిద్దేశ్వరాలయంలో జరిగిన శివరాత్రి వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఇనగాల దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు

# భక్తులతో కిటకిటలాడిన రామప్ప దేవాలయం

- శివయ్యకు నిలువెత్తు అభిషేకాలు
- శివనామస్మరణతో మార్మోగిన రామప్ప దేవాలయం





**ములుగు/వెంకటాపూర్, ఫిబ్రవరి15 (జనంసాక్షి) :** మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని యునెస్కో గుర్తింపు పొందిన వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్పలో కొలువు దీరిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద అధికారులు భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా రామప్ప ఆలయం కు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పరమ శివునికి ఇష్టమైన రోజుగా చెప్పుకునే మహాశివరాత్రి రోజున ఇష్ట దైవాన్ని దర్శించుకునేందుకు తెల్లవారు జామునుంచే శివుని దర్శనం కోసం భక్తులు క్యూగట్టారు. రామప్ప దేవాలయం లో భక్తులతో కిటకిటలాడాయి. రామలింగేశ్వర స్వామికి భక్తులు అభిషేకాలు,మొక్కులు,కానుకలు సమర్పించారు. జాతరను పురస్కరించుకొని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా ప్రత్యేక పారిశుద్ధ కార్మికులను జిల్లా పంచాయతీ అధికారులు ఏర్పాటు చేయడం జరిగింది. నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ జాతర లో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పటు చేయడం జరిగింది. మూడు రోజులలో 24 గంటల పాటు వైద్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తారని వైద్యాధికారులు తెలిపారు. జాగారం చేసే భక్తుల కోసం రామప్ప పరిసర ప్రాంతాలలో ప్రత్యేక ఎల్ఈడి స్క్రీన్లను ఏర్పాటు చేయడం జరిగింది. సాయంకాలం ఐదు గంటల అనంతరం రామప్ప కట్ట పైకి ఎవర్ని అనుమతి లేదని పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తుల కోసం వాహనాల పార్కింగ్,మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు స్వచ్ఛమైన మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.



# కాళేశ్వరంలో భక్తుల రద్దీ

**కాళేశ్వరం , ఫిబ్రవరి 16 , ( జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం క్షేత్రానికి ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు సరిహద్దులోని మహారాష్ట్ర, ఛత్తీస్ ఘడ్ ప్రాంతాల నుండి వేకువజాము నుండే భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి తీరం వద్ద ఇసుకతో ఏర్పాటు చేసిన సైకత లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి తీర పరిసరాలు భక్తులతో భక్తజన సంద్రంగా మారింది. అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో సర్వ దర్శనానికి భక్తుల తాకిడి భారిగా పెరిగి క్యూలైన్లు బారులు తీరాయి.

# ఓంకారనాదం....శివనామ స్మరణం!



- గోదావరి నదిలో పుణ్య స్నానాలను ఆచరిస్తున్న భక్తులు..
- ఫలం, పత్రాలతో శివయ్యకు అభిషేకాలు...
- వైభవంగా శివ పార్వతుల కల్యాణం...
- అలరించిన సాంస్కృతిక నృత్యాలు...



**మంగపేట, ఫిబ్రవరి 15(జనంసాక్షి) :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని శైవక్షేత్రాలు భక్తజనుల ఓంకారనాదాలతో మార్మోగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆయా గ్రామాల్లో నుండి బయలుదేరి పవిత్ర గోదావరి నదిలో గోదావరి జలాలతో పుణ్య స్నానాలను ఆచరించి ఆలయాలను చేరుకుని శివలింగాలకు అభిషేకం చేశారు. మంగపేట మండల కేంద్రంలో గోదావరి తీర ప్రాంతంలో కొలువైన శ్రీ ఉమా చంద్రశేఖర స్వామి ఆలయం, మల్లూరు శంభు లింగేశ్వర స్వామి ఆలయం, రాజుపేట కొండ లింగేశ్వర స్వామి ఆలయాలలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయా ఆలయ కమిటీల నిర్వాహకులు ఆలయ ప్రాంగణాలను విద్యుత్ కాంతులు, పూల మాలలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలకు కలగకుండా అన్ని ఏర్పాటను పూర్తి చేశారు. మంగపేట మండల కేంద్రంలోని శ్రీ ఉమా చంద్రశేఖర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ కోలగట్ల నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్ల చేయగా ఆలయ ప్రాంగణంలో ధ్యానంలో ఉన్న శివుని భారీ ఎత్తుగల ప్రతిమను ఏర్పాటు చేయగా ఆలయ ప్రాంగణంలో ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక శోభ చోటుచేసుకుంది. ఆ పరమేశ్వరుని ప్రతిమను చూసిన భక్తులు దర్శించుకొని సెల్ఫీ ఫోటోలు దిగుతూ ఆ పరమశివుని పై ఉన్న భక్తుని చాటుకుంటూ శివుడి ప్రతిమ పక్కన సెల్ఫీ ఫోటోలను దిగుతూ తమ ఫోన్ లలో చిత్రాలను ల భద్రపరుచుకున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక నృత్యాలు భక్తులను అలరించాయి. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు విస్సజ్జుల నరేష్ అర్చకులు కంచిభట్ల మణికంఠ శర్మ, విస్సజ్జుల యూవన్ శర్మ ల ఆధ్వర్యంలో శివ పార్వతుల దివ్య కళ్యాణ మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని కన్నులారా తిలకించడం కొరకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంలో మండల కేంద్రం అంతా ఒక్కసారిగా ఆధ్యాత్మిక శోభతో అలాగే శివనామస్మరణతో మార్మోగిపోయింది.

# మున్సిపాలిటీ చైర్మన్‌గా బుర్ర కొమురయ్యకే అవకాశం..

- రెండు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్న నేత
- ముఖ్య నేతలతో ఉన్న సాన్నిహిత్యం కలిసొచ్చే అంశం
- వైస్ చైర్మన్ పుల్లూరి మంజులకు ఇచ్చే ఛాన్స్
- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేడే





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధమైంది. నేడు సోమవారం అధికారికంగా ఎన్నుకోనున్నారు. అయితే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా18 మంది కౌన్సిలర్లు గెలుపొందడంతో ఆ పార్టీకి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నుకునే అవకాశం దక్కింది. ఎన్నికల ఫలితాల రోజు కాంగ్రెస్ కూటమి అభ్యర్థులు గెలుపొందడంతో, గెలుపొందిన కౌన్సిలర్లను వెంటనే ఆ పార్టీ నేతలు రహస్య ప్రదేశానికి తరలించారు. ఎన్నిక నాటికి వారిని తీసుకువచ్చి చైర్మన్, వైస్ చైర్మన్ లను ఎన్నుకోనున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీపై మొదటిసారిగా పార్టీ జెండాను ఎగురవేస్తున్న కాంగ్రెస్ పార్టీ పగడ్బందీ వ్యూహంతో ముందుకు వెళు తుంది. 18 మందిలో సరైన కౌన్సిలర్ అభ్యర్థిని చైర్మన్ గా ఎన్నుకోనున్నారు. అయితే వైస్ చైర్మన్ గా మహిళలకు ఇచ్చే అవకాశం ఉంది. 30 వార్డుల్లో సుమారు సగం మంది మహిళలే ఉండడంతో వైస్ చైర్మన్ అవకాశం వారికే దక్కనుంది. పార్టీ ముఖ్య నేతలకు అనుకూలంగా ఉండే వారిపై దృష్టి సారించి, చైర్మన్ పీఠంపై కూర్చో బెడతారనేది స్థానికంగా ఎదురుచూస్తున్నారు. 16వ తేదీ సోమవారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ చేపట్టనున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ఎలాంటి పొరపాట్లు జరగకుండా పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకొని కార్యాచరణను అమలు చేస్తోంది.

### చైర్మన్‌గా కొమురయ్య అయ్యే అవకాశం..?

భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ గా బుర్ర కొమురయ్యకే అవకాశం ఉన్నట్లు భూపాలపల్లి లో చర్చలు వినవస్తున్నాయి. రెండు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్న నేత, పాలనాపరంగా అనుభవం ఉన్న నేత కావడం, ముఖ్య నేతలతో ఉన్న సాన్నిహిత్యం వెరసి బుర్ర కొమురయ్యకు కచ్చితంగా చైర్మన్ పదవి దక్కే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీలో కూడా ఆయనకే మద్దతు పలికే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్టీలో గత కొన్నేళ్లుగా ఎలాంటి పదవులు లేకుండా పార్టీ కోసం పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతున్న బుర్ర కొమురయ్య, ఈసారి 2వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందడం, చైర్మన్ పదవి బిసి జనరల్ కావడంతో ఆయనకే ఈ అవకాశం కలిసి వచ్చినట్లు అయింది. ఈ విషయం పై పార్టీలోని ముఖ్య నేతలు, ఎమ్మెల్యే చర్చించి బుర్ర కొమురయ్యకు చైర్మన్ గా అవకాశం ఇస్తారనే చర్చలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా కౌన్సిలర్లలో సగం మంది ఉన్న మహిళలను దృష్టిలో ఉంచుకొని వైస్ చైర్మన్ గా మహిళ కౌన్సిలర్ కు అవకాశం ఇచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగా 10వ వార్డు కౌన్సిలర్ పుల్లూరి మంజుల మాధవరావుకు వైస్ చైర్మన్ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ ఎన్నికల్లో వీరినే నియమిస్తారా, లేక మరేవరినైనా నియమిస్తారా కొంత సందిగ్ధం ఉన్నప్పటికీ, నేడు జరిగే ఎన్నికతో ఉత్కంఠకు తెరపడే అవకాశాలు ఉన్నాయి.

# జాతరలో పోలీసుల అత్యుత్సాహం

- రాజీవ్ చౌరస్తాలో బారీ కేడ్ల ఏర్పాటు
- ఇబ్బందులు పడ్డ భక్తులు



**పాలకుర్తి ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** జాతరలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు రెండు గంటల పాటు ఇబ్బందులు పడ్డారు. రాజీవ్ చౌరస్తాలో పోలీసులు బారీకేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు రాజీవ్ చౌరస్తా నుంచి గుడివాడ చౌరస్తా మీదుగా, దేవస్థానం ఆర్చిగేట్ నుంచి దేవాలయానికి వెళ్లాల్సి ఉంది. అందుకు పోలీసులు ఆటు వైపు వెళ్లకుండా బైపాస్ రోడ్డు నుంచి దేవాలయానికి వెళ్లాలని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీదుగా దేవస్థానం వెళ్లాలని వాహనాలను పోలీసులు భక్తులకు నచ్చ చెప్పి మళ్లించారు. దీంతో భక్తులు రెండు గంటల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బైపాస్ రోడ్డు వైపు భక్తుల వాహనాలను మళ్లించడంతో స్థానిక వ్యాపారులు వ్యాపారం నడవక ఇబ్బంది పడ్డారు. ధర్నా చేసేందుకు వ్యాపారులు రాజీవ్ చౌరస్తాకు పెద్దఎత్తున తరలి రాగా, చౌరస్తాలో బారీకేడ్లను, కట్టిన తాడును పోలీసులు తొలగించారు. దీంతో ఎలాంటి ధర్నా చేయకుండానే వ్యాపారులు తిరిగి వెళ్లిపోయారు. ఏది ఏమైన మహాశివరాత్రి రోజే పోలీసులు ఓవర్ యాక్షన్ వల్ల భక్తులు, ప్రజలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 ఫిబ్రవరి 2026

## నేడు పురపాలక కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారం..

- ఎక్స్ అఫీషియో సభ్యులుగా కుందూరు రఘువీర్ రెడ్డి




**నేరేడుచర్ల, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** ఈనెల 11 న జరిగిన మున్సిపల్ ఎన్నికలలో గెలుపొందిన నేరేడుచర్ల పురపాలక కౌన్సిలర్ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారని మున్సిపల్ కమిషనర్ నాగరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని ఆయన అన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా నల్గొండ పార్లమెంటు సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి తన పేరును నమోదు చేసుకున్నారు. ఆయన సోమవారం నేరేడుచర్ల మున్సిపాలిటీ కి జరుగనున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మంత్రి ఉత్తమ్ కుమారెడ్డి ఆదేశానుసారం అయన నేరేడుచర్లకు రానున్నారు.

## చండూరు మున్సిపల్ చౌరస్తాలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి

- కొలువుదీరనున్న నూతన పాలకవర్గానికి ప్రయాణికుల విజ్ఞప్తి

**చండూరు, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లాలోని ప్రముఖ వ్యాపార కేంద్రమైన చండూరు పట్టణ చౌరస్తాలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ కీలక కూడలిలో కనీస వసతులు లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చండూరు మండల కేంద్రంలోని చౌరస్తాలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు నీడ దొరకక అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి రోడ్డుపైనే వేచి ఉండాల్సి వస్తోందని, ముఖ్యంగా ఎండ తీవ్రత పెరిగినప్పుడు లేదా వర్షం కురిసినప్పుడు తలదాచుకోవడానికి చోటు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



### ప్రముఖ వ్యాపార కేంద్రంగా చండూరు

మునుగోడు నియోజకవర్గంలో చౌటుప్పల్ తర్వాత చండూరు అతిపెద్ద బిజినెస్ హబ్‌గా పేరు గాంచింది. ఇక్కడ ఇత్తడి, పుత్తడి (బంగారం) వ్యాపారాలు. వస్త్ర వ్యాపారం మరియు రియల్ ఎస్టేట్ రంగాలు గణనీయంగా విస్తరించాయి. ఈ ప్రాంతం నుండి నిత్యం అధికారులు, వ్యాపారులు, కార్మికులు మరియు వందలాది మంది విద్యార్థులు నల్గొండ, మాల్, చౌటుప్పల్, నాంపల్లి మండలాలకు ప్రయాణిస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న పట్టణంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లు నిర్మించకపోవడం శోచనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### కొలువుదీరనున్న నూతన పాలకవర్గానికి విన్నపం

చండూరు మున్సిపాలిటీ కొత్త పాలకవర్గం కొలువుదీరుతున్న తరుణంలో, బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చౌరస్తాలో ఆధునిక బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజలంతా సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** పరమశివుడి ఆశీస్సులతో జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెంది, ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతుడిని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రార్థించారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని జిల్లా ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ జిల్లా కలెక్టర్ తన సతీమణి మాధవి తో కలిసి ఖమ్మం రూరల్ మండలం తీర్థాల శ్రీ శ్రీ శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, స్వామివారి చల్లని దీవెనలు భక్తులందరిపై ఉండాలని, జిల్లాలో శాంతి, సమృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు



చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దర్శనానంతరం భక్తులతో ఆలయం వద్ద, కూడలి జాతర సందర్భంగా చేసిన ఏర్పాట్లు ఎలా వున్నాయని భక్తులను అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. దైవ దర్శనం కోసం క్యూలైన్ లో ఉన్న భక్తులకు కలెక్టర్ దంపతులు పండ్లను పంపిణీ చేశారు. స్వామి వారి దర్శనం వేగంగా జరిగే లాగ చర్యలు తీసుకోవాలని, త్రాగునీరు, వైద్యసేవలు, పరిసరాల పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, ఆలయంకు వచ్చే రహదారులలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, అర్చకులు జిల్లా కలెక్టర్ దంపతులను శాలువాతో సత్కరించి, స్వామి వారి శేషవస్త్రాములు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐ క్రాంతి కుమార్, గ్రామ సర్పంచి, ఆలయ కమిటి చైర్మన్, దేవాదాయ శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

## సేవాలాల్ జీవితం అందరికీ ఆదర్శం



**ఆమనగల్, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజు అందరికీ ఆదర్శప్రాయుడని ఐక్యత పౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ అన్నారు. ఆదివారం ఆమనగల్, వెల్దండ పట్టణంలో సంతు సేవాలాల్ 287,వ జయంతి సందర్భంగా గిరిజనులు ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాల్లో పాల్గొని సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ గిరిజనుల ఆరాధ్య దైవమని, సమానత్వం, సేవాభావం, ధర్మం వంటి గొప్ప విలువలను సమాజానికి అందించిన మహనీయుడని, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం నేటికీ ప్రేరణనిస్తోందని పేర్కొన్నారు. నేటియువత సేవాలాల్ మహారాజ్ బోధనలను ఆచరణలో పెట్టి సమాజ సేవలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతో పాటు, ఆయా మండలాల గిరిజన సంఘాల నాయకులు, సేవలాల్ మహారాజ్ జయంతి నిర్వహణ సభ్యులు, గిరిజన సోదర, సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పానగల్లు దేవాలయాన్ని యునెస్కో గుర్తించాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను అందజేసిన మంత్రి



**కనగల్లు, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలోని పానగల్లు పచ్చల, ఛాయా సోమేశ్వర ఆలయాన్ని ప్రపంచ స్థాయి వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించాలని రాష్ట్ర రోడ్లు, భవనముల సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పానగల్లులో పచ్చల ఛాయా సోమేశ్వర ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ సందర్భంగా మంత్రి వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పానగల్లు లోని సోమేశ్వర ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం తన తపన అని తెలిపారు. 11,12 శతాబ్దం కాలంలో చోళ రాజులు ఈ ఆలయాన్ని ఎంతో అద్భుతంగా నిర్మించారని, గర్భగుడిలోని శివలింగం మీద రోజంతా ఒక స్తంభం నీడ నిరంతరం పడటం గొప్ప విశేషం అన్నారు. యునెస్కో జాబితాలో పానగల్లు ఆలయం చేరడంతో దేవాలయం విశిష్టత ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పానగల్లు సమీపంలోని చందనపల్లి డంపింగ్ యార్డ్ ను మరో చోటికి మార్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మంత్రి వెంట స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నల్లగొండ ఆర్టిఓ అశోక్ రెడ్డి, పానగల్లు డివిజన్ నాయకులు పల్ రెడ్డి వెంకట్ రెడ్డి, గుండగోని యాదయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కొడ దలఎల్లయ్య, కోమటిరెడ్డి పృథ్వీ రెడ్డి, వంగాల అనిల్ రెడ్డి, కనగల్లు మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ ఆలయ అర్చకులు ఉన్నారు.

## కనకాద్రి గుట్టలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా..

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులు



**చంద్రుగొండ, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి కృషి చేస్తానని రెవెన్యూ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం చంద్రుగొండ మండలం బండలపాడు శివారు అటవీ ప్రాంతం కనకాద్రి గుట్టలపై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులు హాజరయ్యారు. ఆ ప్రాంతాన్ని కలిగి కాకతీయుల నాటి కట్టడాలను నాటి విశేషాలను తెలుసుకొని ఈ ప్రాంతం అభివృద్ధి చెంది పర్యాటక కేంద్రంగా మారితే రాష్ట్రంలోనే ప్రత్యేకత చెందిన ప్రాంతంగా గుర్తింపు పొందుతుందని ఆయన తెలిపారు. దీనికోసం తన వంతుగా కృషి చేస్తారని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి జరిగితే చంద్రుగొండ మండలం తో పాటు గిరిజన గ్రామీణ బెండలపాడు అభివృద్ధి చెంది ఆ ప్రాంతవాసులకు ఆదాయ వనరులకు అవకాశం దొరుకుతుందన్నారు. ఈ సందర్భంగా పొంగిలేటి శ్రీనివాస్ దంపతులు వీరభద్ర స్వామి ఆలయాన్ని సందర్శించి అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలను వేద పండితులు పూజారి వీఆర్కే మూర్తి, వేణు ల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వేంచేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు సహాయ సహకారాలు అందించారు. చంద్రుగొండ మండల వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్యాధికారులు తనుజ వెంకటప్రసాద్ లు పాల్గొని వైద్య శిబిరం నిర్వహించగా మండల అభివృద్ధి అధికారి బయ్యారపు అశోక్ ఆధ్వర్యంలో సెక్రటరీలు పంచాయతీ పాలకవర్గం పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతలిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి బొజ్యా నాయక్ దిశా కమిటీ సభ్యులు బొర్రా సురేష్ సర్పంచు బొర్రా లలిత కిరణ్ రెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో చైతన్య జ్యోతి

**ఖమ్మం, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా మహిళా, శిశు, వికలాంగులు మరియు వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో "బాల్య వివాహ రహిత భారత్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికల భవిష్యత్తును కాపాడటం, వారి విద్యను ప్రోత్సహించడం మరియు చట్టపరమైన అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం పాత బస్టాండ్ ప్రాంగణంలో, రఘునాథపాలెం కేజీబీవీ పాఠశాలలో అన్మార్ మీడియా బృందం ఆధ్వర్యంలో నుక్కడ్( వీధి నాటకాలు) ప్రదర్శించారు. బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, విద్యలో అంతరాయం, ఆర్థిక ఇబ్బందులు మరియు సామాజిక ప్రభావాలను నాటకం ద్వారా హృదయానికి హత్తుకునేలా చూపించారు. బాలిక చదువు కుటుంబానికే కాదు సమాజానికీ వెలుగునిస్తుందని సందేశం అందించారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతీ రాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల హక్కులకు విరుద్ధమని, సమాజ అభివృద్ధికి తీవ్రమైన అడ్డంకిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండి



వాటిని అరికట్టడంలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. డీఎంసీ-డీహెచ్ఈడబ్ల్యూ సమీన్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుందనే సమాచారం తెలిసిన వెంటనే 1098 చైల్డ్‌లైన్‌కు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం బాలల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది జెండర్ స్పెషలిస్ట్ పి.ప్రమీల, ఎస్ ఎఫ్ యల్ కె సతీష్, ఆర్టీసీ సిబ్బంది కేజీబీవీ పాఠశాలలో ప్రత్యేక అధికారి (ఎస్ఓ), ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరుకు రోడ్ల సమస్యకు ఎట్టకేలకు మోక్షం

- సర్పంచ్ వీరమళ్ళ శిరీష లోకేష్ గౌడ్ వినూత్న ఆలోచనతో సమస్య పరిష్కారం



**మర్రిగూడ, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో, గత కొంతకాలంగా వాహనదారులను ఇబ్బంది పెడుతున్న, ఇరుకు రోడ్ల సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మర్రిగూడ నుండి నాంపల్లి మండలానికి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోక, ప్రయాణికులు పడుతున్న అవస్థలపై స్థానిక సర్పంచ్ వీరమళ్ళ శిరీష లోకేష్ గౌడ్ సత్వరమే స్పందించి, తనదైన శైలిలో పరిష్కారాన్ని చూపారు. మర్రిగూడ – నాంపల్లి రోడ్డు మార్గం ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే ట్రాఫిక్ నిలిచిపోయేది. ఆర్టీసీ బస్సులు, లారీలు, పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనదారులు, కనీసం పక్కకు తప్పుకోవడానికి కూడా స్థలం ఎక్కువగా ఉండేది కాదు. ఈ సమస్యను తెలుసుకున్న సర్పంచ్ ప్రీకాస్ట్ బిల్లలతో, రోడ్డు విస్తరణకు పూనుకున్నారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన సర్పంచ్ శిరీష లోకేష్ గౌడ్, నిధుల కోసం వేచి చూడకుండ, అందుబాటులో ఉన్న వనరులతో వినూత్నంగా ఆలోచించారు. రోడ్డు పక్కన ఉన్న మోరిని మూసివేసి, దానిని కూడా రోడ్డులో భాగంగా మార్చే ప్రణాళికను అమలు చేశారు. డ్రైనేజీపై పటిష్టమైన ప్రీకాస్ట్ కాంక్రీట్ బిళ్ళలను తయారు చేయించి అమర్చారు. స్లాబ్స్ అమర్చి సైడ్లలో సిమెంట్ కాంక్రీట్‌తో పటిష్టపరిచారు. దీనివల్ల రోడ్డు వెడల్పు పెరిగి వాహనదారులకు, పాదాచారులకు ఉపశమనం కలిగింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను, సాదాసీదా మరమ్మతులతో కాకుండా, రోడ్డు విస్తీర్ణాన్ని పెంచేలా పరిష్కారం చూపడం పట్ల, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల చుట్టూ తిరగకుండా, పంచాయతీ యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపించి, ఈ పని పూర్తి చేసిన సర్పంచ్ వీరమళ్ళ శిరీష లోకేష్ గౌడ్ కు, వాహనదారులు మరియు స్థానికులు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికకు సర్వం సిద్ధం

### మున్సిపల్ కమిషనర్ మల్లేశం కీలక ప్రకటన



**చండూరు, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లాలోని చండూరు మున్సిపాలిటీలో రాజకీయ సందడి నెలకొంది. ఖాళీగా ఉన్న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల భర్తీకి సంబంధించి ఎన్నికల ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మల్లేశం కీలక ప్రకటన విడుదల చేశారు.

### ఎన్నికల సరళి ఇలా..

నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని ప్రత్యేకంగా నియమించిన ఎన్నికల అధికారి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. సభ్యుల ప్రమాణ స్వీకారం (అవసరమైతే), అనంతరం ఛైర్మన్ మరియు వైస్ ఛైర్మన్ అభ్యర్థుల ఎంపికపై ఓటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్ కమిషనర్ ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. శాంతి భద్రతల దృష్ట్యా మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. నిబంధనల ప్రకారం ఎన్నిక పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. మల్లేశం, మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ కార్యాలయం వద్ద 144 సెక్షన్ అమలులో ఉండే అవకాశం ఉంది. కేవలం అనుమతి ఉన్న ప్రజాప్రతినిధులను, అధికారులను మాత్రమే కార్యాలయం లోపలికి అనుమతిస్తారు. రాజకీయ పార్టీలు తమ కౌన్సిలర్లకు ఇప్పటికే విప్ జారీ చేసినట్లు సమాచారం. ఈ ఎన్నిక ముగిసిన వెంటనే ఫలితాలను అధికారికంగా వెల్లడించి, కొత్తగా ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

## మధిర శివాలయంలో ఉత్సవాలు ప్రారంభం

- రాత్రి 12 గంటలకు శివపార్వతుల కళ్యాణం
- పూజలు నిర్వహించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నందిని దంపతులు
- భారీగా హాజరైన భక్తులు

**మధిర, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** మహాశివరాత్రి సందర్భంగా మధిర పట్టణంలోని వైరా నది ఒడ్డున వేంచేసి ఉన్న శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయాన్ని అధికారులు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. కాశి పవిత్రత కలిగిన మధిర శివాలయంలో మహా శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 15 వ తేదీ నుండి 5 రోజుల పాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఫిబ్రవరి 15 న ప్రత్యేక పూజలతో జాతర ప్రారంభించారు. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 15 వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు జరిగే స్వామివారి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి భారీ స్థాయిలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలను అందుకుంటారు. ఫిబ్రవరి 16 సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, 17 న పూర్ణాహుతి కార్యక్రమం కలదు. అదేవిధంగా ప్రతిరోజు అభిషేకాలు కుంకమ పూజ కార్యక్రమాలు కలవు. శివరాత్రి జాగరణ చేసేందుకు వచ్చిన భక్తులు వైరా నదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన జాతరలో పిల్లలకు పెద్దలకు వినోదాన్ని కల్పించేందుకు జెయింట్ వీల్, డోరాతో బ్రేక్ డాన్స్, హంస, రైలుతో పాటు భక్తులకు వినోదాన్ని కలిగించే సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజికల్ నైట్ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మల్లు నందిని దంపతులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసామని ఈవో జగన్మోహన్ రావు మహాశివరాత్రి సందర్భంగా మధిర శివాలయంకు వచ్చే భక్తుల కోసం సకల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి జగన్మోహన్ రావు తెలిపారు. భక్తులకు



తొక్కిసలాట జరగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ప్రత్యేకంగా స్నాన ఘట్టాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. భక్తులకు త్రాగునీటి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు.




## వేతన పెంపులు.. తగ్గేదేలే

### లేబర్ కోడ్‌ల అమలు.. ఐటీ ఇంక్రిమెంట్లపై కాస్త ప్రభావం

**న్యూఢిల్లీ:**కొత్త లేబర్ కోడ్‌లను అమలు చేయడం వల్ల అధిక వేతన బిల్లులు చెల్లించాల్సి వస్తున్నప్పటికీ.. చాలా వరకు కంపెనీలు వేతన పెంపులను తగ్గించే ప్రయత్నం చేయకపోవచ్చని హెచ్‌ఆర్ అధిపతులు, వేతన నిపుణులు అంటున్నారు. అయితే కొన్ని రంగాల్లో ముఖ్యంగా ఐటీలో ఇంక్రిమెంట్లపై కాస్త ప్రభావం పడొచ్చని భావిస్తున్నారు. అమలుతో తగ్గిన లాభాలు నవంబరు 2025 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త కార్మిక స్మృతులతో ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఓవర్‌టైం, బోనస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి ప్రయోజనాలు పెరిగాయి. దీంతో కంపెనీల వ్యయాలపైనా ఒత్తిడి పడింది. చాలా వరకు సంస్థలు ముఖ్యంగా భారీ సిబ్బంది ఉన్న ఐటీ కంపెనీలు వన్ టైం కేటాయింపులు, అమలు సంబంధిత వ్యయాల వల్ల గత త్రైమాసికంలో తక్కువ లాభాలను నమోదు చేసిన సంగతి తెలిసిందే. 'వేతన వృద్ధి అనేది నిబంధనల వ్యయాల కంటే కూడా కార్మికుల గిరాకీ, నైపుణ్యాలు, ఉత్పాదకతపై ఎక్కువగా ఆధారపడతాయి. అందు వల్ల వేతనాలు తగ్గిస్తే అధిక వలసలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అది మరింత వ్యయాలకు దారి తీస్తుంద'ని విశ్లేషకులు అంటున్నారు. లేబర్ కోడ్ అమలు భారాల నిర్వహణకు కంపెనీలు వేర్వేరు విధానాలను అనుసరిస్తున్నాయి. కొన్ని కంపెనీలేమో ఈ వ్యయాలకు విడిగా బడ్జెట్‌ను కేటాయించగా.. మరికొన్ని మొత్తం వేతన పూల్ నుంచే ఖర్చుచేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ముందుగానే ఈ వ్యయాలను ఊహించి, బఫర్ ఉంచుకున్నాయి. మొత్తం మీద 2026లో వేతన ఇంక్రిమెంట్లు 9 శాతం వరకు ఉండొచ్చని అంచనా.అత్యంత మెరుగైన పనితీరును ప్రదర్శించే, కీలక హోదాల్లో ఉన్న వారికి కంపెనీలు ఏ లోటూ చేయడం లేదు. స్పెషలైజ్డ్ స్కిల్స్ ఉన్న వారికి గిరాకీ ఎక్కువగా ఉండడం ఇందుకు నేపథ్యం. అయితే మార్జిన్‌ల విషయంలో ఇబ్బంది పడే ఐటీ సంస్థలు, కొన్ని ఎన్‌బీఎఫ్‌సీ(బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ)లలో మాత్రం ఇంక్రిమెంట్లు కాస్త తక్కువగా ఉండొచ్చని అంచనా. అలాగే ఆదాయంలో ఉద్యోగుల వ్యయాల వాటా అధికంగా ఉండే కంపెనీలు కూడా వేతన పెంపు విషయంలో ఆచితూచి అడుగులు వేయొచ్చు. అటువంటి సంస్థలకు 8-9% పెంపు చేయడం సవాలుగా మారొచ్చు. లేబర్‌కోడ్‌ల ప్రభావం పడింది కదా అని కంపెనీలు వేతన పెంపులను ఆపలేవు.




# ముందుంది మంచికాలం

- వచ్చే 12-18 నెలలు మార్కెట్‌కు మంచి రోజులు
- మిడ్, స్మాల్ క్యాప్‌లలో 20% వరకు ర్యాలీ ఉండొచ్చు
- సెన్సెక్స్ లక్ష పాయింట్ల స్థాయికి చేరే అవకాశాలు



హైదరాబాద్: గత ఏడాదిన్నరగా ఒడుదొడుకులకు లోనవుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు, ఇకపై కోలుకునే అవకాశముందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ఎండీ, సీఈఓ ధీరజ్ రెల్లి విశ్లేషించారు. అంతర్జాతీయ పరిస్థితులు కుదుటపడటం, కంపెనీల షేర్ల ధరలు సహేతుకంగా ఉండటంతో రానున్న 12-18 నెలల కాలం మార్కెట్లకు ఎంతో ఆశాజనకంగా ఉంటుందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో డెరివేటివ్స్‌పై పన్ను పెంపు ప్రభావం, కొత్తతరం మదుపరుల ధోరణి, ఐటీ షేర్లపై ఏఐ ప్రభావం, భవిష్యత్తులో రాణించే రంగాలపై ఆయన మాట్లాడారు. ఆ వివరాలు.. గత 18 నెలల్లో భారతీయ మార్కెట్లు, ప్రపంచ మార్కెట్లతో పోలిస్తే కాస్త వెనుకబడ్డాయి. ఇందుకు ప్రధాన కారణం విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐలు) నిధులు వెనక్కి తీసుకోవడం, ఏఐ ఆధారిత పెట్టుబడి అవకాశాలు మన దగ్గర తక్కువగా ఉండటం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు. ఇప్పుడు చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి. షేర్ల వాల్యుయేషన్లు (22 పీఈ నిష్పత్తి వద్ద) దీర్ఘకాలిక సగటుతో పోలిస్తే సహేతుకంగా ఉన్నాయి. కరెన్సీ విలువలోనూ పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. అందుకే ఎఫ్‌పీఐలు మళ్లీ భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కాబట్టి, రానున్న 12-18 నెలలు మార్కెట్లకు మంచి రోజులు అనిపిస్తోంది.వచ్చే ఏడాది కంపెనీల ఆదాయ వృద్ధి 14-15% ఉండొచ్చు. కీలక సూచీలు (నిఫ్టీ, సెన్సెక్స్) 12-15%, మిడ్, స్మాల్ క్యాప్‌లలో 18-20% వృద్ధిని ఆశించొచ్చు. ఈ లెక్కన సెన్సెక్స్ లక్ష మార్కునూ, నిఫ్టీ 29,000-30,000 స్థాయిని చేరొచ్చు. అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కచ్చితంగా మేలే చేస్తుంది. యువ మదుపరులు, ముఖ్యంగా 'జెన్-జీ'లు ధరల విషయంలో చాలా స్పష్టంగా ఉంటున్నారు. తక్కువ రుసుముతో, అత్యుత్తమ సాంకేతికత కలిగిన ప్లాట్‌ఫామ్‌లను ఆశ్రయిస్తున్నారు. డిస్కౌంట్ బ్రోకర్ల వైపు మొగ్గు చూపిస్తున్నారు. అందుకే హెచ్‌డీఎఫ్‌సీ నుంచి స్కైని ప్రారంభించాం. ఇందులో ఈక్విటీ, డెరివేటివ్స్, ఈటీఎఫ్‌లు, కమొడిటీలు, అంతర్జాతీయ పెట్టుబడులు వంటి సేవలు లభిస్తాయి. ప్రస్తుతం రీసెర్చ్ విశ్లేషణలో, ఎక్కువ కంపెనీలను ట్రాక్ చేయడంలో మాలాంటి సంస్థలకు ఏఐ ఎంతో సాయం చేస్తోంది. భవిష్యత్తులో ఏ షేరును ఎంచుకోవాలి? పోర్ట్‌ఫోలియోను ఎలా నిర్మించుకోవాలి, ఏ మ్యూచువల్ ఫండ్ పథకం బాగుంటుంది వంటి విషయాల్లో ఏఐ సూచనలు కీలకం కానున్నాయి. కొవిడ్ అనంతరం ఈక్విటీని ఒక ప్రధాన ఆస్తిగా మదుపరులు గుర్తించారు. స్వల్పకాలంలో మార్కెట్లు పడినా, దీర్ఘకాలంలో రెండంకెల రాబడి వస్తుందని యువ మదుపరులు అర్థం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈక్విటీ విస్తరణ 3% నుంచి 15 శాతానికి పెరిగింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 40-60% ఉంది కాబట్టి ఇక్కడ వృద్ధికి అస్కారం ఉంది. పసిడి, వెండి ఈటీఎఫ్‌ల్లోనూ పెట్టుబడులు పెడుతున్నారు. సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ)ను పెంచడం వల్ల స్పెక్యులేటర్లు తగ్గి, దీర్ఘకాలిక మదుపరులు పెరుగుతారు. కాకపోతే ఎక్స్ఛేంజీల ఆదాయం-లావాదేవీల పరిమాణంపై ప్రభావం ఉండొచ్చు. బ్రోకింగ్ సంస్థలు ఇకపై మ్యూచువల్ ఫండ్లు, క్యాష్ మార్కెట్, మార్జిన్ ట్రేడింగ్(ఎంటీఎఫ్)లపై దృష్టి సారిస్తాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు బలంగా ఉన్నాయి. ప్రజల తలసరి ఆదాయం 3,000 డాలర్ల (సుమారు రూ.2.7 లక్షలు) నుంచి 6,000 డాలర్ల (దాదాపు రూ.5.4 లక్షలు)కు పెరిగే క్రమంలో ద్విచక్రవాహనాలు, ఎలక్ట్రానిక్స్, ట్రావెల్స్, వాహన రంగాలు బాగుంటాయి. జీవిత బీమా కంపెనీలకు జీఎస్‌టీ సమస్యలున్నా, జనరల్, ఆరోగ్య బీమా కంపెనీలు మంచి వృద్ధిని సాధించొచ్చు. రక్షణ రంగం ఆకర్షణీయమే అయినా, షేర్ల ధరలు కాస్త అధికంగా కనిపిస్తున్నాయి. ఐటీ, ఫార్మా రంగాలను ఆచితూచి ఎంచుకోవాలి. సీడీఎంఓ విభాగంలోని కంపెనీలు ఆసక్తికరంగా కనిపిస్తున్నాయి. అన్ని తొలి పబ్లిక్ ఆఫర్లూ (ఐపీఓ) లాభదాయకం కాకపోవచ్చు. ఎస్ఎంఈ ఐపీఓల విషయంలో సరైన అవగాహన లేకుండా పెట్టుబడి పెట్టొద్దు. కొత్తతరం సాంకేతికత సంస్థలు, బహుళజాతి సంస్థలు మార్కెట్లో నమోదు కావడం మంచి పరిణామం. ఇలాంటి వాటిలో మదుపు చేస్తే దీర్ఘకాలంలో ఫలితాలు బాగుంటాయి.

## జియో, ఆంథ్రోపిక్ వంటి 15 కంపెనీలతో కూటమి ఏర్పాటు

**న్యూఢిల్లీ:**జియో ప్లాట్‌ఫామ్స్, ఆంథ్రోపిక్, ఎరిక్‌సన్‌తో పాటు సెమీ కండక్టర్లకు క్లౌడ్ మౌలిక సదుపాయాలు, అనుసంధానత అందించే రంగంలో సారూప్యత కలిగిన అంతర్జాతీయ సంస్థలు విశ్వసనీయ సాంకేతిక కూటమి (టీటీఏ)ని ఏర్పాటు చేయడానికి చేతులు కలిపాయి. మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో ఆఫ్రికా, ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికాల నుంచి 15 కంపెనీలు సరిహద్దులను దాటి పని చేయడానికి కలిసి రావడంతో ఈ కూటమి ప్రారంభమైంది. అనుసంధానత, క్లౌడ్ మౌలిక సదుపాయాలు, సెమీ కండక్టర్ల నుంచి సాఫ్ట్‌వేర్, ఏఐ వరకు విశ్వసనీయ సాంకేతిక పరిజ్ఞానం కోసం ఉమ్మడి సూత్రాల ఆధారంగా ఇది జరిగింది. సరఫరాదారు జాతీయతతో సంబంధం లేకుండా, ఈ కూటమిలోని కంపెనీలు పారదర్శకత, భద్రత, డేటా రక్షణ వంటి వాటికి కట్టుబడి ఉంటాయని నిర్ధారించడానికి ఈ సూత్రాలు రూపొందించారు. ఇవి నమ్మకాన్ని పెంచడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు సాంకేతికత ప్రయోజనాలను అందిస్తాయి.అపూర్వమైన సాంకేతిక మార్పు, పెరుగుతున్న సంక్లిష్ట వాతావరణానికి అనుగుణంగా దేశాలు, వినియోగదార్లు, టెక్నాలజీ ప్రొవైడర్లు వారు అందించే సేవల్లో విశ్వసనీయత, స్థితిస్థాపకతను కోరుకుంటున్నారు. ఇదే సమయంలో డిజిటల్ సాంకేతికతలు, వ్యక్తులు, సమాజాలపై వాటి ప్రతికూల ప్రభావం గురించి సందేహాలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ సమస్యలను పరిష్కరించడానికి ఆయా కంపెనీలు కలిసి ముందుకు రావడం చాలా ముఖ్యం. టీటీఏ సభ్యులు ప్రభుత్వాలు, వినియోగదార్లతో కలిసి పని చేసి నమ్మకమైన వర్ధమాన సాంకేతికతల ప్రయోజనాలను ప్రజలఆర్థిక వృద్ధికి తోడ్పడాల్సి ఉంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,44,600 (22 క్యారెట్లు) | ₹ 1,57,750 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,80,000

## ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ రావట్లేదు

**న్యూఢిల్లీ:**ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిన ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్, తన భారత పర్యటనను రద్దు చేసుకున్నారని ఒక ఉన్నతాధికారి వెల్లడించారు. కొన్ని అనివార్య పరిస్థితుల కారణంగానే ఆయన తన సందర్శనను రద్దు చేసుకున్నారని, అయితే వారి ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపుతున్నారని తెలిపారు. వేగవంతమైన ప్రాసెసింగ్ జీపీయూ సర్వర్ల కారణంగా ఏఐ వ్యవస్థలో ఆధిపత్యం కొనసాగిస్తున్న కంపెనీల్లో ఎన్‌విడియా ఒకటిగా ఉంది. దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 16-20 తేదీల్లో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ జరగనుంది. మన దేశంలోని అసాధారణ ఏఐ పరిశోధకులు, అంకురాలు, డెవలపర్లు, ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్న భాగస్వాములు పాల్గొంటున్న సమ్మిట్‌లో ఎన్‌విడియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జయ్ పురి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పాల్గొననుంది.

# భారతీయ అంకురాల ముందడుగు

- అంతరిక్షంలో డేటా సెంటర్లు
- ఉపగ్రహాల సమాచార మార్పిడి
- కక్ష్యలో కీలకంగా మారుతున్న ఏఐ
- 10 లక్షల వ్యర్థ శకలాలు..



**న్యూఢిల్లీ:**భూమిపై చిన్న చెత్త ముక్క పడి ఉందనుకోండి. పెద్ద ప్రమాదమేమీ లేదు. కానీ, అంతరిక్షంలో పరిస్థితి వేరు. అక్కడ చిన్న శకలం వేగంగా దూసుకొచ్చి ఢీకొడితే పెను ప్రమాదమే సంభవిస్తుంది. రూ.వేల కోట్ల విలువైన ఉపగ్రహాలు, అంతరిక్ష యాత్రలు క్షణాల్లో బూడిదయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. అంతరిక్ష రంగాన్ని రక్షించుకునేందుకు ఇప్పుడు కృత్రిమ మేధ (ఏఐ) కీలకంగా మారుతోంది. ఫిబ్రవరి 16-20 వరకూ దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో భాగంగా కీలకమైన అంతరిక్ష రంగంపైనా చర్చ జరగనుంది. ప్రస్తుతం భూకక్ష్యలో సెంటీమీటరు, అంతకంటే పెద్ద పరిమాణంలో ఉన్న పది లక్షలకు పైగా వ్యర్థ శకలాలు (స్పేస్ డెబ్రిస్) తిరుగుతున్నాయి. వీటిని నిశితంగా గమనించకపోతే భారీ వ్యయంతో కూడిన అంతరిక్ష ప్రయోగాలు ప్రమాదంలో పడే అవకాశముంది. ఈ క్రమంలో భారతీయ స్పేస్ ఇంజినీర్లు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు ఏఐ సాయంతో ఈ వ్యర్థాల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.'50 కిలోల బరువున్న చిన్న ఉపగ్రహానికి ఏడాదిలో కనీసం 15 సార్లు ప్రమాద హెచ్చరికలు వస్తుంటాయి. అంతరిక్షంలో చురుగ్గా ఉన్న ఉపగ్రహాలు, పనిచేయనివి, విడిపోయిన శకలాలు, ఆఖరికి గ్రహశకలాలనూ ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం చాలా ముఖ్యం' అని దిగంతర ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ అనిరుధ్ శర్మ తెలిపారు. సాధారణంగా ఉపగ్రహాలు, వ్యర్థాల గమనాన్ని అంచనా వేసేందుకు ఇప్పటివరకూ గణాంక నమూనాలను వాడుతున్నారు. వారం రోజుల తర్వాత ఒక వస్తువు ఎక్కడ ఉంటుందో కచ్చితంగా అంచనా వేసేందుకు, కక్ష్యలో మార్పులను గుర్తించేందుకు తాము ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసినట్లు అనిరుధ్ వివరించారు. 'కక్ష్యలో రద్దీ పెరుగుతున్న వేళ, ఏఐ అనేది కేవలం ఒక అవసరం మాత్రమే కాదని, ఇది భద్రతకు అత్యవసరమని' ఇండియన్ స్పేస్ అసోసియే షన్ డైరెక్టర్ జనరల్ ఏకే భట్ స్పష్టం చేశారు.బెంగళూరుకు చెందిన స్టార్టప్ 'పిక్సెల్ స్పేస్'.. ఉపగ్రహ చిత్రాల విశ్లేషణలో ఏఐని విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొంది. సంస్థ సీఈఓ అవైస్ అహ్మద్ మాట్లాడుతూ.. 'ఉపగ్రహాల నుంచి వచ్చే పెటాబైట్ల కొద్దీ డేటాను వ్యక్తులు విశ్లేషించడం అసాధ్యం. అందుకే, మేం ఏఐని వాడుతున్నామ'న్నారు. సరిహద్దు భద్రత, వ్యవసాయం, పంట దిగుబడి, ఇంధన లీకేజీలు, కాలుష్యం వంటి అంశాలపై మా ఏఐ మోడల్స్ కచ్చితమైన సమాచారాన్ని ఇస్తాయని తెలిపారు.భవిష్యత్తులో ఉపగ్రహాలు తమకు తామే ప్రమాదాలను పసిగట్టి, ఢీకొనకుండా తప్పించుకునే 'అటానమస్ శాటిలైట్ ఆపరేషన్స్'పై దిగంతర దృష్టి సారించింది. వచ్చే అయిదేళ్లలో ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తుందని అనిరుధ్ శర్మ వెల్లడించారు. ఉపగ్రహాలు ఒకదానితో ఒకటి సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటూ, ప్రమాదాల నుంచి బయటపడతాయని వివరించారు.సుహోరా టెక్నాలజీస్ వంటి సంస్థలు మేఘాల అడ్డంకులు తొలగించి, స్పష్టమైన చిత్రాలను అందించేందుకు ఏఐ అల్గారిథమ్‌లను వాడుతున్నాయి. కేవలం జరిగిన విషయాన్ని చెప్పడమే కాకుండా, భవిష్యత్తులో ఏం జరగబోతోందో అంచనా వేసే 'ప్రిడిక్టివ్ మోడల్స్'ను తాము అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ సీటీఓ రూపేష్ కుమార్ తెలిపారు. రూ.150 కోట్ల పెట్టుబడితో 'జీఐఎస్ అండ్ ఏఐ కాంపిటెన్సీ సెంటర్'ను ఏర్పాటు చేసినట్లు ఎస్రీ ఇండియా ఎండీ అగేంద్ర కుమార్ తెలిపారు. ఇక్కడ డేటా సైంటిస్టులు, ఏఐ నిపుణులు కలిసి సంక్లిష్టమైన సమాచారాన్ని విశ్లేషిస్తారని పేర్కొన్నారు.'అంతరిక్షాన్ని సురక్షితంగా, సుస్థిరంగా మార్చాలంటే సమస్యను కేవలం పర్యవేక్షిస్తే సరిపోదు. దాన్ని మూలాల నుంచే పరిష్కరించాల్సిన సమయం ఆసన్నమైంది. అంతరిక్షంలో ఒక వస్తువును గుర్తించి, దాని వద్దకు అత్యంత సమర్థమైన మార్గంలో చేరుకోవడానికి మేం ఏఐని విస్తృతంగా వినియోగిస్తున్నాం' అని అంటున్నారు ఇస్రో మాజీ శాస్త్రవేత్త, కాస్మోసర్వ్ స్పేస్ వ్యవస్థాపకుడు, సీఈఓ చిరంజీవి ఫణీంద్ర. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఈ సంస్థ అంతరిక్ష వ్యర్థాలను నేరుగా తొలగించే పరిష్కారాలను రూపొందిస్తోంది. కంప్యూటర్ సిములేషన్ల ద్వారా రూపొందించిన సింథటిక్ చిత్రాలు, ల్యాబ్‌లలో సేకరించిన వాస్తవ డేటాతో ఏఐ మోడళ్లకు శిక్షణ ఇస్తున్నట్లు చిరంజీవి వెల్లడించారు. అంతరిక్షంలో వెలుతురు ఎప్పుడు ఎలా ఉంటుందో ఊహించలేం.. ఇలాంటి పరిస్థితుల్లోనూ వ్యర్థాల స్థానాన్ని, వాటి దశను కచ్చితత్వంతో గుర్తించడంలో మా ఏఐ సాంకేతికత పనిచేస్తుందని వివరించారు.



## సైన్యానికి బదులు పొట్టను పెంచుతున్నారు

### హంగరీ పీఎంపై జెలెన్‌స్కీ విమర్శలు

కీవ్:రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు సన్నిహితుడైన హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్‌పై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర విమర్శలు చేశారు. రష్యాతో యుద్ధంలో కీవ్‌కు మద్దతు ఇవ్వడానికి హంగరీ వెనుకడుగు వేస్తుండడంపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. విక్టర్ ఓర్బన్ ప్రాంతీయ భద్రత కంటే దేశీయ రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సొంత ప్రయోజనాల కోసం ఐరోపా దేశాల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన దేశంలో సైన్యాన్ని పెంచకుండా.. పొట్టను పెంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు రష్యాతో కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ ఉత్పత్తుల తయారీని వేగవంతం చేయాలని ఐరోపా దేశాలను కోరారు. యుద్ధ విరమణ అమలు కోసం మాస్కోపై ఒత్తిడి పెంచాలని.. లేదంటే రష్యా మరిన్ని దాడులకు పాల్పడే అవకాశం ఉందన్నారు. రష్యాతో యుద్ధాన్ని ఆపడానికి ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తుండగా.. హంగరీ మాత్రం రష్యాకు సహాయం చేస్తూ వస్తోంది. ఆ దేశంపై యూరప్ దేశాలు విధించే ఆంక్షలను పలుమార్లు అడ్డుకోవడానికి ప్రయత్నించింది. యుద్ధం సమయంలో కీవ్‌కు అదనపు నిధులు, ఆయుధాలు నేరుగా సరఫరా చేయాలని ఈయూ దేశాలు ఇచ్చిన పిలుపును ప్రతిఘటించింది. అంతే కాకుండా పుతిన్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా జెలెన్‌స్కీ వ్యాఖ్యలు చేశారు.దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా ఉక్రెయిన్, రష్యా ప్రతినిధులు ఇప్పటికే పలుమార్లు సమావేశమయ్యారు. అబుదాబి వేదికగా ఇటీవల నిర్వహించిన రెండో విడత భేటీలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ తదితరులు పాల్గొన్నారు. అయితే, ఇరుపక్షాలూ పరస్పరం ప్రత్యేకమైన డిమాండ్లను వీడకపోవడంతో ఎటువంటి పురోగతి లభించలేదు. డాన్‌బాస్ నుంచి వైదొలగాలని కీవ్‌పై మాస్కో ఒత్తిడి తెస్తోంది. ఈ షరతును ఎప్పటికీ అంగీకరించబోమని ఉక్రెయిన్ స్పష్టం చేస్తోంది.

## ఐడీ చూపించండి..

### జర్మనీలో మునీర్‌కు ఇబ్బందికర పరిస్థితి!

**మ్యూనిచ్ :**పాకిస్థాన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ ఆసిమ్ మునీర్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి విదేశాలకు వెళ్లిన ఆయనకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. అక్కడి భద్రతా సిబ్బంది ఆయనను ఆపి.. ఐడీ కార్డు చూపించాలని కోరారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

మ్యూనిచ్ భద్రతా సమావేశంలో పాల్గొనేందుకు మునీర్ తన బృందంతో కలిసి జర్మనీకి వచ్చారు. వేదిక వద్దకు వెళ్తుండగా.. భద్రతా అధికారిణి ఆయన్ను ఆపేందుకు ప్రయత్నించారు. 'ఆగండి.. మీ ఐడీ ఎక్కడ?.. మీ కార్డును కన్పించేలా ఉంచండి' అని ఆమె అన్నారు. దీంతో మునీర్ కొద్దిగా ఇబ్బంది పడ్డారు. దీనిని దౌత్యపరమైన ఇబ్బందిగా కొందరు కామెంట్లు పెడుతుండగా.. మరికొందరు ఉన్నతస్థాయి కార్యక్రమాల్లో ప్రొటోకాల్ సాధారణమేనని పేర్కొన్నారు. ఈ సంఘటనపై పాకిస్థాన్ మాజీ సైనికాధికారి ఆదిల్ రజా స్పందించారు. ప్రపంచ వేదికలపై మునీర్‌ను ఎవరూ గుర్తించరంటూ విమర్శించారు. గేట్ కీపర్లు అడిగినా.. అతడు తనని తాను వినయంగా పరిచయం చేసుకుంటారరంటూ ఎద్దేవా చేశారు. మరోవైపు.. ఈ కార్యక్రమానికి ఆసిమ్ మునీర్‌ను ఆహ్వానించడంపై జర్మనీలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పాక్ సైన్యం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతోందని కొన్ని రాజకీయ సంస్థలు ఆరోపించాయి. వేదిక వద్ద నిరసనలు తెలిపాయి.

## గ్రహాంతర జీవులు ఉన్నాయి.. కానీ: ఒబామా

**వాషింగ్టన్:**అంతుచిక్కని రహస్యంగా మారిన గ్రహాంతరవాసులపై ఎన్నో ఊహాగానాలు వస్తుంటాయి. గ్రహాంతరవాసులు, గుర్తుతెలియని ఎగిరే వస్తువుల వంటి వాటితో అమెరికాలోని 'ఏరియా 51'కు బలమైన సంబంధాలున్నాయన్న ప్రచారమూ ఉంది. దీనిపై అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏదో ఒక గ్రహంపై గ్రహాంతర వాసులు ఉండే విషయాన్ని తాను బలంగా నమ్ముతున్నానని అన్నారు. కానీ.. ఏలియన్స్‌ను ఏరియా 51లో అమెరికా నిర్బంధించిందనే ఊహాగానాల్లో నిజం లేదని స్పష్టం చేశారు. దీనిని నిరూపించడానికి ఎటువంటి ఆధారాలు కూడా లేవన్నారు.దశాబ్దం క్రితం యూఎస్ ఎయిర్ ఫోర్స్ రీపర్ డ్రోన్లు సేకరించిన రాడార్ రికార్డింగ్‌లలో మధ్యప్రాచ్యంలోని కొన్ని ప్రాంతాలపై అసాధారణ జీవుల ఉనికి కనిపించిందని పలు నివేదికలు సూచిస్తుండడంపై ఒబామా స్పందించారు. గ్రహాంతర వాసుల ఉనికికి సంబంధించిన పలు రికార్డులు అమెరికా ప్రభుత్వం దగ్గర ఉన్నట్లు తాను అధికారంలో ఉన్న సమయంలో కూడా సమాచారం లేదన్నారు.

**ఏమిటీ ఏరియా 51?:**అమెరికాలోని నెవాడలో ఉన్న 'ఏరియా 51' అత్యంత రహస్య ప్రాంతం. ఇక్కడ అమెరికా సైన్యం, శాస్త్రవేత్తలు ఆయుధాలు సహా పలు రకాల టెక్నాలజీలను పరీక్షిస్తారు. సైనిక శిక్షణ కూడా ఇస్తారు. ఈ స్థావరాన్ని 1955లో ఏర్పాటు చేశారు. నెవాడ ఎడారిలో 200 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇది ఉంది. ఇక్కడ గతంలో లాక్‌హీడ్ మార్టిన్ యూ-2 నిఘా విమానాలను పరీక్షించారు. ఆ తర్వాత నుంచి పలు రహస్య ఫైటర్ జెట్ల పనితీరును ఇక్కడ అంచనా వేశారు. ఒకప్పుడు ఇక్కడ ఉపగ్రహ చిత్రాలు తీయడంపై నిషేధం ఉండేది. కానీ, ఇప్పుడు దానిని తొలగించారు.



## అమెరికాలో అదృశ్యమైన భారత విద్యార్థి మృతి

విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. ఫిబ్రవరి 9 నుంచి అతడు కన్పించకుండా పోయాడు. చివరిసారిగా క్యాంపస్‌కు దగ్గరగా ఉన్న లేక్ అంజా సమీపంలో కనిపించినట్లు నిర్ధారించారు. సాకేత్ స్నేహితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా.. అతడి పాస్‌పోర్టు, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్‌ను అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే అక్కడ అతడి మృతదేహం లభ్యమైంది. సాకేత్ మృతిపై భారత రాయబార కార్యాలయం విచారం వ్యక్తం చేసింది. అతడి మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. ఈ క్లిష్ట సమయంలో సాకేత్ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని పేర్కొంది.

# శివనామ స్మరణలో బీమన్న ఆలయం

- కోరిన కోర్కెలు తీర్చు బీమన్న
- కోడె మొక్కులు చెల్లిస్తాం
- బీమన్న... సామాన్య భక్తుడికి తప్పని తిప్పలు
- స్వామివారి దర్శనానికి 4 గంటల సమయం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** కోరిన కోర్కెలు తీర్చు బీమన్న... కోడె మొక్కులు చెల్లిస్తాం బీమన్న...బోలా శంకరదు, పేదల దేవుడు కోరిన కోర్కెలు తీర్చే ఏములాడా రాజన్నను దర్శించుకునేందుకు చాలా మంది భక్తులు వస్తుంటారు. రాజన్న ఆలయ అభివృద్ధి జరుగుతున్న క్రమంలో బిమేశ్వర ఆలయంలో మహా శివరాత్రిని నిర్వహిస్తున్నారు. జాతరకు భక్తులు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయంలో అదివారం మహా శివరాత్రి జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలలో హర హర మహాదేవ శంభోశంకర.. ఓం నమశ్శివాయ..అనే శివ నామస్మరణతో మార్మోగిపోయింది.భక్తులు సర్వదర్శనం,శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లలో గంటల తరబడి బారులు తీరారు.

కోడెమొక్కు చెల్లించుకునే క్యూలైన్లలో భక్తుల రద్దీ నెలకొంది. సామాన్య భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు సుమారు 5 గంటలకు పైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సాయంత్రము స్వామివారికి ఆలయ అర్చకులు లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

**వీఐపీల తాకిడితో సామాన్యుల భక్తులకు ఇబ్బందులు..**

మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ శ్రీ బీమేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు సామాన్య భక్తులు గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. వీఐపీల కోసం ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి ఒక్కొక్కరికి రూ 300 టికెట్ కేటాయించడంతో ఆ క్యూ లైన్లో భక్తుల రద్దీ లేదు.వివిఐపిల కోసం ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసిన దానిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్న పోలీసులు తమకు అనుకూలంగా ఉన్న వారిని క్యూలైన్ ద్వారా పంపడంతో భక్తులకు యిబ్బందులు తలెత్తాయి.

పోలీసులకు సంబంధించిన వారితో పాటు అధికార పార్టీకి చెందిన చోటామోటా నాయకులు ప్రతి ఒక్కరు అట్టి క్యూలైన్ ద్వారా లోపలికి వెళుతుండగా సామాన్య భక్తులు గంటల తరబడి కృలైనలో ఉన్నారు. జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగర్వాల్ అగర్వాల్ ఎస్పీ మహేష్ బి.గీతే ఆలయ ఆవరణలో పరిశీలించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు చేశారు.

**శివ స్వాములకు ఇబ్బందులే :**

మండల కాలం శివ దీక్ష తీసుకున్న స్వాములు మహాశివరాత్రి రోజున స్వామివారిని దర్శించుకునేందుకు వారికి సమయం కేటాయించారు. ఆ సమయంలో సామాన్య భక్తులను కూడా దర్శనానికి అనుమతించడంతో శివదీక్షాపరులు ఇబ్బందులు పడ్డారు. గతం కంటే అరగంట సమయం పొడిగించినప్పటికీ శివ స్వాములకు ఇబ్బందులు తప్పలేదు..

**జాగరణ చేస్తున్న భక్తులు :**

మహాశివరాత్రి జాతర వచ్చిందంటే భక్తులు శివరాత్రి పర్వదినం రోజు జాగరణ చేయడం ఆనవాయితీ. వారు ఉంటున్న ప్రదేశాన్ని శుభ్రం చేసి మట్టి ప్రమిదలలో దీపాలను వెలిగించి నైవేద్యంగా బెల్లము, శనిగలు, కందగడ్డ, వివిధ రకాల పండ్లతో స్వామివారికి నైవేద్యం పెడతారు. జాగరణ ఉన్న భక్తులు ఎలాంటి ఆహారం తీసుకోకుండా రాత్రివేళ నిద్ర పోకుండా జాగరణ చేస్తారు.

**లింగోద్భవ కాలంలో ప్రత్యేక పూజలు :**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భీమేశ్వర ఆలయములో అదివారం రాత్రి 11.30 నుండి ఆలయ ఇంచార్జి స్థానాచార్యులు నమిలకొండ ఉమేష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఆకట్టుకున్న శివోహం కార్యక్రమాలు :**

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శివోహం శివార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.జాతీయ అంతర్జాతీయ కళాకారులతో కళా ప్రదర్శనలు పలువురిని మంత్రముగ్ధుల్ని చేశాయి. మహా శివరాత్రి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇన్చార్జి జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ మహేష్ బి గితే పర్యవేక్షణలో ఆర్డీవో రాధాబాయ్, ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొత్త కొత్త పద్ధతులతో సైబర్ నేరగాళ్లు



## డిజిటల్ అరెస్ట్ పేరుతో చాలా మంది బాధితులు

- 62 ఏళ్ల బాధితుడి దగ్గర రూ.కోటి కాజేసిన సైబర్ నేరగాళ్లు
- ప్రధాన సూత్రధారిని అరెస్ట్, రిమాండ్
- ఖాతా వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచన

**హైదరాబాద్ ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** ఆధునిక సాంకేతిక యుగంలో సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులతో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ఇటీవల కాలంలో డిజిటల్ అరెస్ట్ పేరుతో దేశంలో చాలా మంది బాధితులు కోట్లాది రూపాయలు కోల్పోయేలా చేస్తోంది. హైదరాబాద్‌కు చెందిన 62 ఏళ్ల బాధితుడు రూ. 1.07 కోట్ల కోల్పోయారు. ఈ కాజేసిన కేసులో ప్రధాన సూత్రధారిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు.

హైదరాబాద్ చెందిన ఓ బాధితుడికి గత ఏడాది అక్టోబర్లో అకస్మాత్తుగా ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారి అని ఫోన్ కాల్ వచ్చింది. "మీ ఆధార్ కార్డు ద్వారా మనీ లాండరింగ్తో పాటు డ్రగ్స్ తరలిస్తున్నారని, వాటిపై మీ పైనా కేసు నమోదు అయ్యిందని, అలాగే అరెస్ట్ వారెంట్ ఉంది" అని బెదిరించాడు. దీంతో బాధితుడు భయపడటంతో అతడిని డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని నమ్మించి, వీడియో కాల్ ద్వారా నిరంతరం పర్యవేక్షణలో ఉంచారు. బయట ఎవరికీ చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కేసు నుంచి బయటపడాలంటే వెరిఫికేషన్ కోసం డబ్బు డిపాజిట్ చేయాలని విచారణ అనంతరం తిరిగి ఇచ్చేస్తామని నమ్మించి, విడతల వారీగా బాధితుడి నుంచి రూ. 1.07 కోట్లు వసూలు చేశారు. చివరికి తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్న గురుదీప్ సింగ్ ఢిల్లీలో ట్రావెల్తో పాటు మనీ ఎక్స్ఛేంజ్ వ్యాపారం నిర్వహిస్తుంటాడని పోలీసులు గుర్తించారు. గురుదీప్ సింగ్ తన సహచరులతో కలిసి ఓ ముఠాగా ఏర్పడి, అమాయకుల పేరుతో కరెంట్ బ్యాంక్ ఖాతాలను సేకరించారని పోలీసుల విచారణలో తెల్చారు. బాధితుల నుంచి వచ్చే డబ్బును ఈ ఖాతాల్లోకి మళ్లించి, ఆపై ప్రధాన నిందితుడికి అందజేస్తుంటాడని పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే దీపక్ గెహ్లోవత్, ప్రశాంత్ కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించామని హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు వెల్లడించారు. ఏ ప్రభుత్వ సంస్థ లేదా పోలీస్ విభాగం వీడియో కాల్ ద్వారా మిమ్మల్ని అరెస్ట్ చేయదని, అలాగే విచారించదని పోలీసులు తెలిపారు.



**ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దు**

కేసుల నుంచి విముక్తి కల్పిస్తామని ఏ అధికారి ఫోన్ ద్వారా డబ్బు కోరారని పోలీసులు వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు సీబీఐ, కస్టమ్స్, క్రైమ్ బ్రాంచ్ అధికారులమని ఫోన్ చేస్తే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మీ బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దని పోలీసులు సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ కానీ అలాగే లేదా www. cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

**ఇలా చేయాలి :**

- గుర్తు తెలియని నెంబర్ల నుంచి బెదిరింపు ఫోన్కాల్ వస్తే ఆందోళన చెందవద్దు. వచ్చిన వాటిని పరిశీలించి తెలిసిన వారికి సమాచారం ఇవ్వాలి. అనంతరం దానిపై చర్చించాలి.
- ఏ నెంబర్ నుంచి ఫోన్ వచ్చిందో దానిని ఆరా తీసి వారు చెబుతున్న మాటల్లో అసలు నిజానిజాలు ఏంటని గుర్తించాలి.
- సైబర్ మోసమని గుర్తించిన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ విభాగం హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేసి ఏం జరిగిందో మొత్తం చెప్పాలి.
- స్థానికంగా అందుబాటులో ఉన్న పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేయాలి.
- మోసపోయామని గుర్తించిన గంట వ్యవధి లోపు పోలీసులకు సమాచారం ఇస్తే డబ్బులు బదిలీ కాకుండా పోలీసులు ఆ ఖాతాలను స్తంభింపచేసే అవకాశం ఉంటుంది.

# నేడు చైర్మన్ వైస్ చైర్మన్‌ల ప్రమాణ స్వీకారం

- వీరికి వరించనున్న పదవులు
- చైర్మన్‌ల ప్రమాణ స్వీకారం కంటే ముందు గెలుపొందిన అభ్యర్థులు కౌన్సిలర్ల గా ప్రమాణ స్వీకారం
- చేతి ఎత్తి చైర్మన్ వైస్ చైర్మన్‌ల ఎంపిక
- కొత్త పాలక మండలి కొలువు తీరడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి





**వికారాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 15 (జనం సాక్షి):** జిల్లా వ్యాప్తంగా నాలుగు మున్సిపాలిటీల్లో కొత్త పాలక మండలి సోమవారం కొలువు తీరనున్నది. కొత్త పాలక మండలి ప్రమాణస్వీకారానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ముందుగా అధికారులు వికారాబాద్ తాండూర్ పరిగి కొడంగల్ మునిసిపాలిటీల్లో ఎన్నికైన కౌన్సిలర్ల చేత ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అనంతరం అధికారుల సమక్షంలో చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎంపిక ఉంటుంది. కౌన్సిలర్లుగా ప్రమాణస్వీకారం చేసిన వారంతా చైర్మన్ వైస్ చైర్మన్ లను ఎన్నుకోవాల్సి ఉంటుంది. చైర్మన్ గా వైస్ చైర్మన్ గా తాను ఎన్నుకోవడానికి అంగీకారమే అంటూ కౌన్సిల్ హాల్ లో కౌన్సిలర్లు అందరూ ఒక్కొక్కరు చేతులు పైకి ఎత్తి తమ అంగీకారాన్ని తెలుపవలసి ఉంటుంది. దీంతో ఏ పార్టీకి చెందిన చైర్మన్ వైస్ చైర్మన్ అభ్యర్థులకు ఎన్ని ఓట్లు వచ్చాయో లెక్కించి అధికంగా ఆమోదించిన వారిని అధికారులు చైర్మన్ వైస్ చైర్మన్ గా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటిస్తారు. వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా గడ్డం అనన్య (కాంగ్రెస్) వైస్ చైర్మన్ గా అర్థ సుధాకర్ రెడ్డి (కాంగ్రెస్) తాండూర్ మున్సిపల్ చైర్మన్ గా పట్లోళ్ల నీరజ (కాంగ్రెస్) వైస్ చైర్మన్ గా అబ్దుల్ రజాక్ (కాంగ్రెస్) కొడంగల్ మున్సిపల్ చైర్మన్ గా నంద ప్రశాంత్ (కాంగ్రెస్) వైస్ చైర్మన్ గా కృష్ణంరాజు (కాంగ్రెస్) పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ గా సబియా తయారల్లి ( కాంగ్రెస్) వైస్ చైర్మన్‌గా ఎంపికయ్యే అవకాశం ఉంది. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకుంది. ప్రస్తుతం కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీల తరపున పోటీ చేసి గెలుపొందిన అభ్యర్థులంతా ఆయా పార్టీలు ఏర్పాటు చేసిన క్యాంపుల్లో ఉన్నారు. వారంతా సోమవారం నేరుగా ఆయా మున్సిపాలిటీలకు చేరుకొని ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో పాల్గొని అవకాశం ఉంది. పరిగి మున్సిపాలిటీలో హంగు ఏర్పడిన కారణంగా ఆ మున్సిపాలిటీ చైర్మన్ వైస్ చైర్మన్ ఏ పార్టీకి చెందినవారు ఎంపిక అవుతారని ఉత్కంఠ నెలకొంది. మరి కొద్ది సేపట్లో ఆ ఉత్కంఠకు తెరపడనుంది.

# హ్యాట్సాఫ్.. హెల్పింగ్ హాండ్స్!

- 200 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకుల పంపిణీ



**మంథని,ఫిబ్రవరి 15(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆదివారం సాయంత్రం "హెల్పింగ్ హ్యాండ్స్" అధ్యక్షుడు నారగోని సతీష్, సభ్యుల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో 200 మంది నిరుపేద కుటుంబాలకు 'మహా శివరాత్రి " పర్వదినాన్ని పురస్కరించుకొని ఒక్కొక్కరికి రూ. 1,140 విలువగల నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, మాజీ ఎంపీపీ లు కోలేటి మారుతి, మల్యాల రామచంద్రం, పేరపల్లి, గుండారం సర్పంచ్ లు బొంగోని సదయ్య, జంగిలి పోచాలు, ఉప సర్పంచ్ రఫిక్ సోహెల్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, నాయకులు అనవేన లక్ష్మీరాజం, ఇతర ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులతో పాటు అధిక సంఖ్యలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# దొంగ ఓట్లతో, దొడ్డి దారిన గెలిచిన కాంగ్రెస్ పార్టీ

- ఓట్ల చోరీపై ఉద్యమం చేస్తున్న రాహుల్ గాంధీ మాటలు ఏమయ్యాయి
- 9వ వార్డు గెలుపుపై ఎన్నికల కమిషనర్, హైకోర్టును ఆశ్రయిస్తా
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓట్లను చోరీ చేశాడు
- 9వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన, సూర శ్యామ్ ఆరోపణ



**సుల్తానాబాద్,ఫిబ్రవరి 15(జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికలలో దొంగ ఓట్లతో దొడ్డి దారిన గెలిచిన,కాంగ్రెస్ పార్టీ 9 వ వార్డ్ అభ్యర్థి తౌరికొండ ప్రభాకర్ పై ఎన్నికల కమిషనర్ తో పాటు హైకోర్టు ను ఆశ్రయిస్తానని 9వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన సూర శ్యామ్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్య శ్యామ్, మాట్లాడుతూ అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతోందని ఇతర పార్టీల అభ్యర్థులను బెదిరింపులకు భయభ్రాంతులకు గురిచేస్తూ, తమ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం ఎంతటికైనా దిగజారిపోయిన రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎలాగైనా ఈ ఎన్నికల్లో విజయం సాధించాలని, 9వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా గెలుపొందిన తౌరి కొండ ప్రభాకర్ ఇంటి నెంబరు పై, 6-144/1 గల ఇంట్లో కేవలం 6 ఓట్లు మాత్రమే ఉన్నాయని, ఐదవ వార్డు 10వవార్డు, 7 వ వార్డు ల తో పాటు హైదరాబాదులో నివసించే వారి ఓట్ల ను తన ఇంటి నంబర్ పై బి ఎల్ ఓ సహకారంతో ఆధార్ కార్డులను మార్పిడి చేసి ఓట్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. గతంలో తాను మున్సిపల్ లో అభ్యంతరాలు తెలిపే సమయంలో ఓట్ల పై అభ్యంతరం తెలిపిన పరిగణలోకి తీసుకోలేదని, ప్రజావాణి లో కలెక్టర్ కు సైతం ఫిర్యాదు చేశానని దొంగ ఓట్లను తొలగించాలని చెప్పినా పట్టించుకున్న వారు లేరని, కేవలం వివిధ వార్డులలో ఉన్న తనకు అనుకూలమైన వారిని తన ఇంటిపై నమోదు చేసుకొని నాలుగు ఓట్ల తో విజయం సాధించారని, నైతికంగా విజయం తనదేనని దీనిపై ఎన్నికల కమిషనర్ తో పాటు హైకోర్టును ఆశ్రయిస్తానని సూర శ్యామ్ స్పష్టం చేశారు. పార్లమెంటులో ఓటు చోరీ అంటూ ఉద్యమం చేస్తున్న రాహుల్ గాంధీ కి తమ కాంగ్రెస్ పార్టీలోనే ఓట్ల చోరీకి పాల్పడేవారు ఉన్నారని స్పష్టంగా అర్థమవుతుందో లేదో గమనించాలన్నారు. ఓట్ల చోరీ కాంగ్రెస్ పార్టీలోనే ఉందన్నారు. తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ గా విజయం సాధించామని సంకలు గుద్దుకోవడం సరికాదని నైతికంగా ప్రజల్లో ఉండి వారి ఓటుతో గెలవాలి, కానీ, బెదిరింపులకు భయభ్రాంతులకు గురి చేస్తూ తప్పుడు ఓట్లను నమోదు చేసి గెలుపొందడం ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధమన్నారు. 22 ఓట్లను తన ఇంటిపై నమోదు చేసుకున్నారని, గతంలో ఓటు వేసిన అనిల్, జాంగిర్, మొండయ్య, షేక్ మహ్మద్ అలీ, తోపాటు అనేకమంది పేర్లు నమోదు చేశారని వీరు గతంలో తమ తమ వార్డ్లో ఓటు హక్కు వినియోగించుకున్నారని ప్రస్తుతం అదే వార్డులలో నివసిస్తున్నారని వారి గృహాలు అక్కడే ఉన్నాయని ఓటు మాత్రం 9వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఇంటిలో ఎలా ఉంటుందని నిలదీశారు.9వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ఓటింగ్ రోజు స్వయంగా డబ్బులు పంపిణీ చేశారని వాటికి సంబంధించిన ఆధారాలు వివిధ ఛానల్లో ప్రసారం అయ్యాయని పేర్కొన్నారు. అన్ని ఆధారాలతో ఎన్నికల కమిషనర్ ను ఆశ్రయిస్తానని సుర శ్యామ్ తెలిపారు. వెంటనే 9 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దొడ్డి దారిన గెలుపొందిన తౌరికొండ ప్రభాకర్ పై అనర్హత వేటు వేయాలని, నిజాయితీతో ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల ఓట్లతో ఓటమిపాలైన తనను కౌన్సిలర్ గా పరిగణించాలని సూ ర శ్యామ్ డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టులో రిట్ దాఖలు చేస్తానని శ్యామ్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కొయ్యడ అజయ్, అక్బర్, మోసిన్ ,ఫయాజ్, అనిల్, కాళీ చరణ్, వెంకటేష్, రాజు,రాకేష్ ,మహేష్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.



## మున్సిపల్ వార్డు కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారానికి సర్వం సిద్ధం

- కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి
- ఆమనగల్ మున్సిపాలిటీ కమిషనర్ శంకర్ నాయక్

**ఆమనగల్ ఫిబ్రవరి 15(జనంసాక్షి):** ఆమనగల్ మున్సిపల్ నూతన పాలక వర్గం ప్రమా ణ స్వీకారా నికి రంగం సిద్ధమైంది.నేడు మున్సిపల్ కార్యాల యంలో నూతన కౌన్సిలర్లు కొలువు తీరను న్నారు. పట్టణంలోని 15 వార్డు స్థానాలకు గాను,8 వార్డు స్థానాలను దక్కించుకున్న బిఆర్ఎస్,6 వార్డు స్థానా లను దక్కించుకున్న బిజెపి,అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానం దక్కించుకుంది.16 న ఉదయం 11 గంటలకు నిర్వహించే ప్రమాణ స్వీకారంతో పాటు చైర్మన్,వైస్ చైర్మన్ ఎంపిక ఉంటుందని కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి,ఆమనగల్ మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తెలిపారు.ఈ మేరకు కౌన్సిల్ హాలును సర్వాంగ సుందరంగా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.నేడు ఉదయం 11 గంటలకు పాలక వర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా సీఐ జానకి రామ్ రెడ్డి,ఎస్సై వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో బందోబస్త్ ఏర్పాటు చేయనున్నారు.

# వనస్థలిపురంలో ఆగంతకుల అరాచకం

- వాహనాల దగ్ధం.. ప్రాణాలు తీసేందుకు కుట్ర?.
- పోలీసుల తీరుపై బాధితుల ఆగ్రహం.. రోజులు గడుస్తున్నా అంతుచిక్కని నిందితులు



**హైదరాబాద్, ఫిబ్రవరి 15 (జనం సాక్షి) :** అర్ధరాత్రి వేళ ఇళ్లలోకి చొరబడి బీభత్సం సృష్టించడం.. పెట్రోల్ పోసి ఇళ్లను, వాహనాలను తగులబెట్టడం వంటి వరుస ఘటనలు వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపుతున్నాయి. నిందితులు పక్కా ప్లాన్‌తో హత్యాయత్నానికి పాల్పడుతున్నా, పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎఫ్సీఐ కాలనీలో, గత నెల 25న అర్ధరాత్రి సమయంలో, కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బాధితుడి ఇంట్లోకి చొరబడ్డారు. నేరుగా కిచెన్ రూమ్‌లోకి వెళ్లి అక్కడ పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. గ్యాస్ సిలిండర్ పేలి అందరూ సజీవ దహనం కావాలనే దురుద్దేశంతోనే, నిందితులు ఈ పని చేసినట్లు తెలుస్తోంది. అంతటితో ఆగకుండా బయట పార్క్ చేసి ఉన్న కారుపై కూడా పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. ఈ భీభత్సం మొత్తం సీసీ ఫుటేజీలో క్షుణ్ణంగా రికార్డ్ అయ్యింది. ఈ కేసులో విస్తుపోయే విషయం ఏమిటంటే, సదరు వ్యక్తికి చెందిన కారును తగులబెట్టడం ఇది రెండోసారి. గతంలో జరిగిన దాడిపై పోలీసులు కేసు (ఎఫ్ఐఆర్ నం. 1821/2025) నమోదు చేశారు. తాజా అరాచకంపై జనవరి 25న ఎఫ్ఐఆర్ 141/2026 నమోదైంది. రెండు సార్లు ఎఫ్ఐఆర్లు నమోదై, నిందితుల పేర్లు చేర్చినప్పటికీ వనస్థలిపురం పోలీసులు ఇంతవరకు వారిని అదుపులోకి తీసుకోకపోవడం గమనార్హం. నిందితులు యథేచ్ఛగా బయట తిరుగుతున్నా, ఎంక్వయిరీలో ఎటువంటి పురోగతి లేకపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హత్యాయత్నానికి పాల్పడిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నా, పోలీసుల విచారణ లోపం వల్లే నిందితులు తప్పించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజా రక్షణే ధ్యేయమని చెప్పే పోలీసులు, ఇలాంటి కేసుల్లో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్ 2025 బేస్ బాల్ పోటీలకు గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు



**పెద్దపల్లి,ఫిబ్రవరి 15(జనంసాక్షి) :** సుల్తానాబాద్ పట్టణం లో ఆదివారం సీఎం కప్ 2025 జిల్లా స్థాయి బేస్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు జె. సాత్విక, ఏ. లాస్య ప్రియ, జి. వెన్నెల ఉత్తమ ప్రతిభ చాటారు. ఈనెల 16 నుండి 20 వరకు హైదరాబాదు లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పెద్దపల్లి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఖో ఖో అసోసియేషన్ బాధ్యులు పి. వెంకట ఉమాపతి, పెద్దపల్లి టాగ్ అఫ్ వార్ జిల్లాఅసోసియేషన్ ప్రెసిడెంట్ ఆలేటి సంపత్, పెద్దపెల్లి జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ సెక్రెటరీ వాసు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ ఎంపిక పట్ల గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ విద్యార్థులకు అభినందన తెలిపి, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి ప్రిన్సిపాల్ విజయ్, వాయామ ఉపాధ్యాయుడు అజయ్ కుమార్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

### కరీంనగర్ మేయర్ ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పార్టీ

# హుందాగా వ్యవహరించాలి

**ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్.**



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** కరీంనగర్ మేయర్ ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పార్టీ హుందాగా వ్యవహరించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో, కరీంనగర్ కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలన్నా రు. కరీంనగర్ నగర ప్రజల తీర్పును గౌరవిస్తేనే కాంగ్రెస్ కు రాజకీయ భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో 66 డివిజన్ల గాను బిజెపి పార్టీ 30 డివిజన్లను సొంతంగా గెలుపొంది ప్రధాన పార్టీగా ఆవిర్భవించిందన్నారు. కాబట్టి మేయర్ ఎన్నిక విషయంలో కాంగ్రెస్ పార్టీ హుందాగా ఉండడమే సరైన రాజకీయ నిర్ణయం అన్నారు.

కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం ఒకటై ఇండిపెండెంట్ లను కలుపుకొని బిజెపికి బ్రేక్ వేద్దామనే ఆలోచన సరైంది కాదని, కనుక అటువంటి ఆలోచనలను కాంగ్రెస్ పార్టీ మానుకోవడమే మంచిదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో, కరీంనగర్ అసెంబ్లీ టికెట్ కేటాయించడంలో జరిగిన తప్పిదం తదుపరి కాలంలో కరీంనగర్ అసెంబ్లీ, కరీంనగర్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేయడంలో పార్టీ విఫలం అయింది. కాబట్టి బిజెపి పార్టీ కి ఇన్ని సీట్లు గెలవడం కు నాంది అయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం బలంగా ఉంది కాబట్టి అక్కడ మంచి ఫలితాలు రావడం జరిగిందని, కరీంనగర్ లో నాయకత్వం లోపం మూలంగానే ఫలితాలు విభిన్నంగా రావడం జరిగింది అన్నారు. కాంగ్రెస్ పార్టీ దీని నుండి గుణపాఠం నేర్చుకుని నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి కొత్త మార్గాలను అన్వేషించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ కోరారు.

# ఏఐఎఫ్‌బి కార్పొరేటర్‌లకు విప్ జారీ

- పార్టీని ధిక్కరిస్తే చర్యలు
- ఏఐఎఫ్‌బి కార్పొరేటర్ ను బిజెపిలో చేర్పించుకోవడం సిగ్గుచేటు
- ఏఐఎఫ్‌బి రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో 15వ డివిజన్ కార్పొరేటర్ విపుల సాయి జ్యోతి, 27వ కార్పొరేటర్ బోట్ల శ్యామలలకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ విప్ జారీ చేయడం జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి అన్నారు. ఆదివారం రోజు కరీంనగర్ కార్యాలయంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బండారి శేఖర్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జోజి రెడ్డి మాట్లాడుతూ... ఏఐఎఫ్బి పార్టీ బి ఫాం పైన గెలిచిన ఇద్దరు కార్పొరేటర్‌లో ఒకల్ని 15 డివిజన్ కార్పొరేటర్ సాయి జ్యోతిని కేంద్ర మంత్రి బండి బిజెపిలో చేర్చుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఒక కమ్యూనిస్టు పార్టీలో గెలిచిన అభ్యర్థులను బిజెపి పార్టీలో చేర్చుకోవడానికి బండి సంజయ్ కి సిగ్గుండాలని, మేయర్ స్థానం కోసం బిజెపి వాళ్లు నీచమైన రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. బిజెపికి మేయర్ ఎన్నుకోవడానికి పూర్తిస్థాయిలో కార్పొరేటర్లు లేరని కావున ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిని కిడ్నాప్ చేసి పార్టీలో చేర్చుకోవడం జరుగుతుందని, ఇప్పటి వరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్పొరేషన్ లో ఎవరికి మద్దతు ఇవ్వాలో అధికారికంగా ప్రకటించలేదని మా పార్టీ బీఫామ్ పైన గెలిచి ఇతర పార్టీలకు వెళితే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్లకు విప్ జారీ చేయడం జరిగిందని సోమవారం ఉదయం 10 గంటల వరకు ఆలిండియా ఫార్వర్డ్ బ్యాక్ పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీలు ఎవరికి మద్దతు ఇవ్వాలో స్పష్టత వస్తుందని బిజెపికి మద్దతు ఇచ్చే పరిస్థితి లేదని మత రాజకీయాలను రెచ్చగొట్టే విధంగా బిజెపి వాళ్లు చేస్తున్నారని దీని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ బీఫామ్ పైన గెలిచిన కార్పొరేటర్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా బిజెపి పార్టీ గుర్తిస్తుందని ఏ పార్టీలో గెలిచారో తెలుసుకోకుండా ఇతర పార్టీలో గెలిచిన వారికి బిజెపి కండువలు వేస్తున్నారని అన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కమిటీ కరీంనగర్లో కార్పొరేషన్ లో గెలిచిన 15 డివిజన్ కార్పొరేటర్ సాయి జ్యోతి, 27 డివిజన్ కార్పొరేటర్ శ్యామలకు విప్ జారీ చేయడం జరిగిందని పార్టీని ధిక్కరిస్తే పార్టీ పరంగా చర్యలు తప్పవని అన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బండారి శేఖర్, నగర అధ్యక్షుడు సత్య రావు తదితరులు పాల్గొన్నారు.




# మేయర్ పీఠం కాంగ్రెస్‌కే..

## ఎక్స్ అఫీషియో సభ్యులే కీలకం

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** కరీంనగర్ మేయర్ పీఠం కోసం సోమవారం జరిగే ఎన్నికల్లో సభ్యులు కీలకంగా మారారు. కాంగ్రెస్, బిజెపి క్యాంపుల్లో సమానంగా 33 మంది కార్పొరేటర్లు ఉండడంతో ఎక్స్ ఆఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. కరీంనగర్ కార్పొరేషన్ ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో పాటు మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణలు ఉన్నారు. మేయర్ పీఠం కాంగ్రెస్‌కే కరీంనగర్ కార్పొరేషన్ లో మొత్తం 66 మంది సభ్యులు ఉండగా ఎక్స్ ఆ సభ్యులతో కలిపి ఆ సంఖ్య 69కే చేరింది. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ సీట్ దక్కాలంటే మ్యాజిక్ ఫిగర్ 35 గా ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ శిబిరంలో 33 మంది కార్పొరేటర్లు, బిజెపి శిబిరం లో 33 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఎక్స్ ఆఫిషియో సభ్యులతో కలిసి కాంగ్రెస్ బలం 35 గా ఉండగా, బిజెపి బలం 34 గా ఉంది. దీంతో సోమవారం కరీంనగర్ మేయర్ పీఠం కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లనుంది.

**కార్పొరేటర్లకు కాసుల పంట..**

కరీంనగర్‌లో గెలుపొందిన కార్పొరేటర్లకు కాసుల వర్షం కురుస్తుంది. ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు కరీంనగర్ మేయర్ పీఠం ఎలాగైనా దక్కించుకోవాలని పావులు కదుపుతున్నారు. దీంతో కరీంనగర్లో గెలిచిన కార్పొరేటర్ల ధర కోట్ల రూపాయలకు చేరింది. ఒక్కో కార్పొరేటర్ కు తమకు మద్దతిస్తే కోటి రూపాయల నుండి మూడు కోట్ల రూపాయల వరకు నగదు రూపంలో ఇస్తామని రెండు పార్టీలు ఆఫర్ చేస్తున్నాయని తెలిసింది. దీంతో కరీంనగర్లో గెలిచిన కార్పొరేటర్లు ఒక్కరోజులోనే కోటీశ్వరులుగా మారనున్నారు. ఏదేమైనా కరీంనగర్ కార్పొరేషన్ భవితవ్యం నేడు తేలనున్నది.



# సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

## పండగపూట విషాదం

**గంభీరావుపేట ఫిబ్రవరి 15 (జనం సాక్షి):** రోడ్డు ప్రమాదంలో గోరంటాల వాసి మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలంలో చోటుచేసుకుంది. ఎల్లారెడ్డిపేట శివారులో గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామానికి చెందిన రాజయ్య సైకిల్ పై ఎల్లారెడ్డిపేట వైపు వస్తుండగా కరీంనగర్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు వెనకాల నుంచి రాజయ్య సైకిల్ను ఢీ కొట్టడంతో రాజయ్య తలకు తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడని సమాచారం.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# చోరీ కేసును ఛేదించిన అత్తాపూర్ పోలీసులు

## ఇద్దరు నిందితుల అరెస్టు రిమైండర్ తరలింపు



**రాజేంద్రనగర్,ఫిబ్రవరి15(జనంసాక్షి) :** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 తేదీన మధ్యాహ్నం జరిగిన చోరీ ఘటనపై కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ప్రకారం హజ్రా బేగం (29), వాచ్‌మన్, సులేమాన్ నగర్, అత్తాపూర్ ఆమె 14 న ఉదయం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు వివరాల ప్రకారం, 13 న మధ్యాహ్నం సుమారు 1 గంటల సమయంలో ఆమె భర్త నగల దుకాణానికి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో వారి కుమార్తె మాత్రమే ఉండేది. ఇంటి తలుపు తాళం వేసి తాళపు చెవిని వాషింగ్ మెషిన్ దగ్గర ఉంచారు. మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో తిరిగి వచ్చి ఇంట్లోకి వెళ్లగా, అల్మిరా తాళం పగులగొట్టబడినట్లు గమనించారు. అందులో ఉన్న 0.5 తులాల బంగారం సుమారు 30 తులాల వెండి వస్తువులు కనిపించలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితులు మొహమ్మద్ జునైద్ (21), సోఫా తయారీ పని, సయ్యద్ నయాబ్ అలియాస్ రెహాన్ (19), విద్యార్థి అని గుర్తించారు. నిందితుడు ఏ1 పై గతంలో కూడా అత్తాపూర్ ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు వేగంగా తీసుకున్న చర్యలపై దొంగిలించబడిన బంగారం వెండి వస్తువులను యథాతథంగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులు ఇద్దరినీ 15 న తేదీన న్యాయస్థానంలో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

# ఘనంగా జిల్లాస్థాయి సీఎం కప్ టేబుల్ టెన్నిస్ పోటీలు

**సుల్తానాబాద్, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీలు సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి ఆరెపల్లి రాజయ్య, పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ సుల్తానాబాద్ మండల ఎస్‌జిఎఫ్ కన్వీనర్ ప్రణయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, టేబుల్ టెన్నిస్ ఆడడం వల్ల మెదడు చురుకుగా పని చేస్తుందని అన్నారు. గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా ఈ పోటీలు యువతలో ఉత్సాహాన్ని నింపుతున్నాయని పేర్కొన్నారు.

# క్యాంపులో గెలుపొందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు



**సుల్తానాబాద్,ఫిబ్రవరి 15(జనంసాక్షి):** ఇటీవల జరిగిన సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన 12 మంది కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి,లతో క్యాంపు కొనసాగుతుంది. ఈనెల 17న మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనుండడంతో క్యాంపు రాజకీయాలకు తెరతీశాయి. సుల్తానాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ కైవసం చేసుకొనుండడంతో మార్కెట్ చైర్మన్ ప్రకాశరావుతోపాటు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నేత దుగ్యాల సంతోష్ రావు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ తో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్ గెలుపొందిన అభ్యర్థులు గాజుల రాజ మల్లయ్య,ఉట్ల వర ప్రదీప్, భాకం సాయికిరణ్, చింతల రాజు, సిద్ధ తిరుపతి, తోర్రి కొండ ప్రభాకర్, వేగోళం అబ్బయ్య గౌడ్, గరిగే శ్రీనివాస్, అమి రిశెట్టి తిరుపతి, రాకేష్, గరిగే శోభారాణి, అంతటి పుష్పలత, ఈర్ల స్వరూప, గాదాసు మంజుల రవీందర్, వేగోళం పద్మ, అమిరిశెట్టి శ్రావణి, తదితరులు క్యాంపులో ఉన్నారు.



# నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

## ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో (జనం సాక్షి) :** వేములవాడ మహా శివరాత్రి జాతర, మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. అధికారులు అందరూ వేములవాడ మహా శివరాత్రి జాతర, ఎన్నికల విధుల్లో ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

# బీమన్నను దర్శించుకున్న ఇంచార్జి కలెక్టర్

## వైద్య శిబిరం, మే ఐ హెల్ప్ యూ డెస్క్‌ల పరిశీలన



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** మహా శివరాత్రి జాతర సందర్భంగా సోమవారం శ్రీ భీమేశ్వర స్వామి వారిని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఆవరణం వద్ద వైద్య శిబిరం, మే ఐ హెల్ప్ యూ డెస్క్ లను పరిశీలించారు. వైద్య శిబిరంలో ఏ ఏ మందులు అందుబాటులో ఉన్నాయో పరిశీలించారు. హెల్ప్ డెస్క్ లో సిబ్బందితో మాట్లాడారు. అనంతరం క్యూ లైన్ల వద్ద భక్తులతో మాట్లాడి ఇక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వాలంటీర్లు నీటిని పంపిణీ చేస్తుండగా, పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది, హెల్ప్ డెస్క్ బాధ్యులకు పలు సూచనలు చేశారు.

**కమాండ్ కంట్రోల్ రూం పరిశీలన :** బీమేశ్వర సదన్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే కలిసి పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, తహసీల్దార్ జయంత్ కుమార్ పాల్గొన్నారు.



# ప్రత్యేక సమావేశం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**నిజామాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్ ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రత్యేక సమావేశానికి నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో ఎం.పీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలలో కూడా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా స్పెషల్ మీటింగ్ కు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు జరగకుండా ఆయా మున్సిపాలిటీల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని అన్నారు. కాగా, ఉదయం 11.00 గంటలకు ప్రత్యేక సమావేశం ప్రారంభం అవుతుందని, నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో స్పెషల్ ఆఫీసర్లు ప్రమాణ స్వీకారం చేయిస్తారని అన్నారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా మధ్యాహ్నం 12.30 గంటలకు మేయర్/డిప్యూటీ మేయర్, ఛైర్మన్/వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా మేయర్/డిప్యూటీ మేయర్, ఛైర్మన్/వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరుగుతుందని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్ తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

# ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు

## ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనం సాక్షి);** రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) నిబంధనల మేరకు మున్సిపల్ చైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఇంచా ర్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ముందుగా సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో కౌన్సిల్ సమావేశ మందిరంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం కౌన్సిలర్ల ప్రమా ణ స్వీకారం.. అనంతరం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభా య్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, అధికారులు శ్రీనివాసాచారి, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్లలో ప్రజాస్వామ్య బద్ధంగా మేయర్ ఎన్నిక

- నిజామాబాద్‌లో సంఖ్యాబలం లేకపోవడంతో మేయర్ పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపిన ఎంపీ అరవింద్..
- కరీంనగర్‌లో సంఖ్యాబలం లేకున్న మేయర్ మేమే అని బండి సంజయ్ ఎలా చెబుతారు.
- కరీంనగర్‌లో మేయర్ పీఠం కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తుంది..
- రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్..
- మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పణ





రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 15 (జనంసాక్షి). కార్పొరేషన్, మున్సిపాలిటీలో ప్రజాస్వామ్యబద్ధంగా మేయర్ ను ఎన్నుకుంటారని రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్లో సంఖ్యాబలం లేకున్నా మేయర్ సీటు కైవసం చేసుకుంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎలా అంటారని అయన ప్రశ్నించారు. బిజెపికి మేయర్ కావలసిన సంఖ్యాబలం లేదా పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు స్వయంగా అక్కడ ఎంపీ అరవింద్ వెల్లడించారన్నారు. కరీంనగర్ కార్పొరేషన్లో మేయర్ సిటు కైయసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తుందన్నారు. మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ బీమన్న ఆలయానికి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వామివారికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించారు. బీమేశ్వర ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదొక్త ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో రమాదేవి స్వామివారి శేష వస్త్రాలు ప్రసాదాలు అందచేశారు.

అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన కరీంనగర్లో 69 కార్పొరేటలకు 30 మాత్రమే బిజెపికి వచ్చాయని,మిగితా అందరూ కార్పొరేటర్లు ప్రజాస్వామ్య బద్ధంగా మేయర్ ని ఎన్నుకుంటారన్నారు. మా ప్రభుత్వం తరుపున అభివృద్ధికి సహకరిస్తమన్నారు. బిజేపి యితర కార్పొరేటర్లని ఎకం చేసుకునే ప్రక్రియ జరుగుతుందన్నారు. మేయర్ సీటు కోసం కాంగ్రెస్ కు అవకాశం వుందన్నారు. తాము అందరిని కలుపుకొని మేయర్ సీటు కైవసం కోసం ప్రయత్నిస్తమన్నారు. బిజెపి ఎలా అనైతికంగా కలుపుకున్నారో తాము అలాగే ప్రయత్నాలు చేస్తమన్నారు. తమ పార్టీ ద్వారా గెలిచిన కార్పొరేటర్ల అభిప్రాయం తీసుకుని ముందుకు పోతమన్నారు. రాష్ట్రం అంతట వున్న మున్సిపల్, కార్పొరేషనలలో ఖచ్చితంగా క్యాంపు రాజకీయాలు ఉంటాయన్నారు.

**వెయ్యేళ్ళ అవసరాలకు సరిపడేలా ఆలయ అభివృద్ధి..**

వేములవాడ రాజన్న ఆలయం వచ్చే వెయ్యేలా అవసరాలకు సరిపడేలా స్వామివారి ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి ఏటా వందకోట్లు ఇస్తానని విస్మరించడంతో మంత్రి పొన్నం ప్రభాకర్, తాను అందరిని కలుపుకొని ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. ప్రశ్నించే గొంతుకులకు ప్రజలు అవకాశం ఇవ్వడంతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ 150 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వేములవాడను టెంపుల్ సిటీగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. వేములవాడ ఆలయం ఒక కన్ను అయితే పట్టణం అభివృద్ధి మరో కన్ను అన్నారు. వచ్చే బడ్జెట్లో ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు.

చొప్పదండి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లిన అనంతరం తనకు ఎన్నో విజయాలు కలిగాయని ఆలయ విశిష్టతను, స్వామి మహిమను చెప్పారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలోచనతో నిత్యాన్నదాన సత్రానికి రూ 35 కోట్లు మంజూరయ్యాయని త్వరలోనే టెండర్ పూర్తవుతుందన్నారు. ప్రజా ప్రభుత్వానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించే విధంగా సకాలంలో వర్షాలు పడి పంటలు అభివృద్ధి చెందాలని,లోక కళ్యాణం కోసం స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాజన్నను ప్రైవేటు వ్యక్తులు ఎలా దర్శించుకుంటారు

## బిజెపి రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని మహాశివరాత్రి రోజున ప్రైవేట్ వ్యక్తులు ఎలా దర్శించుకుంటారని బిజెపి రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ ప్రశ్నించారు. ఆదివారం అయన మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో మహాశివరాత్రి వేడుకలు భీమేశ్వరాలయంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండగా, ప్రైవేట్ వ్యక్తులు రాజన్నను ఎలా దర్శించుకుంటారని బిజెపి రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ ప్రశ్నించారు. భక్తులకు స్వామివారి దర్శనాలు రద్దు చేశారు. భక్తులకు బీమేశ్వర ఆలయంలో దర్శనలు కల్పించారు. మహాశివరాత్రి రోజున ప్రైవేట్ వ్యక్తులకు ఆలయ అధికారులు దగ్గరుండి మరీ దర్శనం చేయించారని అయన ఆరోపించారు. అనువంశిక అర్చకులు సైతం రాజన్న ఆలయంలోకి వెళ్లడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భీమేశ్వరాలయంలో దర్శనం చేసుకుంటే ప్రైవేట్ వ్యక్తులు దర్జాగా ఎలా వెళ్తారన్నారు. రాజన్న ఆలయంలో ఏర్పాటు చేసిన సిసి పుటేజి పరిశీలించి దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేశారు. ఆయన వెంట బిజెపి నాయకులు గోపు బాలరాజు నామాల శేఖర్ పాల్గొన్నారు.

# ఏఐఎఫ్‌బి కార్పొరేటర్‌లకు విప్ జారీ?



- పార్టీని ధిక్కరిస్తే చర్యలు..
- ఏఐఎఫ్‌బి కార్పొరేటర్ ను బిజెపిలో చేర్పించుకోవడం సిగ్గుచేటు
- ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి

కరీంనగర్ ప్రతినిధి (జనంసాక్షి) : కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ కార్పొరేటర్ విపుల సాయి జ్యోతి, 27వ కార్పొరేటర్ బోట్ల శ్యామలలకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ విప్ జారీ చేయడం జరిగిందని..ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి అన్నారు. కరీంనగర్ కార్యాలయంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ తో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జోజి రెడ్డి మాట్లాడుతూ ఏఐఎఫ్బి పార్టీ బి ఫాం పైన గెలిచిన ఇద్దరు కార్పొరేటర్ లో ఒకల్ని 15 డివిజన్ కార్పొరేటర్ సాయి జ్యోతిని కేంద్ర మంత్రి బండి బిజెపిలో చేర్చుకోవడం సిగ్గుచేటు అని అన్నారు..ఒక కమ్యూనిస్టు పార్టీలో గెలిచిన అభ్యర్థులను బిజెపి పార్టీలో చేర్చుకోవడానికి బండి సంజయ్ కి సిగ్గుండాలి అని, మేయర్ స్థానం కోసం బిజెపి వాళ్లు నీచమైన రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. బిజెపికి మేయర్ ఎన్నుకోవడానికి పూర్తిస్థాయిలో కార్పొరేటర్లు లేరని కావున ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిని కిడ్నాప్ చేసి పార్టీలో చేర్చుకోవడం జరుగుతుందని, ఇప్పటివరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్పొరేషన్ లో ఎవరికి మద్దతు ఇవ్వాలో అధికారికంగా ప్రకటించలేదని మా పార్టీ బీఫామ్ పైన గెలిచి ఇతర పార్టీలకు వెళితే నాయపనమైన ఏమైనా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్లకు విప్ జారీ చేయడం జరిగిందని సోమవారం ఉదయం 10 గంటల వరకు ఆలిండియా ఫార్వర్డ్ బ్యాక్ పార్టీ కేంద్ర రాష్ట్ర కమిటీలు ఎవరికి మద్దతు ఇవ్వాలో స్పష్టత వస్తుందని బిజెపికి మద్దతు ఇచ్చే పరిస్థితి లేదని మత రాజకీయాలను రెచ్చగొట్టే విధంగా బిజెపి వాళు చేస్తున్నారని దీని తీవ్రంగా ఖండిస్తున్నామని ఉన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ బీఫామ్ పైన గెలిచిన కార్పొరేటర్ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా బిజెపి పార్టీ గుర్తిస్తుందని ఏ పార్టీలో గెలిచారో కూడా తెలుసుకోకుండా ఇతర పార్టీలో గెలిచిన వారికి బిజెపి కండువలు వేస్తున్నారని అన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కమిటీ కరీంనగర్లో కార్పొరేషన్ లో గెలిచిన 15 డివిజన్ కార్పొరేటర్ సాయి జ్యోతి 27 డివిజన్ కార్పొరేటర్ శ్యామలకు విప్ జారీ చేయడం జరిగిందని పార్టీని ధిక్కరిస్తే పార్టీ పరంగా చర్యలు తప్పవని అన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ నగర అధ్యక్షుడు సత్య రావు తదితరులు పాల్గొన్నారు..

# గిరిజనుల సంక్షేమానికి నిరంతర కృషి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు



హైదరాబాద్(జనంసాక్షి) : గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. గిరిజనుల సంక్షేమానికి తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. గిరిజన నాయకుడు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఆదివారం బిజెపి రాష్ట్ర ఎస్‌టి మోర్చా అధ్యక్షుడు రవి నాయక్ అధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రసంగిస్తూ ప్రస్తుతం గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి ఎక్కువగా కేంద్ర ప్రభుత్వ ఐటీడీఏ నిధుల ద్వారానే సాధ్యమవుతోందని తెలిపారు. సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ప్రతి సంవత్సరం తమ పార్టీ ట్రైబల్ మోర్చా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

సేవాలాల్ మహారాజ్ జీవితం తమ పార్టీ నమ్మే సిద్ధాంతాలకు ఎంతో దగ్గరగా ఉందని ఆయన చెప్పారు. దేశాన్ని విదేశీ శక్తుల ఆధిపత్యం నుంచి విముక్తి చేయాలనే సంకల్పంతో పాటు, ప్రకృతి–పర్యావరణ పరిరక్షణకు ఆయన జీవితాంతం అంకితమయ్యారని తెలిపారు. బంజారా సమాజానికి శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ ఆరాధ్య దైవమని, పర్యావరణాన్ని కాపాడే దేవుడిగా ఆయనను గిరిజన సమాజం భావిస్తుందని అన్నారు. విదేశీ పాలన కాలంలో ఒకవైపు విదేశీయులపై పోరాటం చేస్తూనే, మరోవైపు ప్రకృతి పరిరక్షకుడిగా నిలిచిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అని ఆయన కొనియాడారు.

జగదాంబ మాత ఉపాసకుడిగా, భక్తి శ్రద్ధలతో జీవించిన సేవాలాల్ మహారాజ్ బోధనలు నేటి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. గిరిజనుల సంక్షేమానికి అనేక చారిత్రాత్మక నిర్ణయాలను ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్నారని ఆయన వివరించారు. గిరిజన కమిషన్ ఏర్పాటు, ప్రత్యేకంగా గిరిజన మంత్రి, గిరిజన సంక్షేమానికి అత్యధిక నిధుల కేటాయింపు వంటి కీలక నిర్ణయాలను ప్రధాని మోదీ తీసుకున్నారని ఆయన గుర్తుచేశారు. ములుగులో సమ్మక్క–సారలమ్మ గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు విస్తరించాయని తెలిపారు. అలాగే మహారాష్ట్రలో సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణం చేపట్టడం గిరిజన సంస్కృతికి ఇచ్చిన గౌరవంగా ఆయన అభివర్ణించారు. ఇంకా గిరిజనుల విద్య, ఉపాధి, ఆరోగ్య సంక్షేమం కోసం అనేక పథకాలు అమలులోకి వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తండాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ప్రకటించినప్పటికీ, సరైన నిధులు విడుదల చేయలేదని, సంక్షేమ పథకాలు అందించలేదని రాంచందర్ రావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి వ్యాఖ్యల దుమారం

**చండూరు, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు మరోసారి పెను దుమారం రేపుతున్నాయి. కొంతకాలంగా మంత్రి పదవి ఆశిస్తున్న ఆయన, తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే, తన తదుపరి లక్ష్యం నేరుగా ముఖ్యమంత్రి పదవేనని రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. “మంత్రిని చేస్తారా చేయండి.. లేదంటే నా టార్గెట్ నేరుగా సీఎం సీటే” అంటూ ఆయన స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం ముందే హామీ ఇచ్చిందని, ఆ మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మునుగోడు ప్రజల ఆశీర్వాదంతో తాను ఏ పదవికైనా సిద్ధమని పేర్కొన్నారు. పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్ రెడ్డి చెప్పడాన్ని రాజగోపాల్ రెడ్డి తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎవరి సొంత సామ్రాజ్యం కాదని, ప్రజాస్వామ్యబద్ధంగా అధిష్ఠానం నిర్ణయం మేరకు నాయకత్వం ఉంటుందని ఆయన గుర్తు చేశారు. ఇటీవల జరిగిన చౌటుప్పల్, చండూరు మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం తన నియోజకవర్గంలో నిర్వహిం చిన విజయోత్సవ ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# అన్నపూర్ణ’ చెంత.. అమ్మకు తీరిన చింత..

- కదిలిలో ‘చంటిబిడ్డలకు పాలిచ్చే గది’....
- శివరాత్రిరోజు ప్రారంభించిన ‘స్వప్న ఆస్పత్రి
- చంటిపిల్లలున్న తల్లుల హర్షం




**నిర్మల్ రూరల్, ఫిబ్రవరి15 (జనంసాక్షి) :** ఆకలితో ఉన్న చంటిబిడ్డకు ఏ తల్లయినా ప్రశాంతంగా పొట్టనిండా పాలుపట్టాలనుకుంటుంది. ఇంట్లో ఉన్నప్పుడు ఇందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు,కానీ పబ్లిక్ ప్రాంతాల్లో అలాంటి అమ్మలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఇబ్బందిని గుర్తించిన నిర్మల్ జిల్లాకేంద్రంలోని ‘స్వప్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి’చంటిపిల్లలకు తల్లులు ప్రశాంతంగా పాలు పట్టేలా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే నిర్మల్ జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో తొలిసారి చిన్నారులకు పాలు పట్టడానికి ప్రత్యేకంగా ఓ గదిని ఏర్పాటు చేశారు. చుట్టూ ఎంతమంది ఉన్నా,ఇప్పుడు పిల్లతల్లులు వారి చంటిపిల్లలకు ఆ గదిలో ప్రశాంతంగా పాలుపడుతున్నారు. నిర్మల్ బస్టాండ్‌లో స్వప్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుచేసిన చంటిపిల్లలకు పాలిచ్చే గదిని,దానివల్ల తల్లులకు తొలగిన ఇబ్బందిని కదిలి మాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం పూజారి గమనించారు. కదిలి ఆలయానికి వచ్చే తల్లులు అక్కడ అందరి ముందు తమ చిన్నారులకు పాలను పట్టడానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్వప్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు నాళం స్వప్న,శశికాంత్‌ల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆ వైద్యదంపతులు అన్నపూర్ణ చెంత.. అమ్మలకు చింత ఉండకూడదని పిల్లలకు పాలిచ్చే గది ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఆలయప్రాంగణంలో ఏర్పాటుచేసిన గదిని శివరాత్రి పర్వదినాన ఆదివారం ప్రారంభించారు. ఆలయానికి వచ్చిన ఓ చంటిపిల్ల తల్లితోనే ఈ గదిని ప్రారంభింపజేయడం మరింత విశేషం. ఇలాంటి ఇబ్బందులను తొలగించడానికి తమవంతుగా సాయపడటం మంచి అనుభూతిని ఇస్తోందని వైద్యదంపతులు నాళం స్వప్న,శశికాంత్‌లు తెలిపారు. పబ్లిక్ ప్రాంతాల్లో తాము ఇబ్బంది పడకుండా పిల్లలకు పాలివ్వడానికి గదిని ఏర్పాటు చేసిన స్వప్న ఆస్పత్రికి చంటిపిల్లల తల్లులు,ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# ఆదిలాబాద్ కళాకారుల ప్రతిభకు ప్రశంసలు



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** జిల్లాలో కళాకారులకు కొదవ లేదని వారిలో ఎన్నో కళలు దాగి ఉన్నాయని వాటిని బయటి ప్రపంచానికి చూపించాల్సిన అవసరముందని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల పరిరక్షణ సమితి సభ్యుడు సామాజిక కార్యకర్త తోట శివన్న అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని భీంపూర్ మండలం గుబిడి గ్రామంలో జరిగిన భజన పోటీలలో 12 వ వార్డుకు సంబంధించి శ్రీ రమా సహిత సత్యనారాయణ భజన మండలికి నాలుగవ బహుమతి రావడంతో వారికి భజన మండలి సభ్యుడుగా మరియు తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల పరిరక్షణ సమితి సభ్యుడుగా వారికి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించడం జరిగిందని ఆయన తెలిపారు.



# శివనామ స్మరణతో మార్మోగిన శివాలయం

- ప్రత్యేక అభిషేకంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్
- అన్నదానం, ఎద్దుల పందెలను ప్రారంభించిన ఐరా రియాల్టీ చైర్మన్ పోశం నర్సి రెడ్డి దంపతులు



**మేళ్లచెరువు (జనంసాక్షి) :** మహాశివరాత్రి జాతర సందర్భంగా మేళ్ల చెరువులోని ఇష్ట కామేశ్వరి సమేత స్వయంభూ శంభూలింగేశ్వర స్వామి ఆలయం భక్తుల శివనామస్మరణంతో మార్మోమోగింది. ఉదయం 4గంటలకే స్వామి వారి ప్రత్యేక అభిషేక కార్యక్రమం లో రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకు ముందు ఆలయ సిబ్బంది మంత్రి కి వేద మంత్రోచ్చరణలతో ఘన స్వాగతం పలికి అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా చూడాలని ఆలయ సిబ్బందికి సూచించారు. దేవాలయ అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎడ్ల పందాలు, ఉమెన్స్, మెన్స్ కబడ్డీ పోటీలను నిర్వహించడం శుభపరిణామమన్నారు.

### అన్నదానం ప్రారంభం

మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఐదు రోజుల పాటు నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఐరా రియాల్టీ చైర్మన్ పోశం నర్సిరెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈసందర్భంగా నర్సి రెడ్డి మాట్లాడుతూ అన్నదానానికి వచ్చే భక్తులకు రుచి సుచితో తో కూడిన అన్నాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. రోజుకు లక్షల సంఖ్యలో వచ్చే భక్తులకు ఎప్పటికప్పుడు అన్నదానాన్ని అందించాలన్నారు.

### ఎడ్ల పందాలు ప్రారంభం

మహా శివరాత్రి జాతరలో ప్రత్యేక ఆకర్షణ నిలిచే రాష్ట్ర స్థాయి ఎడ్ల పందాలను ఐరా రియాల్టీ చైర్మన్ పోశం నర్సి రెడ్డి ప్రారంభించారు.




# మేం గెలిచినా మున్సిపల్ సీటును కాంగ్రెస్ లాక్కుంది

- కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధిచెప్తారు
- తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మేం గెలిచినా మున్సిపల్ సీటును కాంగ్రెస్ లాక్కుందని, కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధిచెప్తారని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. **బంజారాహిల్స్‌**లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగ్ బండార్ నిర్వహించి, సేవాలాల్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.. కార్యాలయంలో జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్, పలువురు బంజారా పూజారులు, జాగృతి బంజారా నాయకులు పాల్గొన్నారు. అనంతరం కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో అడిగేవాళ్లు, ప్రతిపక్షం ఉండొద్దా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఇలాగే చేసిందని, ఇప్పుడు అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో కూర్చుందని తెలిపారు. బంజారా జాతి మేలు కోసం పోరాడిన సేవాలాల్ గారి పాఠ్యాంశం దేశ వ్యాప్తంగా ఉండాలని, బంజారాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ మోసం చేసిందని, బంజారాలకు, ఆదివాసీలకు ఈ ముఖ్యమంత్రి లొల్లి పెట్టిస్తున్నాడని, జీవో 33 ప్రకారం బంజారాలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ దేశ వ్యాప్తంగా బంజారా జాతి మేలు కోసం కృషి చేశారని, ఆయన జీవిత పాఠ్యాంశం దేశ వ్యాప్తంగా పుస్తకాల్లో ఉండాలని డిమాండ్ చేవారు. గోర్ భోళి భాషను కచ్చితంగా 8 వ షెడ్యూల్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. పేదరికాన్ని నిర్మూలించాలంటే ప్రత్యేక కార్యాచరణతో ప్రత్యేక ఫండ్ ను కేటాయించాలని, అన్ని పార్టీలు బంజారా శాఖను పెట్టుకుంటాయి. కానీ జాగృతి మాత్రం మెయిన్ బాడీలోనే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బంజారా బిడ్డకు అవకాశం ఇచ్చిందని, సేవాలాల్ స్వాభిమానం, సామాజిక న్యాయం ఉండాలన్నారు. బంజారాలు మంచి పొజిషనల్‌లో ఉండాలని, రాజకీయాల్లో వారి రిప్రజేంటేషన్ ఉండాలని, మన తండాల్లో మన రాజ్యం అని తెలంగాణ వచ్చాక చేసుకున్నామని, యువమిత్రులు తండాల్లో వెలుగులు నింపేలా నాయకత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వారు పోటీ చేయాలని, లీడర్ షిప్ కావాలనుకునే యువత గ్రామాల్లో ఉండాలని, తండాలను గ్రామపంచాయితీలుగా చేసుకున్నప్పటికీ సరైన వసతులు మాత్రం లేవని తెలిపారు. ఈ పరిస్థితి మారాలంటే ముఖ్యమంత్రి ప్రతి తండాకు రూ. 25 లక్షలు ఇవ్వాలని, తండాల్లో రేషన్ షాప్ లు, గ్రామపంచాయితీ, అంగన్ వాడీలు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో కూడా సేవాలాల్ విగ్రహం పెట్టాల్సిందేనని డిమాండ్ చేవారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో జాగతో పాటు ఆరు లక్షలు ఇస్తామన్నారు. ఉన్న ఇళ్లనే గుంజుకునే పరిస్థితికి తెచ్చారు. ఇక అసైన్డ్ భూముల విషయంలోనూ అన్యాయంగా వ్యవహరిస్తున్నారు. ఏ ప్రాజెక్ట్ వచ్చిన సరే అసైన్డ్ భూములను ముందుగా లాక్కుంటున్నారు. సేవాలాల్ పేరుతో, ఆదివాసీల పేరుతో, ఎరుకల తెగ పేరుతో ఏర్పాటు చేస్తామన్న మూడు కార్పొరేషన్లను వెంటనే ఏర్పాటు చేయాలని, ఐటీడీఏలలోనే ఉద్యోగాల రిక్రూట్ మెంట్ అని తెలిపారు.







Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370